ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 46 పేజీలు: 8+16 వెల: 6.50

లండన్‌లో చిరు.. నేడు బ్రిటన్ పార్లమెంటు పురస్కారం
ఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్, పుతిన్ ఫోన్ చర్చలు
2

# బిసి కులసర్వే అపూర్వం

## లెక్కలకు చట్టబద్ధత కోసమే సర్వే

### 56.36 శాతంగా తేలిన బిసిల లెక్క

### 25న ధర్నాకు మద్దతిస్తాం

### బిసి సంఘాల నేతల ఆత్మీయ సమ్మేళనంలో సిఎం రేవంత్



మంగళవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విహెచ్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి18:** ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులసర్వే నిర్వహించాం, 50శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకోవాలంటే ముందుగా జనాభా లెక్క తేలాలి,ఆ లెక్కలకు చట్టబద్ధత కల్పించాలి.. అప్పుడే రిజర్వేషన్లు పెంచుకునేందుకు వీలుంటుంది...అందుకే రాష్ట్రంలో బీసీ కులసర్వే నిర్వహించుకున్నాం అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల్ కమిషన్ కూడా బీసీల లెక్క 52 శాతం అని తేల్చిందని, కానీ మేం కులసర్వే ద్వారా బీసీల లెక్క 56.36 శాతంగా తేల్చాం.. లెక్కతేల్చడం కోసమే స్థానిక ఎన్నికలు వాయిదా వేశాం. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బీసీలకు అండగా ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం అసెంబ్లీలో కలిసి టిపిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలివచ్చి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బీసీల ఆత్మీయ సమ్మేళనంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అభినందనలు నాకు కాదు ఈ అభినందనలు అందించాల్సింది రాహుల్ గాంధీకి, భారత్ జోడో యాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తామని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఫిబ్రవరి 4కు ప్రత్యేక స్థానం ఉందని, ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డేగా ప్రకటించుకున్నామని తెలిపారు. పక్కా ప్రణాళికతో మంత్రివర్గ ఉపసంఘం, అ తరువాత డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఒక టైం ఫ్రేమ్ లో కులసర్వే పూర్తి చేశామన్నారు.మొదటి విడతలో కులసర్వేలో పాల్గొనని వారికోసం రెండో విడతలో అవకాశం కల్పించామన్నారు,పూర్తి పారదర్శకంగా కులసర్వేను పూర్తి చేశాం.. ఏ పరీక్షలోనైనా మనం చేసిన పాలసీ డాక్యుమెంట్ నిలబడేలా జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లెక్కలు తేల్చాలన్నా మన రాష్ట్రాన్ని

>>2

# ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఓకే



## 3 గ్రూపులుగా 59 కులాలు

### వాటికి మెత్తం 15 శాతం రిజర్వేషన్లు

### ఉద్యమంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇల్లు, ఉపాధి

### శాసనసభలో సిఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోద ముద్ర వేసింది. 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ తీసుకొచ్చిన బిల్లుకు విపక్షాలతో సహా అన్ని పార్టీల సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. గ్రూప్1లోని అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం రిజర్వేషన్, మాదిగలున్న గ్రూప్2 లోని కులాలకు 9 శాతం రిజర్వేషన్లు, మాలలు ఉన్న గ్రూప్ 3 లోని కులాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో ఏ ఒక్కరికీ అన్యాయం జరకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సుదీర్ఘమైన వర్గీకరణ పోరాటంలో ఎంతో మందిప్రాణాలు కోల్పోయారు. ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్న చారిత్రాత్మకమైన సందర్భం ఇదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ హామీకి అనుగుణంగా వర్గీకరణ ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ వర్గకరణ ప్రక్రిలో ఉత్తమకుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం, ఏక సభ్య కమిషన్ చేసిన కృషిని అభినందించారు. ఇప్పటివరకు 59 కులాలు పొందిన ప్రయోజనాల ఆధారంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సులు చేసిందని వెల్లడించారు. ఈ

>>2

# నేడు రాష్ట్ర బడ్జెట్

## 2025-26 సంవత్సరానికి రూ.3.21 లక్షల కోట్లు అంచనా

### ఉ.11 గం.కు పద్దు సమర్పించనున్న డి.సిఎం భట్టి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి18:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి భారీ బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో డిప్యూటీ సిఎం,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఎలాంటి కొత్త పథకాలు,ప్రతిపాదనలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నది అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రూ.3.21 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈసారి తెలంగాణ బడ్జెట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ మేరకు కేబినెట్ బుధవారం ఉదయం 9:30 గంటలకు అసెంబ్లీ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో సమావేశమై రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు నిమిషాలకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఇదే సమయంలో శాసనమండలిలో ఐటీ,పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టనున్నారు. ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రెండో బడ్జెట్ కావడంతో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఓవైపు పెరుగుతున్న ఖర్చులకు తగినట్లుగా ఆదాయం పెంపు, మరోవైపు సంక్షేమం, అభివృద్ధి మేళవింపుగా కేటాయింపులు ఉంటాయని ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమమే ప్రధాన అంశాలుగా అంచనాలు సిద్ధం అవుతున్నాయి. గతేడాది 2024-25లో

>>2



## ఆధార్ + 'ఓటరు' లింక్

### కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ, మార్చి 18:** ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానంచేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనితో ఆధార్‌కార్డుతో ఓటర్ ఐడి అనుసంధాన ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించింది. దీనికోసం మంగళవారం సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఓటరు గుర్తింపుకార్డుల్లో అవకతవకలు జరుగుతున్నాయని అనేక విమర్శలు వెల్లువత్తాయి. ఈక్రమంలోనే ఓటరుకార్డును, ఆధార్ కార్డుతో అనుసంధానంచేసే అంశంపై మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం అత్యున్నతస్థాయి సమావేశంనిర్వ హించింది. నిర్వాచన్‌సదన్‌లో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్‌సింగ్ సంధు, డాక్టర్ వివేక్‌జోషి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి లెజిస్లేటివ్ డిపార్టుమెంట్

>>2

# ఎస్టీ సెగ్మెంట్లలో అత్యధిక ఇందిరమ్మ ఇళ్లు

## అసెంబ్లీలో మంత్రి పొంగులేటి

### సాగు, తాగునీటి సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** గిరిజనుల జనసాంద్రత ఎక్కువగా ఉండే నియోజకవర్గాలలో ప్రతినియోజకవర్గంకు సాధారణంగా కేటాయించే 3500 ఇళ్ళకంటే ఎక్కువ ఇళ్ళను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రిగా నేను ఒక నిర్ణయానికి వచ్చామని రెవెన్యూగృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ జిరో అవర్‌సందర్భంగా ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో వివరించారు. మంగ ళవారం స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ ఐదవ రోజు ప్రశ్నోత్తరాల సమయంను రద్దుచేసి జిరో అవర్‌తోనే సభను ప్రారంభించి 26 మంది ఎమ్మె ల్యేలకు వారివారి నియోజకవర్గ సమ్యలు,జనరల్ సమ్యలు తెలిపేందుకు అవకాశం కల్పించారు. అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్,బిఆర్ఎస్,బిజెపి ఎమ్మెల్యేలు సాగు,తాగు నీటి సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే గండ్రసత్యనారాయణ జిరో అవర్‌లో తొలిగి ప్రసంగిస్తూ భూపాలపల్లి నియోజకవర్గం గోరుకొత్తపల్లిలో 27కోట్ల రూపా యలతో దేవాదుల ఫేజ్ టూ నుంచి నీటిని తీసు కొచ్చి 44వేల ఎకరాల భూమలకు సాగునీటి కలుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం 220కోట్లు వ్యయం చేసినా బీంఘణపురం, రామప్ప, చలివాగుకు జలకళ రాలేదని నిధుల దుర్వినియోగం,కాంట్రాక్టు సంస్థ పనులపై విచారణ జరుపాలని ఆయన ప్రభుత్వంను కోరారు. చెల్పూరు గుర్రపాడు బైపాస్‌రోడ్ త్వరగా నిర్మించాలని మెడికల్‌కాలేజిలో మౌళికవసతులు, స్టాఫ్ పెంచాలని,పర్యాటకంగా అభివృద్ధి పరుచాలని కోరారు.మునుగోడు నియోజకవర్గంలో తాగునీటీ సమస్య వివరిసూనత ప్రపంచలోనే అత్యధిక ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం తన నియోజకవర్గం తెలిపారు. గత ప్రభుత్వం ఇంటింటికి నల్ల ఇచ్చి తాగునీరు ఇస్తామని మిషన్‌భగీరథ పేరుతో 50వేల కోట్లు అప్పుతెచ్చి రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలు చేశారని కానీ ఎక్కడ కూడా నీరు రావడంలేదని అన్నారు. తన నియో జకవరగం చౌటుప్పల్ పట్టణంలోనే మిషన్‌భగీరథ పైలాన్ కట్టారని విచత్రమేమంటే అక్కడే నీళ్ళు రావడంలేదని ఆవేదన చెందారు. మిషన్ భగీరథ కోసం వేలకోట్ల రూపాయలు అప్పులు చేసి కాంట్రాక్టర్లను బాగుపరిచారని ఆయన విమర్శించారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుండటంతో నారాయణపూర్ చౌటుప్పల్ మండలాలలో భూగర్భ జలాలు పడిపోయి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. 2011 జనాభాలెక్కల ప్రకారం చౌటుపల్పల్ పట్టణానికి తాగునీటి కేటాయింపులు జరిగాయని అక్కడ పరిశ్రమలు కేంద్రీకృతమై అభివృద్ధి శరవేగంగా అభివృద్ధిచెందడంతో జనాభా పెరిగిందని ఇప్పటికైనా జనాభా ప్రాతిపదికన నీరు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటి అవసరాలు తీర్చడానికి ప్రతిపాదనలు చేయడంతోపాటు గంగాధర మండలం నారయణపూర్

>>2

## హైడ్రా పేరుతో వసూళ్ల దందా



### పేదల ఇళ్లపై పగపట్టిన సర్కార్: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి18:** రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు నిప్పులు చెరిగారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి.. కమీషన్లు ఎక్కడ వస్తాయో అక్కడ దృష్టి పెట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో వసూళ్ల దందా.. మూసీ పేరుతో పేదల ఇండ్లపై పగబట్టిందని మంగళవారం ట్విట్టర్ ద్వారా విరుచుకుపడ్డారు. ఫార్మాసిటీ పేరుతో భూముల చెర.. ఫోర్త్ సిటీ పేరుతో సీఎం కుటుంబ రియల్ వ్యాపారం చేస్తుందని ఆరోపించారు. ట్రిపుల్‌ఆర్ పేరుతో పేదల భూముల ఆక్రమించుకుంటుందన్నారు. పేదలపై ప్రతాపం చూపిస్తూ.. పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకుంటుందన్నారు. నాడు మద్యం వద్దని చెప్పిన రేవంత్ రెడ్డి.. నేడు మద్యం ముద్దు అంటున్నారని పేర్కొన్నారు. ధరల సవరణ పేరుతో, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు చేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి.. వాటిపై ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా రాదు.. రుణమాఫీ కాదు.. పంటలు కొనుగోలు చేయరు.. రూ.500 క్వింటాలు ధాన్యానికి

>>2

# 2 బిసి బిల్లులు కౌన్సిల్‌లో ఏకగ్రీవం



### మద్దతిస్తూ అమలుకు చొరవచూపాలని కోరిన విపక్షాలు

#### అన్ని పార్టీల నేతలకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల(బిసి) వారికి విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంతోపాటు.. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లను అమలు చేయడానికి సంబంధించిన రెండు బిల్లులు మంగళవారం శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి సభ్యులతోపాటు ఎంఐఎం ఇతర సభ్యులు బిల్లులకు సంపూర్ణ మద్దతు తెలపడంతో.. రెండు బిల్లులు కూడా ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. శాసన మండలి సమావేశాలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిన ప్రకటించారు. సుమారు గంటన్నర సేపు ప్రశ్నోత్తరాలు కొనసాగగా.. అనంతరం బిసి బిల్లులను ప్రవేశ పెట్టాలని చైర్మన్ గుత్తా బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి సూచించారు. దీంతో మంత్రి సభలో బిల్లులను ప్రవేశ పెట్టారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ.. రెండు వేరు వేరు బిల్లులు శాసన మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశ పెట్టారు. అన్ని పార్టీల నాయకులు ఢిల్లి కేంద్రంగా బిల్లు పాస్ చేసుకుందామన్నారు. ఏప్రిల్ 4వ తేది వరకు పార్లమెంట్ ఉందని.. ఈలోపుగా ప్రధానిని కలుద్దామని చెప్పారు. ప్రభుత్వానికి అందరూ సహకరించి.. ఏకగ్రీవంగా ఆమోదించాలని మంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు. బిల్లుపై కాంగ్రెస్ సభ్యులు బి మహేష్ కుమార్ గౌడ్, ఎల్ రమణ, ఏవిఎన్ రెడ్డి, కల్వకుంట్ల కవిత, ఎఫెండీ, ఎగ్గే మల్లేషం, తీన్మార్ మల్లన్న, భానుప్రసాద రాదు, అమీర్ అలీ ఖాన్, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, జీవన్‌రెడ్డి తదితరులు చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ .. బిసి బిల్లును తెచ్చినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్టు తెలిపారు. ఒకరోజు మొత్తం ఇదే అంశంపై చర్చ జరిగితే బాగుండేదన్నారు. బిల్లు పెట్టడమే కాకుండా చట్టం చేసి అమలు చేయడంపై కాంగ్రెస్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కాలేల్కర్ కమిటీ నివేదికను పక్కన పడేసిందే కాంగ్రెస్ పార్టీయేనని.. కవిత గుర్తు చేశారు. బీపీ మండల్ కమిషన్ నివేదికను ఇందిరాగాంధీ 10 ఏళ్ల పాటు అమలు చేయలేదని.. వి.పి సింగ్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1990లో అమలు చేశారని అన్నారు. పార్లమెంటులో రాజీవ్ గాంధీ బీసీలకు వ్యతిరేకంగా ప్రసంగం చేశారని గుర్తు చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం

>>2

## టెన్త్ పరీక్షలకు 5 నిమిషాలు 'గ్రేస్'

### 2650 కేంద్రాలు ఏర్పాటు



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్ ఇస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఏ కృష్ణారావు తెలిపారు. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొన సాగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షల కోసం 2650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

>>2

# తెలంగాణలో రష్యా పెట్టుబడులు!

### మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశంలో ఆసక్తి చూపిన వివిధ కంపెనీల ప్రతినిధులు

### 200 ఎకరాల ఎఐసిటి గురించి వివరించిన మంత్రి



మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయిన రష్యా కంపెనీల ప్రతినిధులు

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించిన రష్యా ప్రభుత్వ ప్రతినిధులకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంగళవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పారిశ్రామికవేత్తలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి వివరించారు. గ్లోబల్ కేపిటల్ ఆఫ్ ఏఐగా తెలంగాణను తీర్చి దిద్దేందుకు అత్యంత ప్రతిష్మాత్మకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులో రష్యా కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని ప్రతినిధులను కోరారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ కంపెనీల్లో అధికశాతం తెలంగాణలో తమ కార్యకలాపాలను నిర్వర్తిస్తున్నాయన్నారు. జిసిసిలకు హబ్, వ్యాక్సిన్ కేపిటల్‌గా హైదరాబాద్ మారిందన్నారు. యూఎస్ తర్వాత అతిపెద్ద జిసిసిని అమ్జెన్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం తమకు గర్వకారణమన్నారు. టిహబ్, టివర్క్స్ వంటి సంస్థల ద్వారా

>>2



మంగళవారం యాదగిరి గుట్టలో మిస్ యూనివర్స్ విక్టోరియా క్జార్ థెయిల్విగ్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

# యాదగిరీశుని దర్శించుకున్న ప్రపంచ సుందరి

**యాదగిరిగుట్ట మార్చి 18 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని మంగళవారం మిస్ యూనివర్స్ విక్టోరియా క్జార్ థెయిల్విగ్ దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ ఈవో భాస్కర్ రావు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరము ఆలయ ముఖమండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఫోటో, ప్రసాదము ఆలయ ఈవో భాస్కరరావు అందజేశారు. అనంతరం మిస్ యూనివర్స్ విక్టోరియా క్జార్ థెయిల్విగ్‌కి ఈవో భాస్కర్ రావు ఆలయ విశిష్టత, ఆలయ సాంప్రదాయాలను తెలియజేశారు. మిస్ యూనివర్స్ మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు.

# హైకోర్టు సంచలన తీర్పు

## పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి18:** ఓ పిటీషనర్ విషయంలో మంగళవారం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించిన పిటీషనర్‌కు ఏకంగా రూ.1కోటీ జరిమానా విధించింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పు వెలువరించారు. ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించిన పిటిషనర్ దారుడికి రూ.కోటి జరిమానా విధించారు. హైకోర్టులో పెండింగ్లో ఉన్న విషయాన్ని దాచిపెట్టి వేరే బెంచ్ వద్ద పిటిషన్లు దాఖలు చేయడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేలా రిట్ పిటిషన్లు వేయటంపై జస్టిస్ నగేశ్ భీమపాక సీరియస్ అయ్యారు.కాగా, అత్యంత భారీ జరిమాన విధించడంపై న్యాయవాద వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# హైడ్రా పేరుతో వసూళ్ల దందా

>> బోనస్ బోగస్ అయింది.. తులం బంగారం ఇయ్యరు.. ఉద్యోగాలు వేయరు.. ఉద్యోగులకు పీఆర్సీ రాదు, డీఏలు ఇవ్వరు అని కేటీఆర్ మండిపడ్డారు. సత్యం వధ.. ధర్మం చెర బట్టిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో అథం పాతాళానికి తీసుకెళ్లారు. ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారు. ఇది పాలన కాదు పీడన.. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు

# టెన్త్ పరీక్షలకు 5 నిమిషాలు 'గ్రేస్'

>> పరీక్షల నిర్వహణ కోసం 28,100 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 11,547 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్స్ నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో 2,58,895 మంది బాలురు ఉండగా.. 2,50,508 మంది బాలికలున్నట్టు చెప్పారు. పరీక్షలకి సంబంధించిన హాల్ టికెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపించామని.. అలాగే ఎస్ఎస్‌సి బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనూ పొందుపర్చినట్టు తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఓకే

>> కమిషన్ చేసిన సిఫార్సులను ఎక్కడా ఎటువంటి మార్పులు చేయకుండా యదాతథంగా ఆమలు చేశామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగిందని, దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారని అన్నారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని తెలిపారు. కాగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించామని అన్నారు. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించామని, మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించామని, కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించిందని వివరించారు. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించామని, 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించిందని, 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని వివరించారు. దళితులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని తెలిపారు. పార్టీలోను, ప్రభుత్వంలోనూ ఎస్సీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే వర్గీకరణకు అనుకూలంగానే శాసనసభలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఖచ్చితంగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. వారి కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. వర్గీకరణ సమస్యకు శాశ్వతపరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ సమర్థిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2026 జనగణన పూర్తి కాగానే ఆ లెక్కల ప్రకా ప్రరం ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని వివరించారు. రిజర్వేషన్లు పెంచడంతో పాటు, వాటిని సహేతుకంగా పంచడం తమ బాధ్యతని, సభా నాయకుడిగా నేను మాట ఇస్తున్నాని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

# బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై ఇడి ఆరా

## పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాల సేకరణ

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగంలో దిగింది. బెట్టింగ్ యాప్‌లను కొందరు సినీ తారలతో పాటు యూ ట్యూబర్లు ప్రమోట్ చేయడాన్ని పలువురు తప్పు పడుతుండడం తెలిసిందే. ఈ క్రమంలోనే పం జాగుట్ట పోలీసు స్టేషన్‌లో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి అందిన ఫిర్యాదుపై 11 మంది ప్రముఖులపై కేసు నమోదయ్యింది. వీరిలో సినీ నటి, ఎపి వైకాపా నేత శ్యామలతో పాటు యూ ట్యూబర్లు హర్షసాయి, టేస్టీ తేజా, టివి నటులు విష్ణు ప్రియ సహ పలువురు వున్నారు. ఇందులో కొందరు పోలీసుల విచారణకు హాజరై త మకు కొంత గడువు కావాలని కోరగా మిగతా వారు విచారణకు హాజరయ్యేందుకు సమయం కోరారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారికి లక్షలాది రూపాయ లు కమీషన్లు ముడుతున్నాయని, ఇదంతా హవాలా రూపంలో అందుతున్నాయని వార్తలు వస్తుండడంతో ఇందులోని నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు ఈడీ అధికారు లు రంగంలో దిగారు. ఇందులో భాగంగా పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలను తెప్పించుకున్నారు. ఇక్కడ నమోదైన ఎఫ్ఐఆర్‌లో వున్న వారి పే ర్లతో పాటు వీరిపై వున్న సెక్షన్లను పరిశీలిస్తున్నారు. ఈ కేసులో పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరైన వారిని తాము కూడా విచారించాలని ఈడీ అధికా రులు నిర్ణయించినట్లుగా తెలిసింది.

# ఆధార్ + 'ఓటరు' లింక్

>> కార్యదర్శియుఐడిఎఐ, ఈసీఐ సాంకేతికనిపుణులు భేటీ అయ్యారు. ఈభేటీ ప్రధాన ఉద్దేశ్యం అర్హులైన అందరికీ ఓటర్లుగా నమోదుచేసుకునే అవకాశం కల్పించడంతో పాటు నకిలీ ఐడికార్డులను తొలగించడం వంటి అంశాలపై చర్చజరిగింది. ఈ చర్చలో ఓటర్ కార్డులను ఆధార్‌తో అనుసంధానంచేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎపిక్‌కార్డు ఆధార్‌తో లింక్‌చేయడంకోసం 326 అధికరణం ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఆధార్‌కార్డు ఓటరు కార్డు అనుసంధానికి ఎన్నికల సంగం నిర్ణయించింది. ఈసీ నిర్ణయంతో త్వరలో యుఐడిఎఐ, ఈసీఐ నిపుణులమధ్య సాంకేతికప్రక్రియ ప్రారంభం కానుంది. రాజ్యాంగంలోని 326 అధికరణం ప్రకారం భారతపౌరుడికి మాత్రమే ఓటుహక్కు, ఆధార్‌కార్డుద్వారానే పౌరుడి గుర్తింపునిర్ధారణ. ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానంచేయడం రాజ్యాంగంలోని 326 నిబంధన, ప్రజాప్రతినిధ్యచట్టం 1950లోని సెక్షన్ 23(4), 23(5)23(6)లోని నిబంధనలప్రకారం సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగామాత్రమేజరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదలచేసింది. మహారాష్ట్ర,ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విపక్షాలు ఓటర్ల జాబితాల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, మహారాష్ట్ర ఓటర్లను జాబితాలోచేర్చడంద్వారా ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి లబ్దిపొందిందని కాంగ్రెస్ ఇతర విపక్షాలు భారీ ఎత్తున నిరసన వ్యక్తంచేసాయి. ఎన్నికల కమిషన్‌ను కూడా కలిసి ఫిర్యాదులుచేయడంతోపాటు పార్లమెంటు సమావేశాల్లోకూడా ఈ అంశంపై చర్చజరగాలని పట్టుబట్టాయి. వీటన్నింటినీ అధిగమించేందుకు తాజాగా ఎన్నికల సంఘం ఓటరు గుర్తింపుకార్డును ఆధార్‌తోఅనుసంధానంచేయడంద్వారా అన్ని అక్రమాలను అరికట్టవచ్చని భావిస్తోంది. ఈప్రక్రియకు ఇపుడు కేంద్రం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికల సంఘం ఈప్రక్రియను చేపట్టింది.

## వారం - వర్జ్యం

తేది : 19-03-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
పంచమి రా.12.38
విశాఖ రా.8.49
వర్జ్యం రా.1.16-3.03
దు.ఉ.12.00-12.48
శుభసమయం : సా.6.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృషభం:** కుటుంబ సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:** అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసు కొంటారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**కన్య :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. రుణవత్తిడులు చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వాహనయోగం.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. వస్తువులు కొనుగోలు.

**మకరం:** పాతమిత్రులు కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేడు చిరంజీవికి బ్రిటన్‌పార్లమెంట్‌లో సత్కారం

## లండన్‌చేరుకున్న మెగాస్టార్‌కు అపూర్వ స్వాగతం



లండన్‌లో చిరంజీవికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

**లండన్, మార్చి 18:** టాలివుడ్ మెగాస్టార్‌చిరంజీవికిబ్రిటన్ పార్లమెంట్‌లో గౌరవ సత్కారం జరగనున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి సమాజానికి చేసిన సేవలకుగాను బ్రిటన్‌కి చెందిన అధికార లేబర్‌పార్టీఎంపి నవేందు మిశ్రా చిరంజీవిని ఇతర ఎంపిల సమక్షంలో 19వ తేదీ సత్కరించనున్నారు. సోజన్‌జోసెఫ్, బాబ్‌బ్లాక్‌మన్‌సహా ఇతర పార్లమెంటు సభ్యులు కార్యక్రమంలో పాల్గొంటారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ, సినిమా మరియు ప్రజాసేవ ధాతృత్వానికి చిరంజీవి చేసిన కృషిని గురించి కల్చరల్ లీడర్‌షిప్‌ద్వారా ప్రజాసేవలో ఎక్స్‌లెన్స్‌కోసం జీవితసాఫల్యపురస్కారం కూడా ప్రధానంచేస్తోంది. బ్రిడ్జి ఇండియా సంస్థ యుకెలో ఒక ప్రముఖ సంస్థ. పబ్లిక్ పాలసీ రూపకల్పనలో కృషిచేస్తుంది. యుకెకి చెందిన పార్లమెంటు సభ్యులు, బ్రిడ్జ్ ఇండియా వంటిప్రఖ్యాత సంస్థ అంతర్జాతీయ వేదికపై చిరంజీవిని సతనకరించడం ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇవ్వడం అనేది ప్రత్యేక సందర్భం. 2024లో భారత ప్రభుత్వంనుంచి రెండో అత్యున్నత పౌరపురస్కారం పద్మవిభూషణ్‌ను చిరంజీవి అందుకున్నారు. గత ఏడాది అత్యంత సమర్థవంతమైన నటుడు డ్యాన్సర్‌గా గిన్నెస్‌బుక్ ప్రపంచరికార్డుతో సత్కారం పొందారు. ఎఎన్ఆర్ శతజయంతి సందర్భంగా అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 2024లోచిరంజీవికి ప్రతిష్టాత్మక ఎఎన్ఆర్‌జాతీయ అవార్డును ప్రధానంచేసింది. కాగా లండన్‌కు చేరుకున్న చిరంజీవికి అక్కడి మెగా ఫ్యాన్స్ భారీ ఎత్తున స్వాగతం పలికారు. హీత్రో విమానాశ్రయం మొత్తం మెగాఫ్యాన్స్ సందడితో నిండిపోయింది. భారీ బందోబస్తుమధ్య చిరంజీవి బసచేసే హోటల్‌కు అక్కడి అదికారులు తోడ్కొనివెళ్లారు.

# ఎస్టీ సెగ్మెంట్లలో అత్యధిక ఇందిరమ్మ ఇళ్లు

>> రిజర్వాయర్ కుడి ఎడమ కాలువలతో నీటిని ఆయకట్టు చివరి వరకు పంపిణీ చేయడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.500కోట్లు నిధులుకేటాయింపు పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకత వివరించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలే వెంకటేశ్వర్లు ముసరంబాగ్‌ఫ్లైఓవర్ పనులు వేగంగా జరుగాలని, జిహెచ్ఎంసి కమీషనర్ తమ ప్రతిపాదనలు పట్టించుకోవడంలేదని తెలిపారు."చేనెంబర్" బ్రిడ్జికి ఇరువైపులా ఉండే సర్వీసు రోడ్డులను మరమ్మతు చేసి అభివృద్ధి పరచాలని సూచించారు. ఉప్పల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హుడా అప్రూవుడ్ లేఔట్ బాధితుల గోడును పరిష్కరించాలని కోరారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ బస్తీదవఖానాలలో మందుల కొరత తోపాటు 50పడకల ఆసుపత్రి కోసం ప్రతిపాదనలు స్పీకర్ ముందు ఉంచారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దేవాదుల మూడోదశ విస్తరణకు తన నియోజకవర్గంలో రూ.1015కోట్లు వెచ్చిసేనత 77890ఎకరాలకు సాగునీరు వస్తుందని అందులో తుంగతుర్తి,స్టేషన్‌ఘనపురం,వర్ధన్నపేట నియోజకవర్గాలకు సాగునీటి వసతికలుగుతోందని తెలిపారు. పెద్దవంగర మండలంలో ఎమ్మార్వో, ఎంపిడివో, పోలీస్‌స్టేషన్‌లకు పక్కాభవనం కట్టించాలని సూచించారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ రెండుకోట్లు వెచ్చించి మాటుకాల్వ మరమ్మతు చేస్తే రెండువేల ఎకరాలకు సాగునీరు వస్తుందని తెలిపారు. తన నియోజకవర్గం మెగిలిపేటలో 350 రైతులకు రుణమాఫి జరగలేదని డిప్యూటీ సిఎం అంతా జరిగిందని అనడంతో వారు జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్ళబోతుంటే అరెస్టుచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కూమల్ల రాజేశ్‌రెడ్డి తన నియోజకవర్గంలో ఒక సాంకేతిక కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ సాగునీటి వసతి కల్పనకు అసైన్డ్ భూముల నుంచి కాల్వా వెళ్ళకుండా పెద్దలింగాపూర్ రైతులను గత ఎమ్మెల్యే రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి మరిచిపోయి ఆటలు పాటలతో గత ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేయడంలో మానకొండూర్‌లో సమస్యలు తిష్ఠవేశాయని ఆయన అనడంతో పల్లారాజేశ్వర్‌రెడ్డి, డా.సంజయ్‌లు ఆయన ప్రసంగం నిలువరించే ప్రయత్నంచేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కల్వల ప్రాజెక్టు మరమ్మతుకు వెంటనే చేపట్టాలని కోరారు. కాకతీయ కెనాల్ కింద డిబిఎం 21,24,26,29 నీరు విడుదలచేయాలని కోరారు.శ్రీరాంపూర్, వావిలాల, మర్రివానిపల్లి, అంబాల, గునిపర్తి బోగంపాడు వంటి వేల ఎకరాలకు నీరు అందిచాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి భూసేకరణ చేయకుండానే ప్రతిఎకరాకు ఎస్టీఆర్ ఫ్లడ్‌ఫ్లో మౌళికవసుతుల ఉపయోగించుకొని నీరు ఇవ్వవచ్చు అన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావ్‌పవార్ మాట్లాడుతూ వంద చెరువులు రెండు సంవత్సరాలుగా మరమ్మతు చేయకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి అని ఆవేదన వ్యక్తంచేశారు. పుష్కరాలు వస్తున్నాయని బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పరచాలని కోరారు.కార్వన్ ఎమ్మెల్యేకౌసర్ మోహినోద్దిన్ తాగునీటి సమస్య పరిష్కారంకోసం కార్యచరణ చేపట్టాలని సూచించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గోదావరి వరదల్లో ముంపుకు గురయ్యే ప్రాంతాలకు మెరిక ప్రాంతాల్లో ఇండ్లు కట్టించాలని కోరారు. సూర్యనారయణ నిజామాబాద్ బస్టాండ్ కొత్తగా నిర్మించాలని సూచించారు చిట్టెంపర్నికారెడ్డి నారాయణపేటలో ఉన్నతవిద్య,తాగునీటి సాగునీటి సమస్యలు తీర్చలని సూచించారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరెంటుసమస్యలునివారించాలని మిర్యాలగూడ స్పెషల్‌గ్రేడ్ మున్సిపాల్టీగా అభివృద్ధిచేయాలని కోరారు.

# ఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్, పుతిన్ ఫోన్ చర్చలు

**వాషింగ్టన్, మార్చి 18:** ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధంముగించేందుకు కృషిచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌కు ఫోన్‌చేసారు. ఇరుదేశాధినేతలు సుదీర్ఘంగా కొనసాగించిన చర్చల అనంతరంయుద్ధం ముగింపునకు పుతిన్‌కూడా అంగీకరించినట్లు సమాచారం. శాశ్వత శాంతితో యుద్ధఆనికి ముగింపు పలకాలని ఇరువురునేతలు నిర్ణయించారు. అమెరికా, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలని చర్చల్లోప్రస్తావనకు వచ్చింది. సుమారుగా రెండుగంటలకుపైగా చర్చలు కొనసాగించినట్లు శ్వేతసౌధం అధికారులు వెల్లడించారు.

ఈ సంభాషణకు సంబంధించి ట్రంప్‌ముందుగానే వివరాలు వెల్లడించారు. పుతిన్‌తో తాను మాట్లాడతానని, భూమి, విద్యుత్‌కేంద్రాలగురించి కొన్ని ఆస్తుల విభజనపైనా ఇరువురం చర్చిసానతమని చెప్పారు.

ఈక్రమంలోనే యుద్ధం ముగింపుపై ట్రంప్ పుతిన్‌కు ఫోన్‌చేసి సుదీర్ఘ సంభాషణ కొనసాగించారు.



మంగళవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

# ఎట్టకేలకు సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి18:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే,సీపీఐ(ఎంఎల్) నేత గుమ్మడి నర్సయ్య కలిశారు. ఈ రోజు అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. రేవంత్ రెడ్డికి గుమ్మడి నర్సయ్య ఒక లేఖను అందజేశారు. మాజీ ఎమ్మెల్యేను రేవంత్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం లభించడం లేదంటూ సుమారు పదిహేను రోజుల క్రితం గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలవడానికి పలుమార్లు వెళ్లినప్పటికీ గేటు వద్దే ఆపేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ లభించడంతో మంగళవారం ఆయనను కలిశారు.

# బిసి కులసర్వే అపూర్వం

>> ఆదర్శంగా తీసుకోవాలనేదే మా ఆలోచన అని తెలిపారు.ఈ కులసర్వే చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని,ఇందులో భాగస్వాములవడం మాకు గర్వకారణమని పేర్కొన్నారు. దీనిని బీసీ సోదరులు అర్థం చేసుకోవాలి.. దీన్ని తప్పుపడితే నష్టపోయేది బీసీ సోదరులే అని స్పష్టం చేశారు. కేవలం డాక్యుమెంట్ చేసి వదిలేయకుండా బిల్లు చేశాం, రాజకీయ పరమైన రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల కోసం వేర్వేరుగా రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించుకున్నామని పేర్కొన్నారు. జనగణనలో కులగణన ఎప్పుడూ జరగలేదు, జనగణనలో కులగణనను చేర్చితే సరైన లెక్క తేలుతుందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా పనిచేసినవారిలో ఎక్కువ మంది బీసీలే, మల్లిఖార్జున, విహెచ్,పొన్నాల లక్ష్మయ్య,డి.శ్రీనివాస్,ఇప్పుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అని గుర్తు చేశారు. ఈ కులగణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిదని,. ముందు అమలు చేసుకుని తరువాత అవసరాన్నిబట్టి సవరణలు చేసుకోవచ్చు అని చెప్పారు. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని అనుకునే వారి ట్రాప్‌లో పడకండి, ఈ సర్వేను తప్పుపడితే నష్టపోయేది మీరే అని హితవు చెప్పారు. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయం చేసుకున్నవారవుతారని తెలిపారు. మీ హక్కుల సాధన కోసం మీరే నాయకత్వం వహించండి నేను మీకు మద్దతుగా నిలబడతానని హామీ ఇచ్చారు. గొర్రె కసాయిని నమ్మినట్లు బీసీ సంఘాలు పోయి సర్వేలోనే పాల్గొనని వారి మద్దతు అడుగుతున్నారు. సర్వే చేసింది మేము, జనాభా లెక్కలు తేల్చింది మేము. కొందరు వెళ్లి సర్వేను వ్యతిరేకించిన పార్టీల నేతలను కలుస్తున్నారని పరోక్షంగా తీన్మార్ మల్లన తీరును తప్పుపట్టారు సర్వేకు సహకరించని, సర్వేలో పాల్గొనని పార్టీలు మీకు మద్దతు ఇస్తాయా అని సీఎం రేవంత్‌రెడ్డి బీసీ నేతలను ప్రశ్నించారు. ఈనెల 25న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగే బీసీల ధర్నాకు తమ ప్రభుత్వం మద్దతు ఇస్తుందని, జాతీయ పార్టీల దృష్టికి వెళ్లేలా సభ నిర్వహించాలని చెప్పారు. బీసీ శ్రేణులను ఢిల్లీకి తీసుకెళ్లే విధంగా రైలును బుక్ చేయాలని మహేశ్‌కుమార్‌గౌడ్‌కు, ధర్నా కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్,విహెచ్ భోజనాలు ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. అంతకు ముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి బీసీ సంఘాలు ధన్యవాదాలు తెలుపుతున్నాయని,దేశంలోనే ఆదర్శవంతంగా ఉండేలా కుల గణన చేపట్టామని పేర్కొన్నారు.సిఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం ఇచ్చామని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకే స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశామని,బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలు చేశామని తెలిపారు. ఒక్క ఘట్టం ముగిసిందని, ఢిల్లీలో మరో ఘట్టం ఉందని, బీసీల బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు సపోర్ట్ చేశాయని పేర్కొన్నారు.

# తెలంగాణలో రష్యా పెట్టుబడులు!

>> నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐటి, ఇన్నోవేషన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇతర అంశాల్లో రష్యా ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పౌర సేవలను ప్రజల ముంగిటకు చేర్చేందుకు రష్యాలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులపై అధ్యయనం చేస్తామన్నారు. సమావేశంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు లిడ్‌మిలా ఒగారోడోవా, డిమిత్రీ స్టారోస్టిన్, రామిల్ ఖిస్మాటుల్లిన్, వెరా ప్రోంకినా, టిజిఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, టిజిఐఐసి సిఈఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్ర బడ్జెట్

>> రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా, ఈసారి మరో రూ.30 వేల కోట్లు పెంచుతున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటికే అమలవుతున్న కొన్ని పథకాలకు నిధులు పెంచాల్సి ఉంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించనుంది. దీంతో పాటు కొత్త ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ వల్ల శాలరీ బడ్జెట్ పెరగనుంది. దీనికి ఒకట్రెండు పెండింగ్ డీఏలు తోడైతే ఆ మేరకు అదనపు నిధులు కావాలి. పైగా గత ఏడాదితో పోలిస్తే అప్పుల కిస్తీలు, వడ్డీల మొత్తం కూడా పెరగనుంది. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం వచ్చే బడ్జెట్‌లో సంక్షేమానికి 18 శాతం నిధులు కేటాయిస్తోంది. ఈ మేరకు బడ్జెట్‌లో రూ.54 వేల కోట్లు కేటాయించే అవకాశముందని ఆర్థిక శాఖ వర్గాలు చెప్తున్నాయి. అలాగే ఈ 2025-26 బడ్జెట్‌లో వ్యవసాయానికి సుమారు రూ.40 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తంలో రైతు భరోసాకు సుమారు రూ.18 వేల కోట్లు, రైతు బీమాకు రూ.1,500 కోట్లు పోను మిగిలిన వాటిలో ఎక్కువ భాగం వేతనాలు చెల్లింపులకు కేటాయించనుంది. అలాగే సంక్షేమ, అభివృద్ధికి నిధులు భారీగా కేటాయిస్తోంది. ప్రధానంగా హైదరాబాదు కేంద్రంగా ఫ్యూచర్ సిటీ, మూసీ నది పునరుజ్జీవనం, మెట్రో విస్తరణ అంశాలతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై ప్రభుత్వం, మహిళలకు సంబంధించిన పథకాలపై కొత్త బడ్జెట్‌లో ప్రధానంగా ఫోకస్ పెట్టింది. కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, క్వింటాల్ వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్‌తో పాటు సంక్షేమ పథకాలపై నిధుల కేటాయింపుపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. అలాగే ఆరు గ్యారంటీల్లో చేయూత పెన్షన్, మహాలక్ష్మి ్మలో స్కీంలో భాగమైన మహిళలకు నెలకు రూ.2,500 పథకాలు అమలు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తోంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, ట్రిపుల్‌ఆర్, మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి వచ్చే నిధులకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాల్సి ఉంది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమికంగా కొన్ని పనులు ప్రభుత్వమే చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.3 వేల కోట్ల మేర అంచనాలు రూపొందించినట్టు తెలుస్తోంది.

# కౌన్సిల్‌లో ఏకగ్రీవం

>> విచ్ఛిన్నం అవుతుందని రాజీవ్ గాంధీ వాదించారని కవిత విమర్శించారు. రూ. 4300 కోట్లతో 2011లో అప్పటి యూపీఏ ప్రభుత్వం కుల గణన చేయించింది కానీ.. ఆ నివేదికను ఇప్పటివరకు బయట పెట్టలేదన్నారు. ఆ నివేదిక గురించి రాహుల్ గాంధీ, సోనియాగాంధీ ఎందుకు మాట్లాడలేదని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. అలాగే బీసీ వర్గీకరణ కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం వేసిన జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అసలు ఈ 42 శాతం అన్న లెక్కకు కాంగ్రెస్ పార్టీ ఏ ప్రాతిపదికన వచ్చిందో సమాధానం చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల పాటు కాలయాపన చేసిన ప్రభుత్వం డెడికేటెడ్ కమిషనన్‌ను నియమించిందన్నారు. డెడికేటెడ్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎందుకు బహిర్గతం చేయడం లేదని.. నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు ఏటా రూ 20 వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి గత ఏడాది కేవలం 9200 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఈడబ్ల్యూఎస్‌లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు. నిర్ణయం నుండి నివేదిక వరకు ఒకే సంవత్సరంలోపు పూర్తి చేశారని మంత్రి తెలిపారు. 4 ఫిబ్రవరి 2024లో తీసుకుంటే తిరిగి 4 ఫిబ్రవరి 2025లో నివేదిక శాసన సభలో ప్రవేశ పెట్టినట్టు తెలిపారు.

### కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం, ఏపి ప్రభుత్వానికి

# సుప్రీంకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 18:** కృష్ణానది ప్రాజెక్టులపై కేంద్రం నోటిఫికేషన్‌ను ప్రశ్నిస్తూ తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ అయ్యాయి. కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించాలని 2021లో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ వేసింది. మరోవైపు కేఆర్ఎంబీ ప్రాజెక్టులపై అధిక విద్యుత్ ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పిటిషన్ వేసింది.

ఈ జీవో సాయంతో అక్రమంగా విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటున్నారని ఏపీ సర్కార్ తమ పిటిషన్‌లో ఆరోపించింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో రద్దు చేయాలని పిటిషన్‌లో కోరింది. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఏపీ, తెలం గాణ వేసిన పిటిషన్లను కలిపి విచారణ చేపట్టింది.

మరోవైపు 2021లో కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ మరో పిటిషన్ వేసింది. స్టే ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్లపై 2 వారాల్లో కౌంటర్ దాఖలు వేయాలని కేంద్ర ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇవి రెండు కౌంటర్లు దాఖలు చేసిన వారంలోగా రిజాయిండర్ ఫైల్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

# సమన్వయంతో పనిచేస్తున్న సహాయక బృందాలు

### ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 18, ప్రభాతవార్త:** డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, మంగళవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోని ప్రమాదం సంభవించిన ప్రదేశంలోకి ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు మంగళవారం ఉదయం కేరళకు చెందిన కడా వర్ డాగ్స్ స్క్వాడ్ టన్నెల్‌లోకి వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యల వేగవంతానికి పలు సూచనలు చేసినట్లు వివరించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ యొక్క ప్లాట్‌ఫాం భాగాలని కత్తిరించే పనులు వేగంగా జరుగుతున్నాయని, సమాం తరంగా టి బిమ్ పై నున్న మట్టిని తొలగించే పనులు రెట్టింపు వేగంతో సహాయక బృందాలు పూర్తిస్థాయిలో 24 గంటలు సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. టిబిఎంను కత్తిరించిన భాగాలను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, లోకోట్రైన్ ద్వారా బయటికి పంపిస్తున్నట్లు ,మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. సహాయక బృందాల వారీగా సహాయక చర్యలు చేపడుతూ, సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని, తెలియజేశారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) అధికారులు టన్నెల్ ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించి, భూగర్భ నిర్మాణం, భూస్థాయిల మార్పులు, టన్నెల్ మట్టిపెళుసు స్థితి, నీటి ప్రవాహం, ప్రభావం, వంటి అంశాలపై అక్కడి భూగర్భ పరిస్థితులను విశ్లేషించారు. అధ్యయనం అనంతరం, వారు సహాయక చర్యలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులకు పలు సూచ నలు చేశారని, ప్రభుత్వ అధికారులు, రక్షణ సిబ్బంది, ఇంజినీర్లు, జియోలాజిస్టులు అనుభవజ్ఞులైన రెస్క్యూ టీమ్‌లు సమన్వయంతో పని చేస్తున్నట్లు వివరించారు.

అత్యాధునిక సాంకేతిక పరికరాలు, డ్రిల్లింగ్ మెషిన్లు, సెన్సార్లు, రోబోటిక్ పరికరాలు వంటి సాధనాలను వినియోగించి సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగం, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, ఆర్మీ, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్,ర్యాట్ హోల్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్,దక్షిణ మధ్య రైల్వే, జిఎస్ఐ, జలవనరుల శాఖ, ఇతర సంబంధిత విభాగాలు ఒకటిగా పని చేస్తూ సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.



సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలు

# మోడీ మహాకుంభ్ వ్యాఖ్యలపై విపక్షం నిరసన

### వాయిదా పడిన లోక్‌సభ

**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాకుంభ్‌పై నరేంద్ర మోడీచేసిన వ్యాఖ్యలపై విపక్ష సభ్యుల ప్రశ్నలకు జవాబివ్వాలని కోరుతూ ప్రతిపక్షం నిరసనల మధ్య మంగలవారం లోక్‌సభ వాయిదా పడింది. అంతకుముందు కూడా మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సభా కార్య క్రమాలు వాయిదా పడ్డాయి. మహాకుంభ్‌పై ప్రధాని మోడీ చేసిన ప్రకటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ విపక్ష సభ్యులు తమ సీట్లనుంచే లేచి నిరసన తెలిపారు. ప్రధానిమోడీ ప్రకటనలో తొక్కిసలాట, మరణా లను కూడా ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. 30 మంది చనిపోయారని ప్రపంచం మొత్తానికి తెలుసునని విపక్షం ఆరోపించింది. వాయిదా తర్వాత మళ్లీ ప్రారంభం అయిన సభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తన మంత్రిత్వశాఖ డిమాండ్స్ ఫర్(గ్రాంట్స్)పై చర్చను లేవనెత్తారు. జలశక్తి మంత్రిత్వశాఖ గ్రాంట్లపై చర్చను ప్రారంభించగా విపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపారు. వెంటనే ఈచర్చను వాయిదా వేయాలనికోరారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం మళ్లీ సమావేశం అయిన లోక్‌సభలోప్రధాని సభను తప్పుదోవ పట్టించేందుకు మహాకుంభ్ ప్రకటన చేసారని, మోడీ ప్రకటనలో మృతుల వివ రాలు, తొక్కిసలాట సమాచారమే లేదని ఆరోపిస్తూ పెద్ద పెట్టున నినాదాలుచేసారు. దీనితో స్పీకర్‌ఓంబిర్లా సభను వాయిదా వేసారు.



### ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**హైదరాబాద్ (మన్సూరాబాద్), మార్చి 18, ప్రభాతవార్త:** హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎల్బీనగర్ పోలీసులు నమోద్ చేశారు. గత సోమవారం పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీతో హస్తినపురం కార్పొరేటర్ సుజాతనాయక్ హనీమూన్‌లో ఉన్నారని, తనను వ్యక్తిగతంగా అవమానపరిచారని ఆమె ఎల్బీనగర్ ఏసీపీ, సిఐకి ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఎల్బీనగర్ పోలీస్‌లు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 15 మంది డిఎస్‌పిలకు అదనపుఎస్పీలుగా పదోన్నతులు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:**రాష్ట్రంలో పలుచోట్ల విధులు నిర్వ హిస్తున్న 15 మంది డిఎస్‌పిలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ సర్కారు మంగ ళవారం ఆదేశాలు జారీ చేసింది. వీరందరికి డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పదోన్నతులు అందుకున్న వారిలో రాచకొండ షీ బృందాల విభాగం డిఎస్‌పి బాబ్జి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో వున్న శ్రీకాంత్ రావు, నిజామాబాద్‌లో వున్న శ్రీనివాసరావు, మహేశ్వరం ట్రాఫిక్‌లో వున్న కుషాల్కర్, కరీం నగర్‌లో వున్న నరేందర్, సిటీ పోలీసు విభాగంలో వున్న వెంకటరమణ, సైబరా బాద్‌లో వున్న చంద్రకాంత్, రఘు, పూర్ణచందర్, సైబరాబాద్‌లో వున్న హనుమంత రావు, శ్రీనివాసరావు, నల్లగొండలో వున్న రమేష్, బల్దియాలో వున్న సుదర్శన్, ఏసిబిలో వున్న ఉదయ్‌రెడ్డి, సిఐడిలో వున్న శ్యాంప్రసాద్ రావు వున్నారు. వీరంతా 1991, 1995 బ్యాచ్ అధికారులు.

## ఒకే బ్యాచ్‌కు చెందిన వారికి సెల్యూట్ కొట్టాల్సిన దుస్థితి

### సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** గత పాలకుల చర్యల వల్ల 2012 బ్యాచ్ ఎస్ఐలు తమ బ్యాచ్‌కి చెందిన వారికి సెల్యూట్ చేయాల్సి న దుస్థితి నెలకొందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అసెంబ్లీలో ఎస్ఐల పదోన్నతి సమస్యను లేవనెత్తారు. మంగళవారం అసెంబ్లీలో జీరోఅవర్ సంధ్భంగా 317 జివో ఫలితంగా ఏర్పడిన పోలీసు శాఖలో ఏర్పడిన గందరగోళంపై ఆయన వివరిం చారు. 2012లో అప్పటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టు లను భర్తీ చేశారన్నారు. 317జీవో వల్ల తమ ప్రాంతంలోని ఎస్ఐలకు 13ఏళ్ల నుంచి పదోన్నతి పొందలేదన్నారు. కేవలం నలుగురికి మాత్రమే పదోన్నతి ఇవ్వ డంతో అదే బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు వారి బ్యాచ్‌కు చెందిన వారికి సెల్యూ ట్ చేయాల్సి వస్తుందన్నారు. చాలాచోట్ల ట్రాఫిక్ మహిళ పోలీస్ స్టేషన్లతోపాటు కొన్ని పోలీస్‌స్టేషన్ల అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందన్నారు. అలాచేస్తే 2012 బ్యాచ్‌కు చెందిన వారందరికీ పదోన్నతులు దక్కుతాయన్నారు. కనీసం సూపర్ న్యూమరి పోస్టులు కల్పించి పదోన్నతి అందించాలని కోరారు.

## బెట్టింగ్‌యాప్స్ ప్రమోట్ చేసినందుకు కానిస్టేబుల్‌పై కేసు నమోదు

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 18, ప్రభాతవార్త:** మలయాళంలో విజయం సాధిం చిన రేఖ అనే చిత్రంలో హీరో బెట్టింగ్ ఆడి లక్షలు గెలుస్తాడు. ఈ విషయం అధికారులకు తెలిసి కొన్నినెలలు సస్పెండ్ చేస్తారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌తో పాటు సాధారణ ప్రజలు కూడా అతని చర్యలను ఖండిస్తారు. ఇదంతా సినిమా కాదు..అదే కోవలో ఓ కానిస్టేబుల్ బెట్టింగ్ యాప్స్ కారణంగా ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాడు. హబీబ్‌నగర్ ఠాణాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిరణ్‌గౌడ్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశాడు. అదికూడా యూనిఫాం వేసుకుని మరీ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశాడు. అంతేగాకుండా టెలిగ్రామ్ ఛానల్‌లో బెట్టింగ్ యాప్స్‌కు టిప్స్ కూడా చెప్పడం మొదలుపెట్టాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసింది. వెంటనే అంతర్గతంగా విచారణ జరిపి నేరం రుజువు కావడంతో పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో ఇతనిపై కేసునమోదు చేశారు. పూర్తి వివరాలు సేకరించి అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

## సుచర్ ఇండియా యజమానిపై బంజారాహిల్స్‌లో కేసు

### ఉద్యోగిని నిర్బంధించడంతో 100కు డయల్

### బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 18, ప్రభాతవార్త:** లెక్కల్లో తేడా వచ్చిందని సంస్థలో పనిచేసే ఉద్యోగిని చిత్రహింసలకు గురి చేసిన యజమానిపై బంజారాహిల్స్ పోలీసులు కేసునమోదు చేశారు. వివరాల ప్రకారం బంజారా హిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని నందినగర్‌లో సుచర్ ఇండియా రియల్ ఎస్టేట్ సంస్థ ఉంది. అక్కడ ప్రియాంక్ అనే వ్యక్తి అకౌంటెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తు న్నాడు. అయితే లెక్కల్లో ఐదు లక్షలు తేడా వచ్చింది. ఈ విషయమై అతనిని మంగళవారం నిర్బంధించి సంస్థకు చెందిన వారు దాడికి దిగారు. నిర్బంధించిన సమయంలో ప్రియాంక్ ఈ విషయమై 100కు డయల్ చేసి తనను కాపాడాలని వేడుకున్నాడు. వెంటనే కంట్రోల్ రూమ్ సిబ్బంది బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రయాంక్‌ను విడిపించి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి సమాచారం సేకరించారు. తన తప్పులేకపోయినా తనను నిర్బంధించారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెం టనే సంస్థ అధినేత కిరణ్‌పై కేసు నమోదు చేశారు. కేసును బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మే 13న పాలీసెట్-2025 పరీక్ష

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాలిటెక్నికల్ డిప్లమా కోర్సులతోపాటు అగ్రికల్చర్, హార్టికల్చర్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలీసెట్)-2025 పరీక్షను మే 13ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను నేటి (బుధవారం) నుంచి స్వీకరించనున్నట్టు సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఏప్రిల్ 19 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలిపారు. పాలీసెట్ ఫీజును ఎస్సి, ఎస్టిలకు రూ. 250గా ఇతరులకు రూ. 500గా నిర్ణయించారు. అపరాధ రుసుం రూ. 100తో ఏప్రిల్ 21 వరకు, రూ. 300 అపరాధరుసుంతో ఏప్రిల్‌న23 వరకు దరఖాస్తులను స్వీకరిం చనున్నారు. మే 13న పాలీసెట్-2025 పరీక్షను నిర్వహించి.. 12 రోజుల్లో ఫలితాలను విడుదల చేయనున్నారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారు పాలీసెట్ పరీక్ష రాయడానికి అర్హులుగా ప్రకటించారు.

# ఎంపి డికె అరుణ ఇంట్లో చొరబడిన దొంగ అరెస్ట్

### విలేకరుల సమావేశంలో వెల్లడించిన వెస్ట్‌జోన్ డిసిపి విజయకుమార్

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 18 , ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎంపి డి.కె. అరుణ ఇంట్లోకి చొరబడిన దొంగను మంగళ వారం అరెస్టు చేశారు. పశ్చిమ మండలం డిసిపి విజయకుమార్ వివరాలు వెల్లడించారు. ఉత్తరా ఖండ్ రాష్ట్రానికి చెందిన మొహమ్మద్ అక్రమ్ (48)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 16వ తేదీ రాత్రి 11.30 గంటలకు ఎంపి డికె అరుణ డ్రైవర్ నుండి ఫిర్యాదు అందింది. అందులో ఆయన 15-3-2025న రాత్రి 11.30 గంటలకు తాను మొదటి అంతస్తులోని డ్రైవర్ గదిలో పడుకున్నానని, మేడమ్ కుమార్తె, మహిళా కార్మికులు రెండో అంతస్తులో పడుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ దాదాపు 3.50 గంటలకు డ్రైవర్ ఏదో శబ్దం విన్నాడని, వెంటనే అతను మేల్కొని చూశాడని, కానీ ఎవరూ కని పించలేదని పేర్కొన్నారు. సుమారు 6-00 గంటలకు సీసీటీవీ ఫుటేజ్‌లను తనిఖీ చేయగా, ముసుగు ధరించిన ఒక గుర్తుతెలియని వ్యక్తి గోడ దూకి ఆవరణలోకి ప్రవేశించి మొదటి అంతస్తులోని వంటగది గదిలోకి కిటికీ అద్దాలను పగలగొట్టి సీసీటీవీ వైర్‌ను కత్తిరించి కొంతసేపు ఇంట్లో ఉండి ఇంటి నుండి పారిపోయాడని గమనించారు. అందువల్ల, చట్ట ప్రకారం అవసర మైన చర్యలు తీసుకోవాలని ఆయన అభ్యర్థిం చారు.

ఈ విషయమై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. వెస్ట్ జోన్ సిబ్బందితో నిందితులను పట్టుకోవడానికి 8 బృందాలు ఏర్పడ్డాయి. ప్రయత్నాలు యుద్ధ ప్రాతిపదికన జరిగాయి.

నిందితుల కోసం గాలింపు సందర్భంగా, మంగళవారం ఉదయం 10-00 గంటలకు సీసీటీవీ కెమెరాలను తనిఖీ చేయడం ద్వారా నిందితుడిని అమన్‌నగర్ బి వద్ద అతని నివాసానికి సమీపంలో అరెస్టు చేశారు. అతని వద్ద నుండి క్యాప్,సుత్తి, రెండు స్క్రూడ్రైవర్లు, కట్టర్, నాలుగు తాళాలు చెవిలు, మొబైల్ ఫోన్, షూ (ఎస్ వోసీ వద్ద ధరించేవారు), దుస్తులు ( ఎస్‌వోసీ వద్ద ధరించేవారు), బ్యాక్‌ప్యాక్ బ్యాగ్, పర్స్ ఉన్న ఆధార్ కార్డ్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీసీపీ వివరించారు. తదుపరి దర్యాప్తు జూబ్లీహిల్స్ పోలీసులు చేపట్టనున్నారని ఆయన తెలిపారు.



# సునీతా విలియమ్స్‌కు ప్రధాని నరేంద్ర మోడీ లేఖ

**న్యూఢిల్లీ, మార్చి 18:** భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపైకి వచ్చిన తర్వాత భారత్ పర్యటనకు రావాలని ప్రధాని మోడీ లేఖ రాసినట్లు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. తొమ్మిది నెలలపాటు ఐఎస్ఎస్‌లో ఉన్న సునీతావిలియమ్స్ బుధవారానికి భూమిపైకి వస్తున్న సంగతి తెలిసిందే. డ్రాగన్‌కాప్సూల్‌లో వారంతా భూమికి వస్తున్నారు. సునీతా విలియమ్స్ బాగోగుల గురించి తన అమెరికా పర్యటనలో అడిగి తెలుసుకున్నట్లు ఆ లేఖలో ప్రధాని చెప్పారు. వేలమైళ్ల దూరంలో ఉన్నా నువ్వు మా గుండెలకు దగ్గరగా ఉన్నట్లు ఆ లేఖలో మోడీ తెలిపారు. నీ ఆరోగ్యం కోసం 140 కోట్ల మంది భారతీయులు ప్రార్థిస్తున్నారని మోడీ పేర్కొన్నారు. సునీత చేపట్టిన మిషన్‌లో విజయం సాధిం చాలని ఆకాక్షించారు. వ్యోమగామి మైక్ మాసిమినో ద్వారా ఆ లేఖను పంపిం చారు. సునీతాకు మద్దతు ప్రకటిస్తూ ఆమె పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేసారు. సురక్షి తంగా తిరిగి రావాలని దేశం ఆమెకు అండగా ఉంటుందన్నారు. అమెరికా అధ్య క్షుడు ట్రంప్, బైడెన్‌లను కలిసినపుడు సునీత ఆరోగ్యం యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకోగలిగినట్లు మోడీ తన లేఖలో వివరించారు. అలాగే తోటి వ్యోమ గాములు మిచెల్ విలియమ్స్, బారి విల్మోర్‌లు కూడా క్షేమంగా తిరిగిరావాలని ఆయన ఆకాక్షించారు.

# 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట బోర్డు ఏర్పాటు

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,మార్చి18,ప్రభాతవార్త :** దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట దేవస్థానానికి ఆలయ పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపారు. 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఉంటుందని, వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలుగా పేర్కొన్నారు. కాగా బోర్డు చైర్మన్‌కు, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని, డీఏలు మాత్రం ఉంటాయని అన్నారు. ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారి ఉంటారని వెల్లడించారు. వైటిడికి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వ ద్వారానే జరుగుతుందని తెలిపారు. బోర్డు ఆధ్వర్యంలో, యాదగిరిగుట్టలో విద్యాసంస్థలను, ఆధ్యాత్మిక పాఠశాలలను నెలకొల్పి, నిర్వహించవచ్చునని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తుల తాకిడి పెరిగిందన్నారు. గతంలో యాదగిరిగుట్టలో సాధారణ భక్తులకు సరైన సదుపాయాలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లు ఖర్చు చేసి వసతులు ఏర్పాటు చేసిందన్నారు. ఇంకా మంచి సౌకర్యాల కల్పనకు పాలకమండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో యాదగిరిగుట్టను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణాలో రూ.100 కోట్ల ఆదాయం వచ్చే అలయాలకు బోర్డు ఏర్పాటు చేసుకోవచ్చని వెల్లడించారు.



# గరిడేపల్లిలో ఘరానా మోసం

### రూ.18 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

**గరిడేపల్లి, మార్చి 18, ప్రభాతవార్త:** గరిడేపల్లి మండలంలో ఘరానా మోసం జరిగింది. ఒక వృద్ధుడి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు 18 లక్షలు స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సైబర్ మోసగాళ్ల మాటలు నమ్మి ఒక వ్యక్తి నిలువునా మోసానికి గురయ్యాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కి సైబర్ నేరగాళ్ల బెంగళూరుకు చెందిన సి.బి.ఐ పోలీసులమని చెప్పి సదరు వ్యక్తిని నమ్మించారు. మనుషులను కిడ్నాప్ చేసే ముఠాతో సంబంధం ఉందని అట్టి ముఠా నుంచి మీ అకౌంట్ కి కమిషన్ రూపంలో 30 లక్షలు వచ్చాయని చెప్పారు. మీ ఆధార్ కార్డు, ఎకౌంటు నెంబరు చూడగా ఈ విషయం బయల్పడిందని దీనిపై సిబిఐ కేసు నమోదు చేసిందని ఈ కేసులోకి ఇతర దేశాలలో ఉన్న మీ కుమారుడు మీ ఇతర కుటుంబ సభ్యుల పై కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉందని సదర వ్యక్తిని ఫోన్ లో బెదిరించారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లకు చెందిన వివిధ ఎకౌంటులకు 18 లక్షల రూపాయలను చెల్లించాడు.

ఇదంతా జనవరి నెల రెండో వారం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు సైబర్ నెరగాళ్లు సదరు వ్యక్తిని ఫోన్లు బెదిరించి ప్రతిసారి కొంత మొత్తాన్ని వారి ఎకౌంట్లకు డబ్బులు కొట్టించుకున్నారు. 25 రోజుల వ్యవధిలో మొత్తం 18 లక్షలు సైబర్ నేరగాళ్లకు సదరు వ్యక్తి చెల్లించాడు. ఇంకా ఫోన్ చేసి సైబర్ నెరగాళ్లు బెదిరిస్తుండడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పినట్లు తెలిసింది. సదరు కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. పోలీసులు ఈ వ్యవహారంపై విచారించడంతో వారంతా సైబర్ నేరగాలని గుర్తించినట్లు సమాచారం దీంతో బాధితుడు మోసం పోయినట్లుగా గుర్తించాడు.మొత్తానికి సైబర్ నెరగాళ్ల మోసానికి ఒక అమాయకుడు బలయ్యాడు. సైబర్ నేరాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పించిన ప్రజల్లో చైతన్యం చేసిన ఎక్కడో ఒక దగ్గర సైబర్ నేరగాళ్ల మోసాలకు బలి అవుతూనే ఉన్నారు. గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో జరిగిన ఈ సంఘటనే నిదర్శనం. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

### 19 కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని టిజిటిఎస్‌కి లేఖ రాసిన ఇంటర్ బోర్డు.. 22 నుంచి ప్రారంభం

# ఇంటర్ మూల్యాంకన కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ మూల్యాంకన కేంద్రాల్లో ఆధార్ బయో మెట్రిక్ అటెండెన్స్‌ను అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించాలని కోరుతూ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్(టిజిటిఎస్) ఎండికి లేఖ రాశారు. రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి 19 కేంద్రాల్లో ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం కానున్న నేప థ్యంలో స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే ఎగ్జామినర్లతోపాటు స్క్రూటినైజర్లు ఇతర సిబ్బం దికి కూడా ఆధార్ బేస్డ్ బయోమెట్రిక్ అటెం డెన్స్‌ను అమలు చేయనున్నారు. అందులో ప్రతి స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లో బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ఈ నెల 20 నుంచి ప్రారంభించేలా చూడాలని కోరారు.

ప్రతి సెంటర్‌లో సుమారు 600 నుంచి 1200 మంది వరకు ఉంటారని.. వారికి బయోమెట్రిక్ హాజరు కోసం మొబైల్ యాప్‌ను అందించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కోరారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 10 వరకు మూల్యాంకన కేంద్రాలు కొనసాగుతాయని పేర్కొ న్నారు. ఈ నెల 5 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇంటర్ పరీక్షలకు సంబంధించి సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 10 నుంచి ప్రారంభించారు. ఈ నెల 22 నుంచి నాలుగు విడతల్లో లాంగ్వేజెస్‌తోపాటు సబ్జెక్టుల మూల్యాంకనను కొనసాగించ నున్నారు. ఈ ఏడాది 19 కేంద్రాల్లో మూల్యాంకనాన్ని కొనసాగించనున్నారు. గత ఏడాది 17 కేంద్రాల్లో మూల్యాంకనం జరగగా..ఈ ఏడాది అదనంగా వరంగల్, మెదక్‌లోనూ మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో మూల్యాంకనం కొన సాగనుంది.

# గుజరాత్‌లో 100 కిలోల బంగారం, రెండు కోట్ల నగదు పట్టివేత



**అహ్మదాబాద్, మార్చి 18:** గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో భారీగా బంగారం పట్టుబడింది. ఎటిసి పోలీసులు డిఆర్ఐ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అహ్మదా బాద్‌లోని పాల్డి ప్రాంతంలోని ఒక ఇంట్లో సుమారు 100 కిలోలకు పైగా బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. స్మగ్లింగ్ చేసిన పసిడిని పాల్డి ప్రాంతంలోని ఆవిష్కార్ అపార్టు మెంట్‌లో దాచి పెట్టినట్లు గుర్తిం చారు. దాడులుచేసి 107 కిలోల బంగారం స్వాధీనం చేసున్నారు. అందులో 88 కిలోల బంగారు కడ్డీలు, 19.66 కిలోల ఆభరణాలున్నాయి. పట్టుబడినీ బంగారం విలువ మార్కెట్‌లో రూ.100 కోట్లకుపైగానే ఉంటుందని అధికారుల అంచనా. బంగారంతోపాటురూ.2 కోట్ల నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసునమోదుచేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసారు. కాగా ఈ ఫ్లాట్‌ను మహేంద్రషా, మేఘ్‌షాలు అద్దుకు తీసుకున్నట్లు తేలింది. మరింత పటిష్టమైన నెట్‌వర్క్‌తో ఈ స్మగ్లింగ్‌సాగుతోందని సరైన లావాదేవీల ఎంట్రీలు కూడా లేవని, ఫ్లాట్‌లోని ఒక సేఫ్‌లో కోట్లకొద్దీ నగదును దాచిపెట్టినట్లు తేలింది. ఏడాదికాలంగా ఈ మొత్తం బంగారం సేకరించినట్లు గుర్తించారు. డిఆర్ఐ నిఘా బృందం ప్రతి సందర్శకుడిని, ప్రతి వాహనాన్ని ప్రతి ఒక్కరి కదలికలను కూడా ఆప్రాంతంలో నిఘా వేసింది. ఐదురోజులపాటు ఒక లాక్‌చేసిఉన్న ఫ్లాట్‌నుంచి వీరిపై నిఘా పెట్టింది. బ్యాగ్‌లలో ప్రతిరోజూ కొందరు తీసుకెళుతుండ టంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. ఈ ఫ్లాట్‌తాళాలు ఒక లాయర్‌వద్ద ఉండటంతో ఆతడిని సంప్రదించి తీసుకువచ్చి తాళం తెరిపించారు. బంగారం, నగదు స్మగ్లింగ్ రూటు వంటివాటిపై ఇపుడు దృష్టి పెట్టారు.


**The Singareni Collieries Company Limited**
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM- 507101, Telangana.
**E-PROCUREMENT TENDER NOTICE**

Tenders have been published for the following Services/Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in or https://scclmines.com

NIT/Enquiry No. - Description / Subject - Last date and time for Submission of bid(s).
EST24O0152 - Procurement of lens for DELTA make large video screens at STPP, Jaipur, Mancherial, Telangana - 02.04.2025 - 12.01 PM.
EST24O0153 - Procurement of Toothed hammers for ring granulators (coal crushers) working in coal handling plant at STPP, Jaipur, Mancherial, Telangana - 07.04.2025 - 12.01 PM.
EST24O0155 - Supply, installation and commissioning of 100 T Pit less weighbridge at Singareni Thermal Power Plant, Jaipur, Mancherial, Telangana - 07.04.2025 - 12.01 PM. GM(E&M), STPP
E1524O0419 - Procurement of HT Fasteners under RC for 2 years to use at various areas of SCCL - 27.03.2025 - 17:00 Hrs.
E0224O0425 - Procurement of Interlocking panels on Specific make basis for conveyor transfer chutes at various Area CHPs - 28.03.2025 - 17:00 Hrs.
E0924O0417 - Outsourcing of House wiring works in corporate Area on Rate Contract basis for a period of three (03) years - 02.04.2025 - 17:00 Hrs.
E1024O0424 - Procurement of VCB and Control Panels 33KV 1250A Outdoor - 02.04.2025 - 17:00 Hrs. GM (MP)
NIT/Enquiry No. - Description / Subject / Estimated Contract Value - Last date and time.
CW/STPP/E-12/T-20/2024-25, Dt.12.03.2025 - Miscellaneous civil works in Public buildings in township area at STPP for a period of one year, Jaipur (V&M), Mancherial District, Telangana State - Rs. 37,02,238/- - 28.03.2025 - 04:30 PM. AGM (Civil), STPP
PR/2025/ADVT/STPP/MP/26
DIPR.No.11654-PP/CL/Advt/1/2024-25, Dt: 18.03.2025

వార్త

ఇతరులు మనకు ఇచ్చేది తాత్కాలికమైనది. స్వయం కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతమైనది.

-జీన్ ఫ్రాముజాన్

# ప్రజారోగ్యాన్ని పీల్చుతున్నదెవరు?

జనారోగ్యమే జాతిమహాభాగ్యమనే లక్ష్యంతోదేశ ప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించాం, వెచ్చిస్తూనే ఉన్నాం. అటు కేంద్రప్రభుత్వం కానీ ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపరిచారు. అయినా నేటికీ అందరికీ ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. పరిపూర్ణ ఆరోగ్యం సంగతి దేవుడెరుగు. కనీస ఆరోగ్య సౌకర్యాలు కల్పించడంలో కూడా పాలకులు సఫలీకృతం కాలేకపోతున్నారు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా యేటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే అంతకు రెట్టింపు స్థాయిలో పలురోగాల బారినపడి ఆస్పత్రులపాలై అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా కృంగిపోతున్నారు. అయితే ప్రజారోగ్యంపై దాడి చేస్తున్న ఈ వ్యాధుల్లోకొన్ని కొందరు వ్యక్తులు తమకుతాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగా చెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడులపరంపర కొనసాగిస్తున్నది. ఇందులో కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యంకావడం లేదు. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవ జాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తిముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్నిచాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. కొత్త కొత్త మందులు చికిత్సలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నా అంతకురెట్టింపు స్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కొన్ని వ్యాధులను గుర్తించడం కూడా డాక్టర్లకు సాధ్యం కావడం లేదు. మరికొన్నింటిని గుర్తించినా వాటికి చికిత్స అందించలేకపోతున్నారు. మొన్నటివరకు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా బారిన పడినవారు ఆ మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. ఇవికాక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీ ఇన్నీ కావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా,డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒక్కటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. మరొకపక్క కేన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెజబ్బులు, విపరీతంగా పెరిగిపోయాయి. వయసుతో నిమిత్తంలేకుండా పదేళ్లవయసులో ఉన్న చిన్నపిల్లలను కూడా గుండెజబ్బులు కబళించి వేస్తున్నాయి. కేన్సర్‌కు మందులు ఉన్నా విస్తరణ ఆపలేకపోతున్నారు. రానురాను మానవాళి జీవనానికి సవాల్‌గా మారుతున్నది. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం తదితరవి పాటిస్తూ జీవనాన్ని సాగిస్తే ఈ వ్యాధులు దరిచేరకుండా కొంతవరకు కాపాడుకోవచ్చునని వైద్యనిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. ప్రజలకు వాస్తవాలు కూడా తెలియనివి కావు. అయినా రోగనిరోధకశక్తిని ఎందుకు పెంచుకోలేకపోతున్నారు. కారణాలు ఏమిటి? కారకులెవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజులోనో, వారంలోనో నెలరోజుల్లోనో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పౌష్టికాహారం అందించాలి. ఏ మేరకు అందిస్తామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమటిస్తున్నవారు కోట్ల సంఖ్యలోనే ఉన్నారు. అలాంటప్పుడు వారిలో రోగనిరోధక శక్తి ఎలా వస్తుంది. ఎక్కడి నుంచి వస్తుంది. మరొకపక్క కాలుష్యం ప్రజారోగ్యాన్ని కాటువేస్తున్నది. వాయుకాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాయు, నీటి కాలుష్యాలు అంతకంతకు పెరుగుతున్నాయి. వాయుకాలుష్యం అదుపుతప్పిపోవడంతో దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక్క ఢిల్లీయే కాదు భారతదేశంలో వందలాది నగరాలు వాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. మరొకపక్క ధూమపానం కూడా ప్రజారోగ్యానికి తూట్లుపొడుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా నూటముప్పైకోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగి తేలుతున్నట్లు చెప్తున్నారు. భారతదేశంలో ఇరవైకోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటుపడ్డారు. బీడీలు తాగే వారే ఎక్కువ. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. మైనర్లు కూడా ఈ పొగాకుకు అలవాటుపడడం ఆందోళన కలిగిస్తున్నది. చుట్టా, బీడీ, సిగరెట్, హుక్కా, రూపురేఖల్లో విలాసాల్లో తేడాలే కానీ వాటన్నింటికి మూలం పొగాకే. ప్రపంచవ్యాప్తంగా అనారోగ్య కారణాల్లో ధూమపానం ఇప్పుడు రెండోస్థానానికి చేరుకున్నది. ధూమపానం చేసే వారికేకాదు. వారి చుట్టుపక్కల ఉన్నవారికి కూడా రకరకాల వ్యాధులు వ్యాపింప చేయగల శక్తి దానికి ఉంది. మద్యపానం కూడా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నది. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని చెప్పుకునే పాలకపెద్దలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంత వరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తి ఎలా పెరుగుతుందో, ఎలా పెంచుకోవాలో పాలకపెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి.

విద్య అనేది శాస్త్రాలను వివరించేందుకే పరిమితం కారాదు. ఒక పరిపూర్ణమైన మానవుని తీర్చిదిద్దే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

విధుల నిర్వహణ మార్గమే పేరు ప్రతిష్టల సంపాదనకు దారితీస్తుంది.



మహాత్మాగాంధీ

# దేశాల దౌత్యనీతిలో కొత్త పరిణామాలు!

**చైనా, ఇండియాలు దగ్గరకు రావటానికి ప్రయత్నించటం విస్మయం కలిగించే పరిణామమే. కానీ హర్షణీయ పరిణామంగా భావించాలి. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీర్‌ను వదిలివెళ్లండి అని గట్టిగాఇండియా చెప్పటం, దాన్ని చైనా మాటవరసకైనా తప్పు పట్టకపోవడం, బెలూచిస్థాన్ సంపదను కొల్లగొట్టిన పాక్‌కు బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ట్రెయిన్ హైజాక్ ద్వారా కోలుకోలేని షాక్ ఇచ్చింది. పాకిస్థాన్ ప్రధాని, బెలూచిస్థాన్ అభివృద్ధి కాని ప్రాంతంగా చేసి అపారమైన సంపద కొల్లగొట్టిన విషయం ఒప్పుకోకపోయినా సరైన రీతిలో ఆ ప్రాంతం పట్ల ప్రవర్తించలేదని చెప్పినా, పాక్ ఆర్మీ ఎంతవరకు రాజకీయ నాయకుల స్వతంత్ర నిర్ణయాలను ఒప్పుకుంటుందో చూడాలి. అంతర్జాతీయంగా ఉత్కంఠ భరితమైన పరిణామాలు ఏ రూపుదిద్దుకుంటాయో వేచి చూడక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

ప్రధానమంత్రి మోడీ కుండ బద్దలు కొట్టినట్లుగా పాకిస్థాన్ మన దేశంతో సుస్థిర సంబంధాలు సాగించడానికి సిద్ధంగా లేదన్నది స్పష్టపరిచారు. అమెరికన్ సైంటిస్ట్, పోడ్‌కాస్టర్ లెక్స్‌ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూలో పాకిస్థాన్, చైనా, అమెరికా దేశాలను ప్రస్తావించి ప్రస్తుత సంబంధాలను తేటతెల్లం చేయడం విశేషం. వారి విజ్ఞత ముందు ముందు పరిణితి చెంది, పాకిస్థాన్ నాయకులు మనదేశంతో సంబంధాలు మెరుగు పర్చుకోవాలన్న ఆశాభావాన్ని కూడా వ్యక్తపరిచారు. ఇంత స్పష్టంగా మన ప్రధానమంత్రి పాకిస్థాన్‌తో ఉన్న సంబంధాల గురించి చెప్పిన దాఖలాలు ఈ మధ్యకాలంలో లేవు. 2014 సంవత్సరంలో తన పదవీ స్వీకారం తర్వాత పాకిస్థాన్ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్‌ను ఆహ్వానించానని దీనికి కారణం రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయాన్ని సృష్టించే ఆశాభావంతోనేనని ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ దేశం నుంచి తగురీతిలో స్పందనరాకపోయినా ప్రపంచం మొత్తం మనదేశ నిబద్ధత, శాంతికి కట్టుబడి ఉన్న సంగతి గమనించిందన్నది కూడా తెలియచేశారు. అయితే శాంతి సద్భావనకు, ప్రోత్సహించలేకపోగా వైరివైఖరినే ప్రదర్శించడం నిరుత్సాహపరిచిందని ఇప్పటికైనా పాకిస్థాన్ శాంతి సామరస్యత కోరుకోవాలని అభిలషిస్తున్నట్లు ఆయనమాటల ద్వారా వ్యక్తమయింది. ఇంటర్వ్యూలో మరి రెండు ముఖ్యమైన విషయాలు ప్రస్తావించారు. ఒకటి చైనాతో మెరుగైన సంబంధాల దిశగా రెండు దేశాల ప్రయత్నం, రెండు ఇండియా–అమెరికా సంబంధాలు, ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నిక కావటంతో పటిష్టపడటం! చైనాతో గత కాలంలో ఆందోళన కలిగించే పరిస్థితులను ఎదుర్కొన్నా ఇప్పుడు వాటిని తొలగించేందుకు డైలాగ్ ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని చెప్పటం ముదావహం! రెండుదేశాల మధ్య విభేదాలు ఉన్నాయి. కానీ ఈ విభేధాలు గొడవలుగా మారకుండా ఉండేందుకు కృషి చేయకతప్పదు. డిస్కార్డ్ కంటే డైలాగ్ కొనసాగింపుతోపాటు సహకారం దిశగా ప్రయత్నాలు జరుపుతేనే సుస్థిర సంబంధాలు రెండు దేశాల మధ్య ఏర్పడతాయి. ఇలాంటి సహకారం దేశాల అభివృద్ధికి అవసరం కూడా అన్నారు. ప్రధాన మంత్రి అక్టోబర్ 2024 లో చైనా ప్రసిడెంట్ జిన్‌పింగ్‌తో సంభాషణలు జరపటం వల్ల ఫలితాలు మెరుగవుతున్నాయి. సరిహద్దులలో నార్మలసీ ఏర్పడుతున్నది. 2020 ముందున్న వాతావరణం నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నాం అని కూడా చెప్పారు. 2020లో ఇరుదేశాల మధ్య వాస్తవస్వాధీన రేఖ భూభాగంలో గొడవలు జరిగాయి. ప్రాణనష్టం కూడా జరిగింది. కానీ క్రమేపీ అన్నీ సర్దుబాటు అవుతున్నాయి. అయిదేళ్ల గ్యాప్ వల్ల సామరస్య ప్రయత్నాలు ఫలవంతం కావడానికి కొంత సమయం పడుతుంది అన్న ఆశాభావాన్ని ప్రధాని ఇంటర్వ్యూలో వ్యక్తపరిచారు. అమెరికా విషయంలో ప్రధాన మంత్రి మోడీ రెండు దేశాల మధ్య వున్న సుహృద్భావ, స్నేహ సంబంధాలను గురించి ట్రంప్ రోడ్‌మాప్ గురించీ, ఏవిధంగా రెండవసారి ఎన్నిక కారనే ట్రంప్ స్పష్టమైన ప్రణాళికతో పాలనా విధానాన్ని సాగిస్తున్న సంగతి విశదీకరించారు. ఇంటర్వ్యూ చేసేవారు అమెరికన్ సైంటిస్ట్, పోడ్‌కాస్టర్ కావటం వల్ల ప్రధాన మంత్రి ఎక్కువగానే ఇరుదేశాల



మధ్య నెలకొల్పబడిన మెరుగైన బాండేజిని గురించి ఉటంకించటం జరిగింది. ప్రధాన మంత్రి మాటల వెనుక పొగడ్తలు కన్పించాయి కానీ అసలు విషయాలు టారిఫ్ పెంపు, ట్రంప్ నిక్కచ్చితత్వం ప్రదర్శన, అమెరికాలోని ఇండియా దేశస్థుల ఇబ్బంది, పలుదేశాలపై బ్యాన్ విధింపు లాంటివి దాటేసారేమో అన్న భావన కొందరు విశ్లేషకులు పసికట్టే పరిస్థితిని కాదనలేము. ప్రధాన మంత్రి అవలంబిస్తున్న విదేశాంగ విధానం బయట నుంచి అంచనాలు వేసే విశ్లేషకుల ఊహలకు అందవు కూడా. అందుకే ఇప్పుడు ఈ రెండు దేశాల సంబంధాల అంశం ఊహాగానాలకు, తర్జన భర్జనలకు దూరంగా ఉంచటమే సముచితం. ఎప్పటికప్పుడు ఏర్పడే పరిణామాల నేపథ్యంలోనే నిర్ణయాలు చేయాలి. అమెరికా– ఇండియాలు స్నేహంగా ఉండటమే ఎప్పుడూ ప్రజలు కోరుకోవాలి. ఆ మాటకొస్తే అన్ని దేశాల మధ్య సద్భావనతో కూడుకున్న సామరస్య ధోరణినే ఏ నాయకుడైనా ప్రోత్సహించాలి. ఈ మధ్య చైనా, ఇండియాలు దగ్గరవుతున్నట్లు కన్పించడం విదేశాంగ నిపుణులకు ఊహాకందని విషయమే. ఇరుదేశాలు దగ్గరవుతున్నట్లు ప్రకటించే ముందు ఒకటి రెండు జరిగిన అంశాలు జ్ఞప్తికి తెచ్చుకోవాలి. భారతదేశం పాక్ ఆక్రమించుకున్న కాశ్మీర్ భూభాగాన్ని వెంబడే ఖాళీ చేయాలని లేకపోతే తీవ్ర పరిణామాలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించడం ఒక అంశమైతే అమెరికా రష్యాలు జెలెన్‌స్కీ విషయంలో దగ్గరవటం ఉక్రెయిన్, ఇజ్రాయిల్ దేశాలకు అమెరికా పూర్తి సహకారాన్ని ఎప్పటి మాదిరే ఇస్తున్నట్లు అనిపిస్తున్నా కొంత సందిగ్ధత క్షేత్ర స్థాయిలో కనపడటం, ఈ రెండూ లోతుగా ఆలోచించదగ్గ పరిణామాలుగా భావించకతప్పదు. అమెరికా, రష్యాలు దగ్గరవటం, అమెరికా, చైనా పట్ల అవలంబిస్తున్న టారిఫ్ విధానంతోపాటు ప్రపంచ నాయకత్వంలో తమదేశం వెనుకబడుతున్నదా అన్నఅనుమానంతో చైనా బలమైన దేశంఇండియాతో స్నేహాన్ని మెరుగుపర్చుకొనే దిశగా అడుగులు వేయడం, పాకిస్థాన్‌కు ఇదివరకటిలా నేనున్నాను అని ఇండియా పి.ఓ.కె హెచ్చరిక విషయంలో చైనా హామీ ఇవ్వకపోవడం దృష్టిపెట్టాల్సిన విషయాలుగా విదేశాంగ నిపుణులు భావిస్తుండొచ్చు. పాకిస్థాన్‌కు బెలూచిస్థాన్ కొరకరాని కొయ్యగా ఎన్నాళ్ల నుంచో ఉంటున్నది కానీ మొన్నటి బెలూచ్ లిబరేషన్ ఆర్మీ (బి.యల్.ఏ) ట్రెయిన్ హైజాక్ దెబ్బతో పాకిస్థాన్ దేశంగా మరింత బలహీనపడింది. ఈ హైజాక్‌లో ఇండియా భాగం ఉందని వాదించి 'రా' సంస్థ మీద బురద జల్లేందుకు సిద్ధపడిన పాక్ దేశానికి గట్టిగా త్రిప్పికొట్టి, అలాంటి చరిత్ర భారతదేశానికి లేదన్నట్లు సమాధానం ఇవ్వటం ప్రపంచ దేశాలకు నిజాన్ని బహిర్గతం చేసినట్లయింది. భవిష్యత్తులో అంతర్జాతీయ పరిణామాలు చాలా ఆశ్చర్యకరంగా ఉండొచ్చు. దేశదేశానికి స్నేహాలూ, బంధాలూ, మారిపోయే అవకాశం ఉంది. లేకపోతే అమెరికా, రష్యాలు ఒకే త్రాటి మీద నడవడం అనేది కొన్ని దశాబ్దాల క్రిందట ఎవ్వరూ నమ్మని మాట. అప్పుడూ సుదూరాన భవిష్యత్తులో కలవగలరని ఎవరైనా సరదాగా ప్రిడిక్ట్ చేసినా వాడిని తెలివి తక్కువ వాడిగా భావించేవారు. చైనా, ఇండియాలు దగ్గరకు రావటానికి ప్రయత్నించటం విస్మయం కలిగించే పరిణామమే. కానీ హర్షణీయ పరిణామంగా భావించాలి. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీర్‌ను వదిలివెళ్లండి అని గట్టిగాఇండియా చెప్పటం, దాన్ని చైనా మాటవరసకైనా తప్పు పట్టకపోవడం, బెలూచిస్థాన్ సంపదను కొల్లగొట్టిన పాక్‌కు బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ట్రెయిన్ హైజాక్ ద్వారా కోలుకోలేని షాక్ ఇచ్చింది. పాకిస్థాన్ ప్రధాని, బెలూచిస్థాన్ అభివృద్ధి కాని ప్రాంతంగా చేసి అపారమైన సంపద కొల్లగొట్టిన విషయం ఒప్పుకోకపోయినా సరైన రీతిలో ఆ ప్రాంతం పట్ల ప్రవర్తించలేదని చెప్పినా, పాక్ ఆర్మీ ఎంతవరకు రాజకీయ నాయకుల స్వతంత్ర నిర్ణయాలను ఒప్పుకుంటుందోచూడాలి. అంతర్జాతీయంగా ఉత్కంఠ భరితమైన పరిణామాలు ఏ రూపుదిద్దుకుంటాయో వేచి చూడక తప్పదు. ●

# సీనియారిటీ జాబితాలోని లోపాలు సరిచేయాలి

**వాసిలి సురేష్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ డేటా ఆధారంగా సీనియారిటీ జాబితాలు విడుదల చేసింది. వాటిలో ఉన్న తప్పులను సరిచేసుకోవాలని ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో గ్రీవెన్స్ సెల్‌నందు సరైన ప్రూఫ్స్ జతపరచాలని కోరింది. కానీ టిఐఎస్ డేటాతో సినియారిటీ లిస్ట్ తయారు చేయడంతో టీచర్లలో ఆందోళన రేకెత్తుతున్నది. సర్వీస్‌లో చేరిన తేదీ, పుట్టిన తేదీల ఆధారంగా సీనియారిటి జాబితాలు తయారవడంతో టీచర్లు ఆందోళనకు గురవుతున్నారు. వీటిల్లో అనేకలోపాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ఇచ్చిన పదోన్నతి జాబితాలన్నీ ఒక్కసారిగా తారుమారైనట్లు కనిపిస్తున్నది. సీనియారిటీ నెంబరు స్థిరీకరించిన గత సీనియారిటీ జాబితాలను, డీఎస్సీమెరిట్ కమ్ రోస్టర్ (కౌన్సిలింగ్ జాబితా) జాబి తాలు, పదోన్నతి రోస్టర్ జాబితాల వరుసను తారుమారు చెయ్యకుండా టిఐఎస్ డేటాతో నవీకరించిన సీనియారిటీ జాబితాలు తయారు చేయబడాలి. డీఎస్సీలలో మెరిట్ కమ్ రోస్టర్ లో ఎంపిక చేసిన జాబితా లేదా పదోన్నతి వరుసలో జాబితాలు ఉండాలి. సిఎస్సి వారు సీనియారిటీ జాబితాల తయారీపై 2022 లో విడుదల చేసిన తుది మార్గదర్శకాలు ఆధారంగానే సీనియారిటీ జాబితాలు తయారు చేయాల్సి ఉన్నది. టిఐఎస్ డేటాతో సీనియారిటీ నిర్ణయించలేము. ఇవి కేవలం సీనియారిటీ జాబితాలలో రిటైరయిన, మరణించిన, గల్లంతయిన వారని గుర్తించుటకు, టీచర్ల ప్రస్తుతం పనిచేస్తున్న స్కూల్ నిర్ణయించుటకు మాత్రమే ఉపయోగపడును. ఈ బేసిక్ డీటైల్స్ నందు తప్పులను సరిచేసే బాధ్యత డిడిఓలకు ఇవ్వాలి. ప్రతీ ఒక్కరూ జిల్లా కార్యాలయానికి వచ్చి తప్పులను సరిచేసుకోవడం కష్టతరం. తప్పులను గుర్తించి సరిచేయడం క్షేత్ర స్థాయిలో మండల విద్యాశాఖాధికారులు,ప్రధానోపాధ్యాయులు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వెల్లడిం చిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు తప్పులతడకగా ఉన్నాయి. అవి డిఎస్సీ మెరిట్ లిస్టు ప్రమోషన్ల లిస్టుల ఆధారంగా ప్రకటించలేదు. బదిలీలలో సమాన పాయింట్లు వచ్చినప్పుడు ర్యాంకింగ్‌కు మొదటగా కేడర్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటామని బదిలీల డ్రాఫ్ట్ చట్టంలో ప్రభుత్వం వెల్లడించింది. జిల్లా విద్యాశాఖాధికారుల పరిధిలో ఉండే డీయస్సీ ఎంపిక జాబితాలు పదోన్నతుల జాబితాలను పరిశీలించి, వారి పరిధిలో ఉపాధ్యాయుల సీనియారిటీని నిర్ణయించాల్సి ఉంటుంది, కానీ ప్రస్తుతం కమీషనర్ కార్యాలయం కేంద్రంగా అన్నీ జరగాలనే ఉన్నతాధికారుల నిర్ణయం వల్ల ఉపా ధ్యాయులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టడం జరిగింది. డీయస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు వారి ర్యాంకుమీద అవగాహన ఉంటుంది. కాబట్టి జిల్లా విద్యా శాఖాధికారుల ద్వారా డీయస్సీ మెరిట్ లిస్టులు విడుదల చేసి, జిల్లా విద్యాశాఖాధికారుల ద్వారా సీనియారిటీ జాబితాలను సరిచేసి విడుదల చేసి, ఉపాధ్యాయులకు అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుంది. బదలీలు పదోన్నతులకు కీలకమైన సీనియారిటీ జాబితాలు సక్రమంగా విడుదల చేయకపోతే ఉపాధ్యాయులకున్యాయం చేయడం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించే పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, సరైన విధా నంలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు వెల్లడించేలా తగిన చర్యలు తీసుకోవాలి. ●

# జనసేన నేతల అతిశయోక్తి ప్రసంగాల అంతరార్థం!

**అన్నవరపు బ్రహ్మయ్య**

పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో ముఖ్యనేతలు చేసిన ప్రసంగాలు అతిశయోక్తిగా వున్నాయి. సభకు హాజరైన జనసమూహం, చేసిన ఏర్పాట్లు అద్భుతంగా వున్నాయి. కానీ వేదికపై నాయకులు చేసిన ప్రసంగాలు జనసేనపార్టీ స్థాయికి తగినట్టుగా లేవు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ సభలో ప్రధానంగా దేశ, రాష్ట్రాలకు సంబంధించిన రాజకీయ అంశాల కంటే పిఠాపురం రాజకీయాలకు పరిమితమైనట్టు కనిపించింది. సభలో మాట్లాడిన వక్తలు ప్రధానంగా పార్టీ కీలక నాయకులు చేసిన ప్రసంగాలు ఒక నియోజకవర్గ స్థాయి నాయకులు మాట్లాడినట్టుగా అనిపించింది. అంతేకాకుండా జనసేన పార్టీకి సంబంధం లేని సనాతన ధర్మం, తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం గురించి అప్రస్తుత ప్రస్తావన చేయడం చూస్తుంటే పవన్ కళ్యాన్ బిజెపి నేతల ప్రాపకం కోసం ప్రాకులాడుతున్నట్టుగా వుంది. ఎన్నికలకు ముందు సీట్ల కేటాయింపు, కూటమి పార్టీల మధ్య సీట్లసర్దుబాటు విషయాలు బహిరంగ రహస్యం. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాన్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేయాలని నిర్ణయించినప్పుడు ఆనాడు జరిగిన పరిణామాలు నియోజకవర్గ ప్రజలే కాదు, రాష్ట్రంలోని ప్రజలందరికీ గుర్తుతుంది. పిఠాపురం తెలుగు దేశం పార్టీకి, పార్టీ సిట్టింగ్ శాసనసభ్యులు వర్మకు కంచుకోటగా వుంది. తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు మాటకు కట్టుబడి, కూటమి ఒప్పందం ప్రకారం పిఠాపురంనుంచి పోటీచేయాల్సిన వర్మ తనసీటును త్యాగం చేసి పవన్ కళ్యాణ్‌కు ఇచ్చారు. ఆనాడు ఎన్నికల సమయంలో పవన్ కళ్యాన్ స్వయంగా వర్మత్యాగం గురించి, నియోజక వర్గంలో వర్మకున్న ప్రజాబలం గురించి ఎంతో గొప్పగా చెబుతూ ఆయన చేసిన మేలును మరిచిపోలేనని ప్రకటించారు. కానీ ఆవిర్భావ సభలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు కె. నాగబాబు మాట్లాడుతూ పిఠాపురం వవన్ కళ్యాన్ విజయం సాధించడానికి ప్రథమ కారణం పవన్ కళ్యాన్ గొప్పతనం కాగా, రెండో కారణం నియోజకవర్గ ప్రజలకు పవన్‌కళ్యాన్ మీదవున్న అభిమానం కారణమని, కానీ ఇందుకు విరుద్ధంగా పవన్ కళ్యాన్ విజయానికి తామే కారణమని ఎవరైన భావిస్తే వారి కర్మ అని పరోక్షంగా తెలుగుదేశం పార్టీకి చెందిన వర్మను ఉద్దేశించి వ్యాఖ్యానించడం ఆశ్చర్యం కలిగింది. వర్మకు నియోజకవర్గ ప్రజలలో తిరుగులేని ప్రాబల్యం వుంది. ఈ నియోజవర్గం నుంచి స్వంతంత్ర అభ్యర్థిగాపోటీ చేసి విజయం సాధించిన చరిత్ర వుంది. జనసేన ఎటువంటి పొత్తులు లేకుండా పోటీచేసిన సమయంలో పవన్ కళ్యాన్ కనీసం ఒక్క నియోజకవర్గంలో కూడా గెలవలేకపోయిన విషయం నాగబాబు మరచిపోయినట్టుగా వుంది. పార్టీ ప్రధాన కార్యదర్శిగావున్న నాగబాబు కంటే తానేమి తక్కువ కాదన్నట్టుగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాన్ మాట్లాడుతూ నాలుగుదశాబ్దాల చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీని తానేనిలబెట్టానని వ్యాఖ్యానించడం చూస్తుంటే పిల్ల వచ్చి గుడ్డును వెక్కిరించినట్టుగా అనిపిస్తోంది. ఈనాటికి జనసేన పార్టీకి గ్రామస్థాయి, మండల స్థాయిలలోనే కాకుండా కనీసం జిల్లా స్థాయిలలో



కూడా సమ ర్థమైన కమిటీలు ఏ ర్పాటు చేసుకోలేని స్థితిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా చివరకు బూత్ లెవల్ కమిటీలతో నిర్మాణాత్మకంగా ఎంతో పటిష్టంగా వున్న తెలుగుదేశం పార్టీని తానే నిలబెట్టానని ప్రకటించుకోవడాన్ని ప్రజలు వింతగా చెప్పుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ నిలపెట్టడానికిముందు తన అన్న చిరంజీవి ప్రారంభించిన ప్రజారాజ్యం పార్టీని నిలబెట్టివుంటే ఎంతో బాగుండేదంటూ ప్రజలు ఎద్దేవ చేస్తున్నారు. హిందీ సనాతన ధర్మం, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలను పవన్ అసందర్భ ప్రస్తావనచేశారు. నిజానికి తమిళనాడులో జరుగుతున్నహిందీ భాష వ్యతిరేక ఉద్యమంకాదు, ప్రజల అభిష్టానికి భిన్నంగా హిందీ భాషను బలవంతంగా నేర్పాలని చూసేవిధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. జనసేన పార్టీ ఆవి ర్భావం నేపథ్యంలో నిర్వహిస్తున్న సభలో మతపరమైన సనాతన ధర్మం గురించి ప్రస్తావించిన అవసరంలేదు. అయినా ప్రజలు ఎవరికి నచ్చిన ధర్మాన్నివారు ఆచరిస్తారు. బలవంతంగా మీరు ఫలానా విధంగానే జీవించాలని చెప్పడం ఎక్కడి ధర్మమో అర్థంకావడం లేదు. జనసేన ప్రారంభించిన తొలినాళ్లలో చేగువేరా తనకు ఆదర్శమని, గద్దర్ అంటే ఇష్టమని చెప్పడమే కాకుండా అసలు తమ కుటుంబమే కమ్యూనిస్టు కుటుంబమంటూ పవన్ కళ్యాన్ చేసిన ప్రకటనలు ప్రజలు మరచిపోకముందు కాషాయం ధరించి నేడు సనాతనధర్మం, ఆలయాల సందర్శన తీర్థయాత్రలు చేయడాన్ని ప్రజలు ఆశ్చర్యంగా గమనిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనపై వస్తున్న వార్తలపై తమిళనాడు ముఖ్యమంత్రిస్టాలిన్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ వంటివారు కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగే పక్షంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన అయిదు దక్షిణాది రాష్ట్రాలతోపాటు పంజాబ్, పశ్చిమ బెంగాల్ వంటిరాష్ట్రాలలో లోక్‌సభస్థానాలసంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇట్టిసమయంలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు అమలుచేయని ఉత్తరప్రదేశ్, బీహార్,రాజస్థాన్ వంటి బిజెపిపాలిత రాష్ట్రాలలో లోక్‌సభస్థానాలసంఖ్యపెరిగే అవకాశంవుంది. ఇప్పటికే కేంద్రంలో అధికారంలో వున్న నాయకులు దక్షిణాది రాష్ట్రాలపట్ల వివక్షత చూపిస్తు న్నారనే ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో జనాభా ప్రాతి పదికన పునర్విభజన జరిగితే లోక్‌సభలో అధిక లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రాలకు చెందిన నాయకుల ప్రాబల్యం పెరిగి, జనాభా తక్కువవున్నరాష్ట్రాల నేతలప్రాబల్యం తగ్గిపోతుంది. దాంతో లోక్‌సభ స్థానాలు తక్కువగావున్న రాష్ట్రాలు అభివృద్ధిపనులు, నిధుల కేటాయింపువంటి అంశాలలో తీవ్ర వివక్షత ఎదుర్కొనే ప్రమాదం ఏర్పడుతుందని దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తంఅవుతుండగా జనసేన పార్టీనేత లు బిజెపి నేతల అడుగులకు మడుగులొత్తున్నారు. పిఠాపురం వేదికపై అన్నదమ్ములు మాట్లాడిన మాటలలో మొత్తంగా కొంత ఆవేశం, మరికొంత అతిశయంకనిపించింది. ఆవేశం కారణంగానే పవన్‌కళ్యాన్ తనప్రసంగంలో రాయప్రోలు సుబ్బారావుగారు రాసిన ఏ దేశమేగినా..ఎందుకాలిడిన, పొగడరా నీ తల్లి భూమి భారతిని' అనే గేయాన్ని గురజాడవారు రాసినట్టుగా ప్రస్తావించారు. అతిశయం కార ణంగానే నాలుగు దశాబ్దాల తెలుగుదేశంపార్టీని తానే నిలబెట్టానని చెప్పుకొన్నారు. పవన్ కళ్యాణ్ ఒకవైపు కూటిమి బంధం కనీసం 15ఏళ్లు కొనసాగాలని, చంద్రబాబు దార్శనికత రాష్ట్రానికి అవసరమని చెబుతూనే మరోవైపు తెలుగు దేశంపార్టీ తనదయతో అధికారంలోకి వచ్చిందనట్టుగా మాట్లాడటాన్ని తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, అభిమానులు సహించలేకపో తున్నారు. జనసేన అగ్రనేతల మాటలు, వ్యవహారధోరణి భవిష్యత్తులో ఎటువంటి పరిణామాలకు దారితీస్తోందో వేచిచూడాల్సిందే. ●

# ప్రజావాక్కు



### పెరుగుతున్న ఆత్మహత్యలు

ఆర్థిక బాధలను తట్టుకోలేక ఈ మధ్య దంపతులు తమ పిల్లలతోసహా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొందరు పిల్లలను వదిలేసి భార్యాభర్తలు జీవితాలను అంతం చేసుకుంటున్నారు. ఆత్మహత్యలుచేసుకోవడం తప్పయితే, పిల్లలనుఅనాథలను చేయడం క్షమించరానినేరం. పాపం అభం, శుభం తెలియని పసివారి భవిష్యత్తు ఏమిటి? వారినెవరు పట్టించుకుంటారు? పిల్లల అనాధాశ్రమాలు ఇంకా పెరగాలి. ఇవి చూసుకుంటాయని ఆత్మహత్యలు మరింత ఉధృతం అయ్యేప్రమాదం కూడా ఉంది. ఆర్థికంగా చితికిపోయిన రైతులు, ఫలించని ప్రేమికులు, మన స్పర్థలతోదంపతులు, పరీక్షలు తప్పామని విద్యార్థులు, కొత్తగా, విచిత్రంగా సెల్‌ఫోను కొనివ్వలేదని, చూడని వ్యడం లేదని, ఇలా అనేక కారణాలతో అర్థాంతర మరణాలకు పాల్పడుతున్నారు. ఈఅకృత్యాలనుఆపేమార్గంకనుగొనాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ప్రపంచ దేశాలకు సవాల్

నిజమే పెద్దన్న పాత్రతికమకలో పడడంతో ప్రపంచ రాజకీయాలు స్థిరత్వమును కోల్పోతున్నాయి. ట్రంప్ టెంపరితనము వహించడం ఇప్పుడు గడిస్తే చాలు అనే వైఖరి యూరప్‌లోఅస్థిరత్వంనెలకొంటుంది. ఒక్కమాటలో చెప్పాలి అంటే మ్యాగీ రాజకీయాలు నడుస్తున్నాయి. ఎక్కడైతే ఖనిజ సంపద ఉంటుందో, ఎక్కడ అయితే సమృద్ధిగా నిక్షేపాలు ఉంటాయో, వాటిని భయం గుప్పిట్లోకి ముంచి తమ అవసరాలు తీర్చుకోవడం అనే జుగుప్సాకరమయిన రాజకీయాలునడుస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలి అంటే మూడో ప్రపంచ దేశాలు అన్ని అభివృద్ధి చెందిన దేశాల అవసరాలు తీర్చడానికి మాత్రమే అన్నట్టుగా ఉంది.

-భారత అవినాష్, జనగామ

### నైట్ స్టడీ విధానం ప్రవేశపెట్టాలి

నైట్ స్టడీవిధానంలో 2025–2026 విద్యా సంవత్సరంలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలి. రాష్ట్రంలోని అన్ని గురుకులాల సెక్రటరీలతో సమావేశాలు నిర్వహించి గురుకులాలలో నైట్‌స్టడీ విధానంలో మార్పులు చేయాలి. రాత్రి7గంటల నుండి 9గంటల వరకు ప్రతి విద్యార్థి ప్రతి క్లాసులో అల్లరి చేయకుండా ఉండడానికి ప్రతి సబ్జెక్టు టీచర్ హోంవర్క్ ప్రతిరోజు ఇవ్వాలి.

- రాపాక రవీందర్, జనగాం

### పురాతన కట్టడాలను కాపాడాలి

దేశంలో పురాతన కట్టడాలు, కోటలు, దేవాలయాలు, ప్రాచీన కళలు, గ్రామీణ క్రీడలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసే భారత్ అంటే పాశ్చాత్యులకు కూడా ఎనలేని గౌరవం. స్వేచ్ఛ స్వతంత్రం కోసం సరిహద్దుల్లో హఠాత్తుగా ఎదురయ్యే కవ్వింపు చర్యలను తిప్పికొడుతూ, విభిన్నవాతావరణంలో కంటికిరెప్పలా భారతావని ఉగ్రవాదులు, శత్రుసైనికుల బారి నుంచి కాపాడే క్రమంలో అసువులు బాసిన ఎందరో అమరులకు హ్యాట్సాఫ్. మనదేశ ఇతిహాసం చాలాగొప్పది. శాంతికిమారుపేరు.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూర్లు

### పేర్ల మార్పు దేనికి సంకేతం

నిన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుతొలగించి సురవరం ప్రతాప్ రెడ్డిపేరు, అలాగే 55 సంవత్సరాల కిందట బల్కంపేటలో ఉన్నగాంధీ ప్రకృతి వైద్యశాలకుమాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పేరు పెట్టడానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. వైశ్యులకు ప్రాధాన్యం తగ్గకుండా కొత్తగా చర్లపల్లిలో నిర్మించిన రైల్వే టెర్మినల్‌కు కేంద్ర సహకారంతో అమరజీవి పొట్టి శ్రీరాములు టెర్మినల్‌గా నామకరణం చేయాలని ప్రతిపాదన కేంద్రప్రభుత్వానికి పంపుతున్నట్టు ప్రకటించారు. ఒక సంస్థ ప్రపంచవ్యాప్తంగా వర్ధిల్లాలి అనుకుంటే దానికి ప్రేరణఇచ్చిన వ్యక్తి పేరు పెడితే బాగుంటుంది. గాంధీ పేరు విశ్వవ్యాపితం, జాతిపిత పేరు తీసి రోశయ్య గారి పేరు పెట్టడం సముచితం కాదు.

-డా.యం. అఖిలమిత్ర, హైదరాబాద్

### అభివృద్ధి పథంలో ఎస్సీ గురుకులాలు

ప్రభుత్వ ఆశయాలు నెరవేర్చడంలో ఎస్సీ గురుకుల సంస్థ సఫలీకృతమవుతున్నది. ఈవిద్యాసంవత్సరంలో సంస్థ చేపట్టిన ప్రక్షాళనా చర్యలు ఇతర విద్యాసంస్థలకు కూడా అనుసరణీయం. ముఖ్యంగా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఉన్నతాధికారులు తీసుకున్నచర్యలు అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టించే విధంగాఉన్నాయి. రిటైర్డ్ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులతో నడిచే విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాన్ని తొలగించి కోట్లాది రూపాయలు ఆదా చేశారు. మూడేళ్లపాటు అక్రమాలకు పాల్పడిన ఒక గ్రూప్–1సర్వీసు అధికారిని సాధారణ పరిపాలన శాఖకు సరెండర్ చేయడం ఒక సాహసోపేతమైన చర్య.

-మహ్మద్ రఫిమొద్దిన్, పోచారం, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గాజాపై మళ్లీ ఇజ్రాయెల్ భీకర దాడులు

## 300 దాటిన మృతుల సంఖ్య



**టెల్ అవీవ్, మార్చి 18:** ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవడంతో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఓవైపు కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపుపై చర్చలకు సిద్ధమవుతుండగా.. గాజాపై టెల్‌అవీవ్ వైమానిక దాడులతో విరుచుకు పడింది. సోమవారం రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో జరిపిన ఈ భీకర దాడుల్లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు కనీసం 330 మంది మృతి చెందినట్లు గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ వెల్లడించింది. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నట్లు ఏజెన్సీ పేర్కొంది. ఈ దాడుల కారణంగా మరో 150 మందికిపైగా గాయపడినట్లు తెలిపింది. ఖాన్‌యూనిస్, రఫా, ఉత్తర గాజా, గాజాసిటీ ప్రాంతాల్లో ఈ వైమానిక దాడులు చోటుచేసుకున్నాయి. గాజా స్ట్రిప్‌లో జరిగిన దాడుల్లో హమాస్ పోలీసు, ఇంటర్నల్ సెక్యూరిటీ హెడ్ మహ్మద్ అబు వత్ఫా కూడా మరణించినట్లు తెలిసింది.

**ఒప్పందాన్ని అంగీకరించకపోవడం వల్లే..**

దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులకు ఆదేశించినట్లు తెలిపారు. 'మా బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోంది. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించింది. ఈ నేపథ్యంలోనే దాడులకు ఆదేశించాం. యుద్ధం లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటి నుంచి హమాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**తూర్పు గాజాను ఖాళీ చేయండి..**

అటు ఐడీఎఫ్ కూడా దీనిపై ప్రకటన చేసింది. హమాస్ ఉగ్ర ముఠాకు చెందిన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే భీకర దాడులకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. మరోవైపు, హమాస్ నుంచి ప్రతీకర దాడుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గాజా సరిహద్దు ప్రాంతాల్లోని స్కూళ్లను మూసివేయాలని ఇజ్రాయెల్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ దాడుల దృష్ట్యా తూర్పు గాజాలోని ప్రజలు తక్షణమే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ మిలిటరీ ఆదేశించింది. ఆ ప్రాంతంలో మరిన్నిదాడులు చేపడుతామని హెచ్చరించింది.

తాజా పరిణామలను హమాస్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులతో ఇజ్రాయెల్ తమ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొంది. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఇటీవల ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. దాదాపు 30 మందికిపైగా తమ చెరలోని బందీలను మిలిటెంట్ సంస్థ విడుదల చేయగా.. ప్రతిగా 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఈ క్రమంలోనే రెండో దశ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరగాల్సి ఉంది. అయితే, అవి అమలు దిశగా అడుగులు పడలేదు. మరోవైపు రంజాన్ నేపథ్యంలో తొలి దశ ఒప్పందాన్ని ఏప్రిల్ 20 వరకు కొనసాగించాలని అమెరికా ప్రత్యేక రాయబారి ప్రతిపాదించారు. దీనికి టెల్‌అవీవ్ అంగీకరించగా.. హమాస్ నిరాకరించింది.

ఈ నేపథ్యంలో హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు నెతన్యాహు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా గాజాకు వెళ్లే మానవతా సాయాన్ని అడ్డుకోవడంతో పాటు కరెంటు సరఫరాను ఇజ్రాయెల్ నిలిపివేసింది.



# బలోచ్ వేర్పాటువాదుల అణచివేతకు చైనా బలగాలు?

**బీజింగ్, మార్చి 18:** పాకిస్థాన్‌లో బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులు పెరుగుతున్న వేళ చైనా కీలక చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. బీజింగ్‌కు చెందిన ప్రైవేటు భద్రతా దళాలను పాక్‌కు మద్దతుగా మోహరించాలన్నది దీని సారాంశం. ఇటీవల సీపెక్ ప్రాజెక్టులోని వర్కర్లను, ఇంజినీర్లను కాపాడేందుకు తమ దేశానికి చెందిన ప్రైవేటు భద్రతా బృందాలు, మిలిటరీ సిబ్బందిని నియమించేందుకు వీలుగా ఓ ఒప్పందంపై సంతకం చేసింది. దీని కింద డెవ్వె సెక్యూరిటీ ఫ్రాంటియర్ గ్రూప్, చైనా ఓవర్సీస్ సెక్యూరిటీ గ్రూప్, హుయాక్సిన్ ఝూంగ్‌షాన్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థలు పాక్‌లోని చైనా జాతీయుల భద్రతను పర్యవేక్షించనున్నాయి. బలోచ్ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో చైనా జాతీయుల భద్రత ప్రధానంగా మారింది. గత ఏడాది ఇద్దరు చైనా జాతీయులపై ఆత్మాహుతి దాడి జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బిఎల్‌ఎ కార్యకలాపాలు ఊపందుకున్న నేపథ్యంలో పాక్‌లో బీజింగ్ దళాలను మోహరించే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాంతంలో చైనా బలగాల మోహరింపులో ఇది కీలక అడుగుగా మారనుంది.

మరోవైపు పాక్–చైనా సంయుక్త సెక్యూరిటీ కంపెనీ ఏర్పాటు చేయాలని బీజింగ్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. సీపెక్‌లోని ప్రాజెక్టులు, ఉద్యోగుల రక్షణ బాధ్యతల కోసం దీనిని వినియోగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో యాంటీ టెర్రరిజం కోఆపరేషన్ అగ్రిమెంట్‌పై సంతకం చేయాలని చైనా కోరుతోంది. ఇదే జరిగితే డ్రాగన్ సైన్యం అధికారికంగా అడుగుపెట్టేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం చైనా–పాక్ ఎకనామిక్ కారిడార్‌లో దాదాపు 30 వేల చైనా జాతీయులు పనిచేస్తున్నారు. వారి భద్రతే ప్రధానఅంశంగా మారింది. ముఖ్యంగా బలోచిస్థాన్, గ్వాదార్ ప్రాంతాల్లో ముప్పు మరింత తీవ్రంగా ఉంది.



# దిహులి మారణకాండలో ముగ్గురు నిందితులకు మరణశిక్ష

## ప్రయాగరాజ్ సెషన్స్‌కోర్టు సంచలన తీర్పు

**ఫిరోజాబాద్(యూపి), మార్చి 18:** దాదాపు 44 ఏళ్లనాటి దళితుల సామూహిక హత్యల కేసులో ప్రత్యేక కోర్టు ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధించింది. ఇద్దరు దోషులకు ఒక్కొక్కరికి రూ. 2లక్షలు, మరో దోషికి రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. ఫిరోజాబాద్‌లోని జస్రానాలోని దిహులి గ్రామంలో 1981 నవంబర్ 24న జరిగిన 24మంది దళితుల ఊచకోత కేసులో కోర్టు తీర్పును వెల్లడించింది. ఆ తర్వాత నిందితులను మైన్‌పురి జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితులైన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంప్‌లను భారీ భద్రత మధ్య మెయిన్‌పురి జిల్లా నుంచి పోలీసులు ఉదయం 11.30 గంటలకు ఏడీజే స్పెషల్ రాబరీ ఇందిరా సింగ్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున రోహిత్ శుక్లా కోర్టు ఎదుట వాదనలు వినిపించారు. మారణ హోమం కేసులో సాక్ష్యాలను పరిశీలించి.. నిందితులకు మరణశిక్ష విధించాలని కోర్టును కోరారు. కేసులో వాదనలు విన్న కోర్టు దోషులుగా తేలిన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌కు మరణశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన తర్వాత ముగ్గురు దోషులు కోర్టులోనే విలపించారు. వారి బంధువులు సైతం కంటతడిపెట్టారు. కోర్టు నిందితులకు 30 రోజుల్లోగా మరణశిక్షకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. కోర్టుతీర్పు నేపథ్యంలో 14 రోజుల పాటు దోషులు జైలులోని క్వారంటైన్ బ్యారక్‌లో ఉండనున్నారు.

# పిస్టల్‌తో వైష్ణోదేవి ఆలయంలోకి భక్తురాలు

**జమ్ము, మార్చి 18:** ఢిల్లీనుంచి వచ్చిన ఒక భక్తురాలు లోడెడ్ పిస్టల్‌తో వైష్ణోదేవి ఆలయంలోకి ప్రవేశించడం వివాదాస్పదం అయింది. ఆలయంలో భద్రత కొరవడిందని భక్తులు మండిపడుతున్నారు. జమ్ములోని రైజీజిల్లా త్రికూట పర్వతంపై నెలకొన్న మాతా వైష్ణోదేవి ఆలయాన్ని లక్షలాదిగా భక్తులు దర్శనానికి వస్తుంటారు. జ్యోతి గుప్తా అనే రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ ఆరు రౌండ్ల గుళ్లతో ఉన్న పిస్టల్‌ను తీసుకుని వచ్చింది. ఈనెల 14–15 తేదీల్లో తెల్లవారు జామున గుప్తా ప్రధాన మందిరం చెక్‌పాయింట్ వద్ద తనిఖీల్లో బయటపడింది. అధికారుల వివరాలప్రకారం గుప్తాకు ఉన్న తుపాకి లైసెన్స్ రెండేళ్లక్రితమే కాలంచెల్లిందని అధికారులు తెలిపారు. ఈ మహిళ ఢిల్లీ పోలీస్ శాఖలో పనిచేస్తున్నట్లు చెప్పిందని భద్రతా అధికారులు చెప్పారు. ఎస్పీ పరమీందర్‌సింగ్ మాట్లాడుతూ ఢిల్లీ మహిళను అరెస్టు చేసామని, అయితే విచారణలో ఆమె ఢిల్లీపోలీస్‌శాఖలో పనిచేయడం లేదని తేలిందన్నారు. ఆమె తుపాకీకి లైసెన్స్ ముగిసిపోయిందని, రైజీ పోలీసులు ఆమెను అరెస్టు చేసి తుపాకిని స్వాధీనంచేసుకున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఖాత్రాలోని భావన్‌పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించి కేసునమోదయిందన్నారు. ఆయుధచట్టం కింద కూడా మరో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఎస్‌పీ చెప్పారు.

# ప్రభుత్వ సిబ్బంది ఖాతాల్లోకి ప్రకృతి వైపరీత్యాల నిధులు

## రూ.23.81 కోట్ల నిధులు మళ్లింపు జరిగిందని కాగ్ చురకలు

**భోపాల్, మార్చి 18:** ప్రకృతి వైపరీత్యాల్లో బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు కేటాయించిన 23.81 కోట్ల సొమ్ములు ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లోకి మళ్లించారని నిబంధనలకు విరుద్ధమని కమ్‌ట్రోలర్ ఆడిటర్‌జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ప్రభుత్వ ఉద్యోగులు, వారి బంధువులు, ఇతర అనధికారిక, అర్హతలేని వ్యక్తులకు 13 జిల్లాల్లో ఈ పంపిణీజరిగిందని కాగ్ తన నివేదికలో పొందుపరిచింది. మధ్యప్రదేశ్‌లోని 13జిల్లాలు అంటే సియోని, షియోపూర్, సేహోర్, శివ్‌పురి, దేవాస్, ఛతార్‌పూర్; ఖాండ్వా, మంద్‌సౌర్, రైసెన్, దామోహ్, సాత్నా, అగర్ మాల్వా, విదిశా జిల్లాల్లో ఈ అక్రమ పంపిణీలు జరిగినట్లు కాగ్ వెల్లడించింది. మొత్తంలో 238.81 కోట్లు, 21.14 కోట్లు సొమ్ములను అనధికారిక, అనర్హుల ఖాతాల్లోకి మళ్లించారని, 2.67 కోట్లు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులు, వారి బంధువుల ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. వాస్తవానికి ఈ సొమ్ము ప్రకృతి వైపరీత్యాల్లో సర్వం కోల్పోయిన బాధితులు, ఉరుములు, పిడుగుపాటుకు మృతిచెందినవారు. తుపానులు, కరవు కాటకాల్లో బాధితులు, వర్షాలు, వరదలు, ప్రమాదాలకు గురయిన బాధిత కుటుంబాలతో పాటు పాముకరిచి మృతిచెందిన కుటుంబాలకు అందించాల్సిన సాయం నిధులు అని కాగ్ తేల్చింది. ప్రభుత్వ సిబ్బంది గ్లోబల్ బడ్జెట్ వ్యవస్థలో ఉన్న అవకతవకలను ఆసరాగా చేసుకుని సమీకృత ఆర్థిక పర్యవేక్షణ సమాచార వ్యవస్థలోని లొసుగుల ఆధారంగా సొమ్ముచేసుకున్నట్లు తేలింది. బోగస్ మంజూరు ఉత్తర్వులను సిద్ధంచేసి బోగస్ లబ్దిదారులను కూడా ఎంపికచేసి వారికి ఈపేమెంట్‌చేసేందుకుగాను ఉద్యోగులు, వారి బంధుల ఖాతాల్లోకి ఈ సొమ్మును బదలాయించారు. ఒక్క సియోని జిల్లాలోనే 11.79 కోట్లు ఇలా బదలాయింపు జరిగింది. 59 ఖాతాల్లోకి 291 నకలీ ఉత్తర్వులు 201 పిడుగుపాటు మృతులు, 90 పాముకరిచి మృతిచెందిన కుటుంబాలకు అన్నట్లుగా పంపిణీ చేసారు. షియోపూర్‌లో కూడా 3.36 కోట్ల మేర ఇలా అనర్హులకు, బోగస్ లబ్దిదారులకు పంపిణీ చేసారు. డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు కుమ్మక్కయితేనే ఈ వ్యవస్థనడుస్తుందని ట్రెజరీ అధికారుల హస్తం లేకుండా ఇలా జరగదని కూడా కాగ్ తేల్చింది. నివేదిక వెల్లడికాగానే నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఒక తహసీల్దార్, మరో నాయిబ్ తహసీల్దార్‌లనున సియోని జిల్లాలో సస్పెండ్‌చేసారు. ఒక ఉద్యోగిపై కేసు కూడా నమోదయింది. శాఖాపరంగా ఈ మొత్తం సిబ్బందిపై దర్యాప్తునుప్రారంభించాడు. అలాగే మరోక కేసుపరంగా మెజిస్ట్రీరియల్ విచారణ కూడా ప్రారంభించారు. షియోపూర్ జిల్లాలో పునరావాసం సొమ్ము ప్రభుత్వ సిబ్బందికి బదలాయించారు. 2021లో వరదబాధితులకు ఇవ్వాల్సిన ఈ సొమ్ము మొత్తం ఇతరులకు లాభపడింది. జిల్లాస్థాయిలో ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి ఈమొత్తం భాగోతంపై దర్యాప్తునకు ఆదేశించారు. ఇప్పటికే 11 లక్షలు రికవరీచేసారు. పొరుగుననే ఉన్న శివపురి జిల్లాలోకూడా కరువుబాధితులకు ఇవ్వాల్సిన నిధులు బదలీ చేసారు. ప్రభుత్వ ఉద్యోగి సస్పెండ్ కాగా మరో ముగ్గురిని కేసులో నమోదుచేసారు.

# ఎంఎన్‌జీరేగా నిధులకోతపై సోనియా మండిపాటు

## యుపిఎ ప్రభుత్వం తెచ్చిందని కోతలు పెడుతున్న సర్కార్



**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్‌రేగాకు బడ్జెట్‌లో నిధుల కోతపై రాజ్యసభ ఎంపి సోనియాగాంధీ తీవ్రనిరసన తెలిపారు. బడ్జెట్ అనంతర చర్చలోభాగంగా మంగళవారం రాజ్యసభలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత యంత్రాంగం ఈపథకాన్ని నిర్వీర్యంచేయాలని చూస్తోందని యుపిఎ ప్రభుత్వంలో డా.మన్మోహన్‌సింగ్ హయాంలో ఈ పథకం ప్రారంభించిన అంశాన్ని ఆమె గుర్తుచేసారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈపథకాన్ని కనుమరుగు చేయాలని చూస్తోందని, బడ్జెట్ కేటాయింపులు 86 వేల కోట్ల వద్దనే నిలిచిపోయాయని ఆమె ప్రశ్నించారు. వాస్తవానికి కేటాయింపులు నాలుగువేల కోట్లు తగ్గించారని, అంచనాలు మాత్రం కేటాయించిన నిధులకంటే 20శాతం ఎక్కువ ఉన్నాయని ఈ నిధులు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు మాత్రమే సరిపోతాయని ఆమె అన్నారు.

ఎంఎన్జీరేగా పథకంలో అనేక సమస్యలు, సవాళ్లు ఎదురవుతున్నాయని, ఆధార్‌సహిత చెల్లింపుల వ్యవస్థ తప్పనిసరి చేసారని నేషనల్ మొబైల్ మానిటరింగ్ వ్యవస్థలో చెల్లింపుల్లో ఎక్కువ జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఈపథకం మరింత విస్తరించేందుకు వీలుగా రోజువారి భృతిని రూ.400కు పెంచాలని సోనియా విజ్ఞప్తిచేసారు. అంతేకాకుండా ప్రభుత్వం తప్పనిసరి నిబంధనలను తొలగించాలని, ఆధార్ చెల్లింపులు, ఎన్బీఎంఎస్ వ్యవస్థలను తొలగించాలని కోరారు. ఎంఎన్జీరేగాలో పనిదినాలు 100 నుంచి 150 రోజులకు పెంచాలనికోరారు. గ్రామీణప్రాంతంలో ఉన్న లక్షలాది మంది నిరుపేద కూలీలకు ఈ పొడిగింపు ఎంతో మేలు చేస్తుందని ఆమె కోరారు. ఆర్థికభద్రతను ఇస్తుందన్నారు.

# లెబనీస్ వైద్యురాలిపై అమెరికా బహిష్కరణ వేటు

## ట్రంప్ ఫొటోతో బైబై



**వాషింగ్టన్, మార్చి 18:** రోడ్ ఐలాండ్‌లో కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ డాక్టర్ రాషా అలవీకి హెజ్‌బొల్లాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించింది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ చేసిన పోస్టు వైరల్‌గా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బై చెప్తున్నట్లుగా ఉన్న ఫొటోను షేర్ చేస్తూ.. బైబై రాషా అంటూ రాసుకొచ్చింది. గతవారం బోస్టన్ లోగాన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాషాను అమెరికా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల లెబనాన్ పర్యటనకు వెళ్లిన రాషా ఫిబ్రవరి 23న జరిగిన 'హెజ్‌బొల్లా' మాజీ అధినేత హసన్ నస్రల్లా (64) అంత్యక్రియలకు హాజరయినట్లు దర్యాప్తులో అంగీకరించిందని అన్నారు. అంతేకాకుండా ఆమె ఫోన్‌లో నస్రల్లా, ఇతర హెజ్‌బొల్లా నేతల ఫొటోలు ఉన్నాయని.. కాగా బోస్టన్ చేరుకునే ముందు రాషా వాటిని తొలగించారని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రశ్నించగా వారి రాజకీయ కార్యకలాపాల గురించి కాకుండా.. మతపరమైన, ఆధ్యాత్మిక బోధనల విషయంలో తాను హెజ్‌బొల్లా నేతలను అనుసరిస్తానని పేర్కొన్నట్లు తెలిపారు. తీవ్రవాద సంబంధాలు ఉన్న వీసాదారులపై విస్తృత చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆమెకు హెజ్‌బొల్లాతో సంబంధాలు ఉన్నాయని తెలియడంతో దేశం నుంచి బహిష్కరించినట్లు వెల్లడించారు.

వీసా అనేది ఒక ప్రత్యేక హక్కు అని.. కానీ అమెరికన్లను హతమార్చే ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం వల్ల రాషా వీసా జారీని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. ఇదేవిధంగా ఇటీవల కొలంబియా విశ్వవిద్యాలయంలో ఒక పాలస్తీనా కార్యకర్తను అరెస్టు చేశామని, మరొక విద్యార్థి వీసా రద్దు చేశామన్నారు. 34 యేళ్ల రాషా బ్రౌన్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్‌గా పనిచేయడానికి హెచ్–1బి వీసా ద్వారా అమెరికాకు వెళ్లింది. ఆమెను హెజ్‌బొల్లా మద్దతుదారుగా గుర్తించిన యుఎస్ అధికారులు వెంటనే దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు చేపట్టారు. అయితే హఠాత్తుగా ఆమెను దేశం నుంచి బహిష్కరించడాన్ని రాషా తరఫు లాయర్లు వ్యతిరేకించారు. ఈ విషయంపై చట్టపరమైన పోరాటాన్ని కొనసాగిస్తామని రాషా తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

# లోక్‌సభ విపక్షనేతను కూడా మాట్లాడేందుకు అనుమతించలేదు

## ఎల్వోపీ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాకుంభ్‌పై మోడీ ప్రకటన తర్వాత నిరసనల మధ్య వాయిదా పడిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు అవకాశం కూడా ఇవ్వకుండా వాయిదా పడుతోందని లోక్‌సభ ఎల్వోపీ రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. విపక్షనాయకుడికి మాట్లాడే అవకాశం ఉంటుందని ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉందని, నవీనభారతావనిలో ఎల్వోపీకి అవకాశం మాత్రం రాదని ఆయన ఎద్దేవాచేసారు. వాయిదాపడిన తర్వాత పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రధాని మహాకుంభ్‌ప్రస్తావన తెచ్చేముందు జనవరి 29న జరిగిన తొక్కిసలాటలో మరణించిన 30 మందికి కనీసం సంతాపంఅయినా ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. అవేమీలేకుండా మహాకుంభ్ ఐక్యత తెచ్చిందని, ప్రపంచాన్ని మొత్తం ఏకంచేసిందంటూ ప్రసంగించారని ఆయన అన్నారు. మహాకుంభ్ విజయవంతంగా నిర్వహించామని మోడీచేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో విపక్షం మండిపడిన సంగతి తెలిసిందే. తీవ్రనిరసనల మధ్య లోక్‌సభ బుధవారానికి వాయిదాపడింది. ప్రధాని వ్యాఖ్యలకు నిరసన తెలుపుతూ అనేకమంది ప్రతిపక్ష ఎంపిలు తమ సీట్లవద్దనుంచే నిరసన తెలిపారు. కకుంభ్ అనేది మన సంస్కృతి సాంప్రదాయానికి నిదర్శనమని, చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబిస్తుందని రాహుల్ పేర్కొంటూ అలాంటి భారీ ఎత్తున నిర్వహించినట్లు చెపుతున్న ప్రధానిమోడీ మహాకుంభ్ తొక్కిసలాటలో మృతులకు కనీసం సభలో సంతాపం కూడా తెలియజేయకపోవడం విచారకరమని రాహుల్ అన్నారు. మహాకుంభ్‌కు వెళ్లిన యువతకు ఉపాధి ప్రస్తావన కూడా తీసుకురాలేదని, మహాకుంభ్‌తోపాటు నిరుద్యోగంపైనా ప్రధాని స్పందించాలని కాంగ్రెస్‌నేత రాహుల్ అన్నారు. మమ్మల్ని మాట్లాడేందుకు కూడా అనుమతించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ ప్రతిపక్షాన్ని మాట్లాడేందుకు అనుమతించాలని కోరారు. మహాకుంభ్‌లాంటి అత్యంత భారీ కార్యక్రమం భారత్‌నిర్వహించే సామర్థ్యం ఉందా అని ప్రశ్నించినవారికి సమాధానంగా మహాకుంభ్ విజయవంతం అయిందని మోడీ తన ప్రసంగంలోపేర్కొన్నారు. వికసితభారత్ స్ఫూర్తిని మహాకుంభ్ చాటిచెప్పిందన్నారు.

# చిన్నకేసుల్లోకూడా బెయిల్ తిరస్కృతి మంచిదికాదు

## దిగువ కోర్టులకు సుప్రీం బెంచ్ చురకలు

**న్యూఢిల్లీ, మార్చి 18:** దిగువకోర్టుల్లో బెయిల్ పిటిషన్లను లెక్కకు మించి తిరస్కరణకు గురవుతుండటంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. తీవ్రస్థాయి కేసులు కాకపోయినప్పటికీ బెయిల్ అభ్యర్థనలను తిరస్కరించడంపై సుప్రీంకోర్టు తీవ్రంగాపరిగణించింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్‌బూయాన్‌లతోకూడిన బెంచ్ ప్రజాస్వామ్య దేశం ఎంతమాత్రం పోలీస్ ప్రభుత్వంగా కొనసాగకూడదని, చట్టం అమలుచేసే సంస్థలు ఏకపక్షంగా అధికారాలను ప్రయోగించి వ్యక్తులను ఎలాంటి సహేతుకమైన కారణం లేకుండా అదుపులోకి తీసుకోవడం ఎంతమాత్రం మంచి సాంప్రదాయం కాదన్నారు. రెండు దశాబ్దాల క్రితం బెయిల్ అభ్యర్థనలు చిన్న కేసుల్లో అత్యంత అరుదుగా హైకోర్టువరకూ వచ్చేవని, ఇపుడు నేరుగా సుప్రీం కోర్టు వరకూ వస్తున్నాయని, దీనిపై ట్రయల్ కోర్టుల పని తీరును సందేహించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసారు. బెయిల్ అభ్యర్థనలను ట్రయల్ కోర్టు స్థాయిలోనే పరిష్కరించాలని, బెయిల్ అభ్యర్థనల్లో అనవసర భారం పెంచుతున్నారని జస్టిస్ ఓఖా చురకలువేసారు. బెయిల్ అభ్యర్థనలపై సుప్రీంకోర్టు మండిపడటం ఇదేమీ కొత్త కాదు. పదేపదే దిగువకోర్టులు, హైకోర్టులకు బెయిల్‌మంజూరులో సడలింపుల వైఖరితో ఉండాలని సూచించింది. మైనర్ తీవ్రతలేని కేసుల్లో బెయిల్ ఎందుకు మంజూరుచేయడం లేదని మండిపడ్డారు. ఒక మోసం కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తిని రెండేళ్లుగా కస్టడీలోనే కొనసాగించడంపై సుప్రీంకోర్టు మండిపడింది. నిందితుడి బెయిల్ అభ్యర్థన దిగువకోర్టు, గుజరాత్ హైకోర్టులు రెండూ తిరస్కరించాయని, దర్యాప్తు పూర్తి అయి ఛార్జిషీటు దాఖలయినా కూడా నిందితుడికి ట్రయల్‌కోర్టు బెయిల్ అభ్యర్థన పరిగణనలోనికి తీసుకోలేదని తిరస్కరించారు. శిక్షార్హమైన నేరాల్లో అరెస్టుచేసిన నిందితులు ఏడేళ్ల జైలుశిక్ష పడే తీవ్రస్థాయి కేసులున్నవారికి కూడా నిరంతర కస్టడీ అనేది వీలుకాదన్నారు. వ్యక్తులస్వేచ్ఛను కూడా పరిగణనలోనికి తీసుకుని బెయిల్ మంజూరు అభ్యర్థనలు పరిశీలించాలని సూచించింది. నిందితుడు దర్యాప్తునకు పూర్తిసహకారం అందించిన పక్షంలోను, దర్యాప్తుసమయంలో అరెస్టుచేయకపోయినా ఛార్జిషీటు దాఖలుచేసిన తర్వాత కస్టడీలో కొనసాగించడం మంచి సాంప్రదాయం కాదని బెంచ్ స్పష్టంచేసింది.

# మోడీ మహాకుంభ్ వ్యాఖ్యలపై విపక్షం నిరసన

## వాయిదా పడిన లోక్‌సభ



**న్యూఢిల్లీ, మార్చి 18:** మహాకుంభ్‌పై నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలపై విపక్ష సభ్యుల ప్రశ్నలకు జవాబివ్వాలనికోరుతూ ప్రతిపక్షం నిరసనలమధ్య మంగలవారం లోక్‌సభ వాయిదా పడింది. అంతకు ముందుకూడా మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సభా కార్యక్రమాలు వాయిదాపడ్డాయి. మహాకుంభ్‌పై ప్రధానిమోడీ చేసిన ప్రకటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ విపక్ష సభ్యులు తమ సీట్లనుంచే లేచి నిరసన తెలిపారు. ప్రధాని మోడీ ప్రకటనలో తొక్కిసలాట, మరణాలను కూడా ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. 30 మందిచనిపోయారని ప్రపంచం మొత్తానికి తెలుసునని విపక్షం ఆరోపించింది. వాయిదా తర్వాత మళ్లీ ప్రారంభం అయిన సభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తన మంత్రిత్వశాఖ డిమాండ్స్ ఫర్‌గ్రాంట్స్‌పై చర్చను లేవనెత్తారు. జలశక్తి మంత్రిత్వశాఖ గ్రాంట్లపై చర్చనుప్రారంభించగా విపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపారు. వెంటనే ఈచర్చను వాయిదా వేయాలనికోరారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం మళ్లీ సమావేశం అయిన లోక్‌సభలోప్రధాని సభను తప్పుదోవ పట్టించేందుకు మహాకుంభ్ ప్రకటనచేసారని, మోడీ ప్రకటనలో మృతుల వివరాలు, తొక్కిసలాట సమాచారమే లేదని ఆరోపిస్తూ పెద్ద పెట్టున నినాదాలుచేసారు. దీనితో స్పీకర్‌ఓంబిర్లా సభను వాయిదావేసారు.

# నేను మీ అందరికన్నా సీనియర్!.. ఏం మాట్లాడాలో నాకు తెలుసు!

## మంత్రులు నోట్ చేసుకోవడమంటే చెత్తబుట్టకు దాఖలు చేయడమే

### అసెంబ్లీలో దానం నాగేందర్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** నేను మీ అందరి కంటే సీనియర్ ఎమ్మెల్యేని, తనకు ఏం మాట్లాడాలో తెలుసని అన్నారు. ఏం మాట్లాడాలో తనకి ఎవరు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.



అనేక సందర్భాల్లో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు స్థలం కావాలని విజ్ఞప్తి చేశానని, తన విజ్ఞప్తి పక్కనపెట్టి వేరేవేరే ఆఫీస్‌కు శంకుస్థాపన చేశారని అన్నారు. క్యాంప్ ఆఫీసు గురించి గత పదిహేను నెలల నుంచి విజ్ఞప్తి చేస్తున్నాను. మేము అడిగిన క్యాంప్ ఆఫీసు గురించి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వద్ద సమాచారం లేదు. జీహెచ్‌ఎంసీ వద్ద సమాచారం లేదు. ఇది ఆశ్చర్యకరమే. మా నియోజకవర్గం రోడ్ నెంబర్ 10లో ఈద్గా గ్రౌండ్ ఉంది. ఆ గ్రౌండ్ ఒక సబ్‌స్టేషన్ గురించి ల్యాండ్ అలాట్‌మెంట్ ఇచ్చారు. ఇప్పుడు రంజాన్ నడుస్తోంది. ఈద్గా గ్రౌండ్‌లో నాకు క్యాంప్ ఆఫీసుకు స్థలం ఇవ్వమంటే ఐడెంటిఫై చేయలేకపోయారు. సబ్‌స్టేషన్‌కు నా ప్రమేయం లేకుం డానే శంకుస్థాపన చేశారు. అందుకే శిలాఫలకం కూలగొట్టిన్నట్లు తెలిపారు. ఇడబ్ల్యుఎస్ కాలనీలో అక్రమనిర్మాణాలు చేపట్టారని తెలిపారు. దీనిపై జీహెచ్ ఎంసీ అధికారులు కానీ పోలీస్ అధికారులు కానీ పట్టించుకోవటం లేదని అన్నారు. సోషల్ మీడియాకు భయపడి వెంటనే రెస్పాండ్ అయ్యే అధికారులు ఎమ్మెల్యే ఫిర్యాదుకు స్పందించటం లేదని సభలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాను మంత్రిగా కూడా పనిచేశాను.. జీరో అవర్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలను నోట్ చేసుకున్నా అని చెపుతారు అనంతరం వాటిని బయట చెత్తబుట్టలో వేస్తారని ఆవేదన చెందారు.

# బడ్జెట్‌లో ఎస్సీలకు 18శాతం నిధులు కేటాయించాలి

### ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీలకు 18శాతం నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఎస్సీ బిల్లుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాలలు, మాదిగలకు, మద్య ఉన్న అపోహలు తొలగిపోవాలన్నారు. వర్గీకరణ సమయంలో మాలలపై తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారులపై తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఉద్యోగాలు, స్కీంలు, మాలలకే వచ్చినట్లు ఫేక్ ప్రచారం చేశారని, మాదిగలకు 65 వేలకు పైగా జాబ్‌లు వస్తే మాలలకు 48 వేల జాబ్స్ వచ్చాయన్నారు. ఎస్సీ కార్పోరేషన్ నిధుల్లో మాదిగలకే ఎక్కువ వాటా ఇచ్చారన్నారు. ఇందిరాగాంధీ ఎస్సీలకు ఎంతో చేశారని, అసైన్డ్ భూములను ఎస్సీలకు పంపిణీ చేశారని, వర్గీకరణపై కమిటీ రిపోర్టు ఇస్తే స్టడీ చేసి సలహాలు ఇస్తామన్నారు. కులగణన ప్రకారం ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్లు వస్తాయన్నారు. ఎస్సీల్లో విభజన తెచ్చే ప్రమాదం ఉందని అప్పుడే అంబేద్కర్ చెప్పారన్నారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు పెరిగాయని, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.100కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టుల్లోనూ 18వాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

# తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 18, ప్రభాతవార్త:** తెలుగు సాహిత్య రంగంలో భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా తెలుగు విశ్వవిద్యాలయంకు తెలంగాణ సుప్రసిద్ధ రచయిత, వైతాళికుడు 'సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం'గా నామకరణ చేసినందుకు ప్రభుత్వానికి, అసెంబ్లీలో రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇచ్చిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు సురవరం ప్రతాప్‌రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య, ట్రస్టీలు సురవరం పుష్పలత, డాక్టర్ కృష్ణవర్ధన్‌రెడ్డి తది తరులు మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి కృషిని ప్రజలందరూ గుర్తించాలనే ఆకాంక్షలతో సిఎం రేవంత్‌రెడ్డి గుర్తించి గౌరవించినందుకు అభినందనలు తెలియ జేశారు. ప్రతి యేడాది ప్రతాపరెడ్డి జయంతిని మే 28న ఉత్సవంగా నిర్వ హించాలని, దాశరథి పేరు తో పురస్కారాన్ని అందజేస్తున్న మాదిరిగానే సురవరం ప్రతాపరెడ్డి పేరు మీద కూటా పురస్కారాన్ని ఇవ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తెలుగు సాహిత్య, జర్నలిజం రంగాలలో విశేష సేవలు అందిస్తునన వారికి ఒక అవార్డుతోపాటు ఈ రంగాలలో అధ్యయనం చేస్తున్న ప్రతిభావంతులకు ఒక స్కాలర్‌షిప్‌లను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం పేరు మీద ఇవ్వాలని వారు కోరారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు, సురవరం మనవలు, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరి మృతి

**డిండి, మార్చి 18, ప్రభాతవార్త :** ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. డిండి మండలం కొత్తతండాకు చెందిన జటావత్ శక్రు(55) ద్విచక్ర వాహనంపై చర్కుపల్లి నుంచి తమ క్లాపూర్ వెళ్తుండగా.. అదే మార్గంలో పైశే షాయికుంటకు చెందిన వింజమూరి సాయి(22) ద్విచక్ర వాహనంపై అతివేగంతో తవక్లాపర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. హజ్యతండా వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేక రించారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపు కున్నట్టు ఎస్సై రాజు తెలిపారు.

# అసెంబ్లీ ముట్టడికి బిజెవైఎం యత్నం

## బిజెఎల్‌పి నేత ఏలేటి సహా నేతల అరెస్టు



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని సెంట్రల్ వర్శిటీకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూములను సర్కారు వేలం వేయాలను కోవడంపై నిరసన గా బిజెవైఎం నేతలు మంగళవారం నాడు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో బిజెవైఎం కార్యకర్తలు అసెంబ్లీ వైపు దూసుకువచ్చారు. అయితే దీనిపై ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు వారిని అసెంబ్లీ వద్ద రోడ్డుపైనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో బిజెవైఎం నేతలకు కొద్దిసేపు తోపులాట జరిగింది.
సెంట్రల్ వర్శిటీకి చెందిన 400 ఎకరాల భూములను సర్కారు వేలం వేయడం సరైంది కాదని ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి తెలిపారు. యూనివర్శిటీలకు చెందిన భూములను సర్కారు తన ఆర్థిక అవసరాల కోసం వే లం వేయాలని చూడడం దారుణమని ఆయన విమర్శించారు. ఇలా అమ్ముకుంటూ పోతే యూనివర్శిటీల వద్ద భూములు వుండవని, విద్యార్థులు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. కాగా అసెంబ్లీ వద్ద ఆందోళనకు దిగిన మహేశ్వర్ రెడ్డితో పాటు ఇతర బిజెవైఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని నేరుగా బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తర లించారు. పోలీసు స్టేషన్ వద్ద పోలీసులతో మహేశ్వర్ రెడ్డి వాగ్వి వాదానికి దిగారు. తనను రెండు గంటల పాటు రోడ్లపైన ఎందుకు తి ప్పారని అడిగారు. అయితే పోలీసులు మాత్రం తమ విధులు తాము నిర్వర్తించామని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని అన్నారు. బిజెవైఎం నేతల అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో శాసనసభ వద్ద బందోబస్తు పటిష్టం చేశారు.

# ధర్నాచౌక్‌కు మంత్రులను పంపే సంప్రదాయం నెలకొల్పండి

## తెలంగాణ ఉద్యమకారులకు ఇంటిస్థలాలు ఇవ్వండి : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## సాగు, తాగునీటి అవసరాలపై పదేళ్ల తరువాత అసెంబ్లీలో తలెత్తిన చర్చ : గంగుల కమలాకర్



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కారం కోసమో, ప్రభుత్వ విధానాలతో విభేదించి నిరసనలు, ధర్నాలు చేసే వారి వద్దకు మంత్రులను పంపి వారి సమస్యలు విధాన పరమైన విభేదాలకు కారణం తెలుసుకోవాలని సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ 1969 తెలంగాణ ఉద్యమకారులకు 1991లో ఉస్మానియాలో ఆవిర్భవించి తెలంగాణ లిబరేషన్ ఆర్గనైజేషన్ విద్యార్థుల నుంచి మొదలుకొని మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఒయు విద్యార్థులకు వ్యతి రేకంగా ధర్నాలు చేయవద్దని స్లోగన్స్ ఇవ్వద్దని చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని ఆయన సూచించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతున్నంతసేపు బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రన్నింగ్ కామెంటరీ చేయడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తోపాటు కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డికి ఎంత చెప్పినా ఆయన విధానం మార్చుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లు పైర్లు ఎండిపోతున్నాయని దాహార్తి తీర్చాలని చర్చజరగలేదని ఇప్పుడు కొత్తగా ఉమ్మడి రాష్ట్రంలో వినపడిన డిమాండ్ విన పడుతోందని అత్యధిక సభ్యులు కాంగ్రెస్ నుంచి మాట్లాడిన ఎమ్మెల్యేలు సాగునీటికోసం తాగునీటి కోసం జీరో అవర్‌లో డిమాండ్ వినిపించారని ఆయన ఎద్దేవా చేశారు. డి86,87,89 కెనాల్‌లకు నీరు కాకతీయ నుంచి విడుదల చేయాలని సూ చించారు. తన నియోజకవర్గంలో నీరులేక పైర్లు ఎండు తున్నాయని ఆవేదన చెందారు.

# హైడ్రా పేరిట లావాదేవీలు చేస్తే చర్యలు

## అవకతవకలపై ఫిర్యాదు చేయాలన్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** హైడ్రా పేరు చెప్పి లావాదేవీలకు, అవకతవకలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలుంటాయని హైడ్రా హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం కమిషనర్ రంగనాథ్ ఒ.ప్రకటన విడుదల చేశారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు ఆధారాలుంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని లేని పక్షంలో ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి, స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అవకతవకలు నిజమైన పక్షంలో హైడ్రా ఉద్యోగులైతే సస్పెండ్ చేయడంతో పాటు.. కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా కాని.. పరోక్షంగా కాని హైడ్రా పేరును వినియోగించుకుని వసూళ్లకు పాల్పడినా, అవకతవకలు చేసినా వారిపైనా కఠిన చర్యలుం టాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఇప్పటికే పలువురిపై కేసులు కూడా పెట్టామ న్నారు. నోటీసులు ఇచ్చి హైడ్రా లావాదేవీలు చేస్తున్నట్టు ఏవైనా ఫిర్యాదులుంటే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమ దృష్టికి కాని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చున్నారు. గతంలో ఎమ్మెల్యే వాట్సా ప్‌లో సమస్యను చెబితే స్పందించామని ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఫోన్‌లు వస్తే వెంటనే మాట్లాడి సమస్య తెలుసుకోవడం.. ఫిర్యాదుదారులు మెసేజ్ పెట్టినా స్పందించడం సర్వసాధరణంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వ హించే ప్రజావాణిలోనే కాకుండా.. పని దినాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ ప్రజల నుంచి ఫిర్యా దులు స్వీకరిస్తున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు. కాగా రెండురోజుల క్రితం ఎమ్మెల్యేల ఫిర్యాదులకే స్పందన కరువా అని అనిరుధ్‌రెడ్డి ఆరోపణలు చేసినట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు.

# ఏప్రిల్ 4 వరకు 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుల స్వీకరణ

## అదే నెల 30 వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల కేటాయింపు

## బిసి సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్




గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుండి నిరుద్యోగ యువతకు వినూత్న పథకాలు ప్రవేశ పెట్టాలని చేస్తున్న కృషిలో భాగంగా 'రాజీవ్ యువవికాసం' అనే వినూత్న కార్యక్రమాన్ని అమ ల్లోకి తెచ్చిందని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళ వారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాస్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ పథకం కింద నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిం చడానికి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రుణం మం జూరు చేసేందుకు ప్రభు త్వం నిర్ణయిం చిందని అన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీక రణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ నెంబర్, పాస్‌పోర్ట్ ఫొటో మొబైల్ నెంబర్లు ఆన్లైన్లో దర ఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం యువ వికాసానికి మార్చి 17 నుండి ఏప్రిల్ 4 వం కు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అన్నారు. ఏప్రిల్ 6 నుండి 30 వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. క్యాటగిరి1 లో లక్ష వరకు రుణం 80వేల రాయితీ, క్యాటగిరి రెండులో రెండు లక్షల వరకు సహాయం 70 రాయితీ, మూడవ కేటగిరిలో మూడు లక్షల వరకు సహాయం 60 శాతం చొప్పున రాయితీ కల్పించడం జరుగుతుందని శ్రీకాంత్ అన్నారు. గత ప్రభుత్వం యువతను పట్టించుకోకపోవడంతో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు అన్యాయం జరిగిందని, అలా అంటే నష్టం జరగకూడదని తమ ప్రభుత్వం 6000 కోట్ల ప్రణాళికతో రాజీవ్ యువ వికాస్ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. 50 వేల నుంచి 4 లక్షల వరకు రాజీవ్ యువ వికాసం రుణాలు అందజేయడం జరుగు తుంది. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి నాలుగు నుంచి ఐదు వేల మందికి ఉపాధి కలిగిం చే అవకాశం ఉందన్నారు. నిజమైన నిరుద్యో గులకు ఈ పథకం అందాలనే లక్ష్యయంతో ప్రజల పథకంగా దీనిని సిఎం పేర్కొన్నారని అన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

# బలహీనవర్గాల సంక్షేమమే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** బడుగు బలహీనవర్గాల సంక్షేమమే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో కులగణన ఆధారంగా బలహీనవర్గాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం అసెంబ్లీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లి ఖించదగ్గ రోజు అన్నారు. ఈ బిల్లు ఆమోదం సమయంలో తాము సభతో ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిసి బిడ్డకానప్పటికీ సిఎం రేవంత్‌రెడ్డి బలహీనవర్గాల సంక్షేమం కోసం ఆలోచించారని కొని యాడారు. తెలంగాణ కులగణన దేశానికి రోల్ మాడల్ అని రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రస్తావించడం హర్షణీయమన్నారు. గతంతో కులగణనను తప్పుబట్టిన అ ఖిలపక్షాలు బిల్లుకు మద్దతు ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ బిల్లును కేంద్రం తొమ్మిదవ షెడ్యూల్లోతో చేర్చేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని బిల్లు ఆమోదం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**బిల్లుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు : ఎమ్మెల్యే శంకరయ్య**

నుకబడ్డ బలహీన వర్గాలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని 42శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం, ఇందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యే వి.శంకరయ్య పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతున్నదనడానికి ఈ బిల్లు ఆమోదమే నిదర్శనమన్నారు. బిల్లుపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పంది స్తారనే నమ్మకం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో జనాభా ప్రకారం ఎవరి వాటా ఎంతో చూపించే ప్రయత్నంలో భాగంగానే కులగణన చేపట్టామని, బిసిలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మక నిర్ణయమని ఎంఎల్‌ఎ వి.శ్రీహరి అన్నారు. బిల్లు ఆమోదం సమయంలో బిసి నాయకులుగా సభలోఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ అపాయింట్ మెంట్ కోరామని, బిజెపి నేతలు బిల్లు విషయంతో వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**సమస్యల పరిష్కారంలో దాటవేత ధోరణి : బిఆర్ఎస్ ఎమ్మెల్యే డా.సంజయ్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజామస్యల పరిష్కారంలో దాటవేత ధోరణితో వ్యవహరిస్తుందని బిఆర్ఎస్ ఎంఎల్ఎ డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రస్తు తం నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో సమస్యల పై చర్చించాలని కోరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలకు నీళ్ల అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై చర్చ జరగాలని కోరారు. రైతులు రోడ్డు మీదికొచ్చి ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు. మోటర్లు కాలిపోతున్నాయని, నాణ్యమైన కరెంట్ సరఫరా కావడం లేదన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీపై చర్చ జరగాలన్నారు. మాజీ సిఎం కెసిఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉత్తర్వులిచ్చారని, దానిని పక్కకు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. వడ్ల సేకరణపై, రైతు రుణమాఫీపై చర్చించేందుకు క్వశ్చన్ అవర్ ను నిర్వహించాలని ఆయన కోరారు.



ప్రజావాణిలో దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న డా.చిన్నారెడ్డి, దివ్య

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 395

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 18, ప్రభాతవార్త:** మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 395దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 30 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 56దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 145దరఖాస్తులు, వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 88దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణీ ఇంచార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి , స్టేట్ నోడల్ అధికారి దివ్యలు దరఖాస్తుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు.

# వృత్తిని ప్రేమించండి.. బాధ్యతగా పని చేయండి

## మహిళా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల పాసింగ్ పెరేడ్ : ఎక్సైజ్ అకాడమి డైరెక్టర్ అజయ్‌రావు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** ఎక్సైజ్ శాఖ మహిళ కానిస్టేబుళ్లుగా వృత్తిని ప్రేమిస్తూ..బాధ్యతగా పని చేయాలని ఎక్సైజ్‌శాఖ అకాడమి డైరెక్టర్ ఎన్.ఏ. అజయ్‌రావు అన్నారు. మంగళవారం 90 రోజులు ఎక్సైజ్ కానిస్టేబుళ్ళ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన కానిస్టేబుళ్ళ పాస్టింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ మహిళా ఎక్సైజ్ కానిస్టేబుళ్ళ ఎటువంటి సమస్యలు లేకుండా సులభంగా శిక్షణను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆయన బహుమతులతో పాటు సర్టిఫికెట్లను కూడా ప్రధానం చేశారు. అబ్కారీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్యూరి హరికిరణ్ చొరవతో 38 ఎక్సైజ్ బ్యాచ్‌లలలో ఎవరికి రాని బివరిస్, డిస్టలరీ, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించే అవకాశం మీకు వచ్చందన్నారు.
ఈ కార్యక్రమంలో జాయింట్ డైరక్టర్ వి.శశిధర్ రెడ్డి, అసిస్టెంట్ డైరక్టర్ మోహన్‌బాబు, శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ కృష్ణప్రియ, ఎస్‌టిఎఫ్‌ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. డైరక్టర్ చేతులు మీదుగా బహుమతులు అందుకున్న వారిలో సాత్విక, యాక లక్ష్మీ తదితరులు ఉన్నారు.

# సెంట్రల్ వర్సిటి భూముల అమ్మకాన్ని వెంటనే రద్దు చేయాలి

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వెంటనే రద్దు చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించేందుకు ఉస్మానియా యూనివ ర్సిటీలో విధించిన ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, మీడియా స్వేచ్ఛను హరించే చర్యలను ఆపాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలోని 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ అసెంబ్లీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టిన బిజెవైఎం నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సింది పోయి, భావితరాలకు ఉపయోగపడాల్సిన యూనివర్సిటీ భూములను తెగనమ్మి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు నమ్మకద్రోహం చేస్తోందన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడమే అన్నారు.
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2300 ఎకరాలను యూనివర్సిటీకి కేటాయించడం జరిగింది. ఇప్పుడు ఆ భూములను రూ. 10 వేల కోట్ల కోసం అమ్మకానికి పెట్టడం భావితరాల విద్యా హక్కును దారుణంగా కాలరాయడమే. ఉద్యమాల పురిటిగడ్డగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీలో విధించిన ఆంక్షలు అప్రజాస్వామిక చర్య అని, రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా విద్యార్థిలోకం ఆగ్రహావేశాలకు గురకావొద్దని రేవంత్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనూ ఇందిరాపార్క్‌ను ఎత్తివేసే అణిచివేత చర్యలు జరిగాయి. అప్పుడు విద్యార్థి లోకం భగ్గుమన్నది. ఇప్పుడు అదే పరిస్థితి రేవంత్ రెడ్డి పాలనలో జరుగుతుందన్నారు. ప్రశ్నించే విద్యార్థులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంలో ఎంతవరకు న్యాయం? అని ప్రశ్నించారు.



మంగళవారం బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

# స్పీడ్‌పోస్టులో ఇంటి వద్దకే రాముల వారి తలంబ్రాలు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కోసం తపాల శాఖ ద్వారా తలంబ్రాలు నేరుగా ఇంటికి అందిస్తామని తపాలా శాఖ అసిస్టెంట్ డైరక్టర్ శరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలివపారు. భద్రాచలం దేవస్థానం సహకారంతో అంతరాలయ అర్చన తలంబ్రాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన సేవలను మార్చి 12 నుంచే ప్రారంభించామని, ఏప్రిల్ ఒకటివరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. తలంబ్రాలను కోరుకునే భక్తులు సమీపంలోని తపాలా కార్యాలయానికి వెళ్ళి సంబంధిత దరఖాస్తును పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఏప్రిల్ 6 నాటికి స్పీడ్ పోస్టు ద్వారా పంపిస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు రూ. 450 చెల్లించిన వారికి అంతరాలయ అర్చన పది గ్రాముల కల్యాణ తలంబ్రాలు, రెండు ముత్యాలు, కలకంద ప్రసాదం, అక్షింతలు, పసుపు, కుంకుమ, రూ. 150 చెల్లిస్తే ముత్యాల తలంబ్రాలు అందిస్తామన్నారు.

# రెండు రోజులపాటు బ్యాంకుల సమ్మె

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** తమ డిమాండ్ల సాధనకై బ్యాంకులు రెండు రోజుల పాటు సమ్మె చేయనున్నాయి. తొమ్మిది బ్యాంక్ యూనియన్లతో కూడిన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి 25వ తేదీ వరకూ సమ్మె చేయాలని నిర్ణయించాయి. ఈ సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని బ్యాంకులతో పాటు, విదేశీ, సహకార, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో 8 లక్షలకు పైగా అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో యునైటెడ్ ఫోరం తెలిపింది. ప్రధానంగా అన్ని కేడర్లలో సిబ్బంది నియమకం, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వారానికి 5 రోజుల పని విధానం, పనితీరుపై సమీక్ష నిర్ణయం ఉపసంహరణ, అధికారులు, సిబ్బంది మధ్య విభజన, ప్రభుత్వ ఉద్యోగుల పథకం తరహాలో గ్రాట్యుటీని రూ.25 లక్షలకు పెంచడం, ఆదాయం పన్ను తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నట్లు వెల్లడించింది.




# చైతన్యపురి నుంచి ఎన్‌ఎస్‌ఎల్ రెసిడెన్సీకి వర్ధమాన్ బ్యాంకు మార్పు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** వర్ధమాన్ మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌ను చైతన్యపురిలోని సింగిరేణి కాలని ఎన్‌ఎస్‌ఎల్ రెసిడెన్సీకి మార్చారు. ఈ బ్రాంచ్‌ను స్థానిక వినియోగదారుడు ముఖేష్‌కుమార్‌తో కలిసి బ్యాంక్ డైరక్టర్ తుషార్ చావ్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఏ బ్యాంక్‌కు అయిన వినియోగదారులే ముఖ్యమని వారి సహాకరంతోనే సంస్థలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ విశిష్ట అతిథి ఎండి కెవిసుబ్బయ్య, వర్ధమాన్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ శాంతిలాల్‌దాగే, వైస్‌చైర్మన్ నిర్మలదాగే, రాజకుమారి చోర్డియా తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** జాతీయ చేనేత అవార్డుల ప్రధానోత్సవాన్ని పురస్కరించుకుని కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుల కోసం తెలంగాణ చేనేత, జౌళి శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 31 డిసెంబర్ 24 నాటికి సదరు చేనేత కళాకారులు 30 సంవత్సరాల వయోపరిమితి కలిగి,10 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. అదే విధంగా చేనేత డిజైనర్లు 31 డిసెంబర్ 24 నాటికి 25 సంవత్సరాల వయోపరిమితి కలిగి డిజైన్ రంగంలో 5 సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలని కోరింది. ఇందుకు సంబందించిన దరఖాస్తులను ఏప్రిల్ 15లోగా పూర్తి చేసి ఆయా జిల్లా చేనేత,జౌళి శాఖ కార్యాలయానికి పంపాలని కోరింది. పూర్తి వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ హ్యాండ్ టెక్స్ డాట్ తెలంగాణ డాట్ గవర్న్‌కు సంద్రించాలని కోరింది.

# ఎప్‌సెట్‌కు 1.36 లక్షలు దాటిన దరఖాస్తులు

### ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు గడువు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్‌ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025కి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 1,36,425 దరఖాస్తులు వచ్చాయి. ఎప్‌సెట్-2025కి ఈ నెల 1 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు 5010 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం సాయంత్రం వరకు 1,36,425 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్‌కి 98,046 దరఖాస్తులు రాగా.. అగ్రికల్చర్, ఫార్మసీకి 38,273 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి కలిపి 106 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఎప్ సెట్-2025 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయగా.. దరఖాస్తులను మార్చి 1 నుంచి స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఏప్రిల్ 4 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదిల్లో నిర్వహించనుండగా.. ఇంజనీరింగ్ పరీక్షలను మే 2 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు.

# భూమికి చేరుకుంటున్న స్పేస్‌ఎక్స్ వ్యోమగాములు!



**న్యూయార్క్, మార్చి 18:** అంతరిక్షంలో తొమ్మిది రోజుల పరిశోధనలకని వెళ్లి తొమ్మిదినెలలు గడిపిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు ఎట్టకేలకు భూమికి రాగలుగుతున్నారు. స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్10 ఆధ్వర్యంలో ఐఎస్‌ఎస్‌కేంద్రం నుంచి విడివడిన క్యాప్సూల్ భూమివైపునకు రావడంప్రారంభించింది. నాసా వివరాలప్రకారం క్రూ-9 ఉదయం 10.35 గంటలకు వేరపడిందని స్పేస్‌స్టేషన్‌నుంచి క్రూడాక్ విడిపోయి ప్రయాణం ప్రారంభించిందని 17 గంటల్లోనే భూమికి చేరుతుందని వెల్లడించింది. ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ఫాల్కన్9 రాకెట్‌సాయంతో ప్రయోగించింది. ఇద్దరు నేవిపైలెట్లు అయిన సునీత, విల్‌మోర్‌లు గత ఏడాదిజూన్‌ఐదున వెళ్లారు. బోయింగ్‌స్టార్‌లైనర్ సాంకేతిక లోపంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. దీనితో అనిశ్చితిని తొలగించేందుకు నాసా స్పేస్‌ఎక్స్ క్రూ-9 మిషన్ బాధ్యతను అప్పగించింది. డ్రాగన్‌స ప్పేస్‌క్రాఫ్ట్‌ను ఇద్దరు వ్యోమగాములతో ముందు ప్రయోగాత్మకంగాపంపించారు. విపరీతమైన జాప్యం సాంకేతిక సమస్యలతో చివరకు డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ రిలీఫ్‌టమ్‌తో ఆదివారమే చేరుకుంది. నలుగురు వ్యోమగాములతో ఇపుడు భూమికి పయనం ప్రారంభించింది. సునీత విలియమ్స్, విల్‌మోర్, నాసా నిక్‌హేగ్, రోస్‌కాస్మోస్ వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్‌లు భూమికి వస్తున్నారు. వారున్న స్పేస్ సూట్లనుంచి దుస్తులు మార్చుకున్నారు. ఫ్లోరిడా తీరానికి బుధవారం తెల్లవారుఝామున 3.27 గంటలకు చేరుతుంది. 17 గంటలప్రయాణం తర్వాత వీరు అక్కడకు చేరుకుంటారు. అక్కడినుంచి నాసా శాస్త్రవేత్తలు వీరిని క్యాప్సూల్‌నుంచి బయటికి తీసుకువస్తారు. అంతరిక్షంలో అత్యధికకాలం గడిపిన మహిళగా సునీత విలియమ్స్ రికార్డుసాధించారు. అయితే గతంలో అమెరికాకు చెందిన ఫ్రాంక్ రుంబియో 371రోజులు అంతరిక్షంలో గడిపారు. అలాగే రష్యా వ్యోమగామి వలేరి పోల్యాకోవ్ ప్రపంచరికార్డుసాధించారు. 437 రోజులు అంతరిక్షంలో గడిపారు. నాసా శాస్త్రవేత్తలు ఏడు స్ప్లాష్ డౌన్ సైట్లు గుర్తించారు. మూడు గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోను, నాలుగు అట్లాంటిక్ మహాసముద్రంలోను ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల ఆధారంగా స్పేస్‌ఎక్స్ నిపుణులు ఏప్రదేశంలో ల్యాండ్ చేయాలన్న నిర్ణయం తీసుకుని చివరకు ఫ్లోరిడా తీరంలో దిగుతుందని అంచనావేసారు. తుపానులు, గాలి, దిశ, ఉష్ణోగ్రత వంటి అంశాలు పరిశీలించి ప్రదేశాన్ని ఖరారుచేసారు. అందుకోసమే ఫ్లోరిడా తీరంలో స్పేస్ క్యాప్సూల్‌చేరగానే నాసా కేంద్రం శాస్త్రజ్ఞులు సునీత మరోముగ్గురిని అత్యంత జాగ్రత్తగా బయటికి తీసుకురావాల్సి ఉంటుంది. భూమి వాతావరణంలోకి ప్రవేశించేముందు స్పేస్‌ఎక్స్ నౌక రూటు క్లియర్ అవుతుంది. భూమికిచేరుకోడానికి 46 నిమిషాలు పడుతుంది. అంతరిక్షనౌక గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో వస్తుంది. అగ్నిబంతిలా మారుతుంది. భూవాతావరణంలోకి వచ్చాక స్పేస్‌ఎక్స్ నౌకలోని క్యాప్సూల్, ట్రంక్ మాడ్యూల్ వేరవుతాయి. నలుగురు వ్యోమగాములు క్యాప్సూల్‌లోనే ఉంటారు. చివరి ఏడునిమిషాలే అత్యంత కష్టంగా ఉంటుంది. ఆసమయంలో పారాచూట్‌లు తెరుచుకుంటాయి. దీనివల్లస్పేస్‌ఎక్స్ వేగం గంటకు 600 కిలోమీటర్లనుంచి 24 కిలోమీటర్లకు తగ్గుతుంది. చివరకు అంతరిక్ష నౌక నీటిలోపడుతుంది. ఆతర్వాత వ్యోమగాములను సురక్షితంగా వెలికితీసుకువచ్చే ప్రక్రియ మొదలవుతుంది.

# కొత్తగా 47వేల మందికి పెన్షన్లు మంజూరు చేశాం

### శాసనమండలిలో మంత్రి సీతక్క

### హైదరాబాద్ చుట్టూ రీజినల్‌రింగ్‌రోడ్డు నిర్మిస్తున్నాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 47 వేల మందికి కొత్తగా పెన్షన్లను మంజూరు చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శాసనమండలిలో సమాధానమిచ్చారు. మంగళవారం జరిగిన శాసనమండలి సమావేశాల్లో పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. దీంతో బిఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత వ రాష్ట్రంలో 57 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఎప్పటిలోగా పెన్షన్ పథకాన్ని అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి మంత్రి సీతక్క సమాధానమిస్తూ పెన్షన్ పథకం నిరంతరాయంగా కొనసాగే ప్రక్రియ అన్నారు. 57 సంవత్సరాలు దాటిన వారికి ఇప్పటికే పెన్షన్‌ను ఇస్తున్నట్టు తెలిపారు. ఫించన్ అనేది రూ. 15 నుంచి ప్రారంభమై ఇప్పుడు రూ. 2116 వరకు ఇస్తున్నట్టు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా 47వేల మందికి ఫించన్లను మంజూరు చేసినట్టు తెలిపారు. ఆర్థిక వెసులుబాటు చూసుకొని పెన్షన్లను పెంచి.. తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. వృద్ధ కళాకారులకు రూ. 3116 పెన్షనన ఇస్తున్నట్టు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో సభ్యులు ఎగ్గె మల్లేషం అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఒగ్గుకళాకారులకు సాంస్కృతిక సారధిలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన మంత్రి.. వారికి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసే యోచనలేదన్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు టి జీవన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. రూ. 7వేల కోట్లతో 5 ప్యాకేజీల్లో రోడ్డును కేంద్రం సహకారంతో నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. 33 రేడియల్ రోడ్లను నిర్మించే ప్రతిపాదన ఉందన్నారు. రానున్న మూడు, నాలుగేళ్లల్లో పూర్తి చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా నీటి ఎద్దడి లేదని మంత్రి సీతక్క శాసనమండలిలో తెలిపారు. బిఆర్ఎస్ సభ్యుడు తాతా మధు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. హైదరాబాద్‌లోనూ నీటి సమస్య లేదని.. ఎక్కడా అవసరం ఉన్నా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నట్టు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో తలమానికంగా నిలిపేందుకు ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి తరపున ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు తెలిపారు. ఫోర్త్‌సిటీ ఏర్పాటు ఆలోచన లేదని.. ఫ్యూచర్ సిటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు.

# వర్గీకరణకు బిఆర్‌ఎస్‌సహా పలువురు సభ్యుల మద్దతు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అధికార పార్టీ కాంగ్రెస్‌తో పాటు, ప్రతిపక్షానికి చెందిన బిఆర్ఎస్‌తో సహా పలువురు సభ్యులు మద్దతు పలికారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మంగళవారం కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ వర్గీకరణ దశాబ్దాల కల అని చెప్పారు. వివక్షత, అసమానతలకు వర్గీకరణ బిల్లు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కార మార్గాన్ని చూపించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిబద్ధత, చిత్తశుద్ధి, విశ్వసనీయత వల్ల వర్గీకరణ బిల్లు సాధ్యమైందని తెలిపారు. రిజర్వేషన్ ఫలితాలు అణగారిన వర్గాలకు అందించాలనే సంకల్పంతో వర్గీకరణ బిల్లుకు కాంగ్రెస్ ప్రభుత్వం చట్ట బద్ధత కల్పించిందన్నారు. అయితే రాజకీయ లబ్ది పొందాలనుకుంటున్న కొందరు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ అధినాయత్వం ఆశయాలకు అనుగుణంగా వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రశపెట్టి దానికి చట్టబద్దత కల్పించి దేశంలోనే ఆదర్శవంతమైన సీఎంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. వర్గీకరణ కోసం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి బిఆర్ఎస్ సంపూర్ణంగా మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు. తమ పార్టీ హయంలో ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడామన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం ఆమోదానికి పంపడం జరిగిందని తెలిపారు. స్వయంగా కేసీఆర్ ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని కలసి వర్గీకరణపై రాజ్యాంగ సవరణ చేయాలని కోరినట్లు వివరించారు. అయితే ఆ నాటి కేంద్ర ప్రభుత్వం ఈ తీర్మానం పట్ల నాన్చివేత ధోరణితో వ్యవహరించిందని, దీంతో తామ పార్టీ సభ్యులు పార్లమెంట్‌లో సైతం వర్గీకరణపై పోరాటం చేశారని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్, బిజెపిలు ఉన్నా ఎస్సీ వర్గీకరణ విషయమై రాజ్యాంగ సవరణ చేయలేదని విమర్శించారు.

# అభినవ మండల్ రేవంత్‌రెడ్డి: కాంగ్రెస్ నేతల ప్రశంసలు

### బిసి రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ ఉపవర్గీకరణతో చెరగని ముద్ర

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి18:** చరిత్రలో సాహు మహారాజ్, తమిళనాట జస్టిస్ పార్టీ... స్వాతంత్ర్య అనంతరం బి.ఆర్ అంబేడ్కర్, ఆపై బీపీ మండల్.... ఇప్పుడు రేవంత్‌రెడ్డి అంటూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రశంసలు కురిపించారు. తెలంగాణలో 2023, డిసెంబరులో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత బీసీల దశాబ్దాల కల నెరవేరేందుకు అడుగులు పడ్డాయి అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కుల గణన చేపడతామని ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నెరవేర్చారు. కుల గణనను పకడ్బందీగా చేపట్టడంతో పాటు ఆ లెక్కలు.. డెడికేటెడ్ కమిషన్ నియామకంతో బీసీల రిజర్వేషన్ల పెంపునకు బాటలు పర్చారు. బీసీలకు విద్యా సంస్థల్లో ప్రవేశాలు, నియామకాలు, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభ, శాసనసమండలి తీర్మానాలను ఆమోదించాయి. ఇది బీసీల రిజర్వేషన్ల పెంపు చరిత్రలో అరుదైన ఘట్టం అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ అంశంపై ఏకసభ్య కమిషన్ నియమించడంతో పాటు వర్గీకరణ కేసు రాజ్యాంగ ధర్మాసనం ఎదుటకు వచ్చినప్పుడు మంత్రి దామోదర రాజనర్సింహా, ఎస్సీ ఎమ్మెల్యేలను ఢిల్లీకి పంపి న్యాయపరమైన చిక్కులు తొలగించడంలో ఎంతగానో కృషి చేశారు.

# బెట్టింగ్ యాప్ ప్రమోటర్లపై పోలీసుల కొరడా

### ప్రముఖులు, సినీతారలు యూట్యూబర్లకు నోటీసులు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే వారిపై కొరడా ఝుళిపించేందుకు పోలీసులు రెడీ అవుతున్నారు. పోలీసుల వద్ద వున్న సమాచారం ప్రకారం బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ప్రముఖులకు మొదట డిపాజిట్లపై కమీషన్లు, ప్రమోట్ చేసిన కంపెనీల తరపున బెట్టింగ్ చేస్తే అదనపు కమీషన్లు అందుతున్నాయి. పోలీసులు మొదటగా యూట్యూబర్లు, సినీ తారలను విచారించాలని నిర్ణయించి కొందరికి నోటీసులు ఇచ్చారు. దీని తరువాత ఇతరులను విచారించే వీలుంది.

# ప్రాచీన తెలుగు భాష ఎంతో గొప్పది

### రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



పురస్కార గ్రహీతలతో జి.చిన్నారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య, రామచంద్రరావు, శ్రీనివాసాచార్య తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), మార్చి 18, ప్రభాతవార్త :** ప్రాచీనభాషగా గుర్తింపు పొందిన పొందిన తెలుగు భాష చాలా గొప్పనైనదని, దాన్ని పరిరక్షించు కోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి అన్నారు. విశ్వనాథ వేయిపడగలు, భరద్వాజ పాకుడురాళ్ళు, శ్రీశ్రీ మహాప్రస్థానం, సి.నారాయణరెడ్డి విశ్వంభర వంటి అత్యుత్తమ గ్రంథాలు తెలుగు భాషకు వన్నెతెచ్చాయని, అవి చదువుతున్నప్పుడు తెలుగుభాష గొప్పదనం ప్రస్ఫుటమౌతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బొగ్గులకుంట పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. జి.చిన్నారెడ్డి విశిష్ట అతిథులు ఎం.రామచంద్రరావు, జీ.వి.శ్యాం ప్రసాద్, డా. తిరుమల శ్రీనివాసాచార్య, మడుపు ప్రభాకర్‌రావు, బి.గోపాలకృష్ణ, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె,చెన్నయ్య, ప్రాచ్యకళాశాల ప్రధానాచార్యుడు డా. ఎ.సిల్మానాయక్ తదితరులతో కలిసి సారస్వత పరిషత్తు రెడ్డిలాబ్స్ అధినేత డా. అంజిరెడ్డి స్మృత్యర్థం సుదీర్ఘకాలంగా అందిస్తున్న పురస్కారాన్ని సీనియర్ సంపాదకుడు బైస దేవదాసుకు, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డా. బి.ఎన్.శాస్త్రి పురస్కారాన్ని తెలంగాణ చరిత్ర పరిశోధనలో విశేషసేవలందించిన డా. ద్యావనపల్లి సత్యనారాయణకు, ప్రముఖకవి డా. తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖకవి, సినీగీతకర్త మౌనశ్రీ మల్లిక్‌కు, ఓయు తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య మడుపు కులశేఖరరావు స్మారక పురస్కారాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయానికి చెందిన డా. గుండెడప్పు కనకయ్యకు, మాజీ ఎమ్మెల్సీ ఎం.రామచంద్రరావు మాతృమూర్తి నాపరాజు రాఘవసీత పురస్కారాన్ని డా. టి.శ్రీరంగస్వామికి, తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి డా. టి.యాకమ్మకు, బూర్గుల రంగనాథరావు ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖకవి, విమర్శకుడు డా. వి.శంకర్‌కు ప్రదానం చేశారు, పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ. 5వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు.

# సామాజిక న్యాయం కోసం నిబద్ధతతో నిలిచిన కాంగ్రెస్

### అసెంబ్లీలో ఎస్‌సి రిజర్వేషన్ హేతుబద్ధీకరణ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** ఆర్థిక స్వావలంబన కోసం ఉద్యోగాలలో, పాలనల భాగస్వామ్యం కోసం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించినా షెడ్యూల్ కులాల ప్రజలందరికి జనాభా ప్రాతిపదికన పంపిణీ చేయాలనే సదుద్దేశ్యంతో వర్గీక రణ చేపట్టడానికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభు త్వం పూనుకొందని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఐదవ రోజు సిఎం రేవంత్‌రెడ్డి తరుపున మంత్రి దామోదర రాజనర్సింహా ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధీకరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయ సాధికారతకు బాటలు వేస్తున్న నిబద్దత గల నాయకుడు, దార్శనికుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసికులగణ ఎస్సీ వర్గీకరణ అంశాలు దానికి ప్రభల ఉదాహరణ అని ఆయన చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయం దినంగా ప్రకటించారు. రాజనర్సింహా గుర్తుచేసుకొన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉన్నందునే ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది అని దామోదర రాజనర్సింహా చెప్పారు. రిజర్వేషన్ల ఫలాలు అందరికీ అందాల్సిన అవసరం ఉందని కొంత మంది మాత్రమే ఉపయోగిం చుకొంటున్నారని ఎస్సీ వర్గీకరణ జరపాలని మొదట 1965 లోకూర్ కమిటీ సిఫారసు చేసిందని చరిత్రను దామోదర రాజనర్సింహా గుర్తు చేశారు.

# జాబ్ క్యాలెండర్ అమలు చేయరా?

### టిజిపిఎస్‌సి కార్యాలయం వద్ద ఎఐవైఎఫ్ ఆందోళన

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** జాబ్ క్యాలెండర్ ను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగులను మోసం చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నాంపల్లి లోని టీజీపీఎస్సీ కార్యాలయంలో ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఏఐవైఎఫ్ నేతలను లోపలికి అనుమతించలేదు, పోలీసులతో వాగ్వాదం జరగగా, చివరకు ఇన్వార్డ్‌లో ఇవ్వడం జరుగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లక్కంటి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రూపంలో ఒక అభయాన్ని ఇచ్చిందన్నారు. కానీ, ఆచరణలో రకరకాల కారణాలతో జాబ్ క్యాలెండర్ అమలును కాలయాపన ద్వారా నిరక్ష్యం చేస్తోందన్నారు.

# శుభ్రంచేసి ఆరబెట్టిన పసుపు మార్కెట్‌కు తీసుకొని రండి

### మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు మల్లేశం

**నిజామాబాద్(హైదరాబాద్),మార్చి 18,ప్రభాతవార్త:** పసుపు రైతులు శుభ్రం చేసి ఆరబెట్టి పూర్తిగా ఎండిన పసుపును విక్రయానికి మార్కెట్‌కు తీసుకొని రావాలని మార్కెటింగ్ సంయుక్త సంచాలకులు ఇ.మల్లేశం కోరారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును వరంగల్ మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు ఇ.మల్లేశం మంగళవారం సందర్శించారు. రైతులు పండించిన పసుపు పంటను మార్కెట్ రేటుకు అనుగుణంగా దశలవారిగా తీసుకొని రావాలని సూచించారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీలో జీరో అవర్‌లో పసుపురైతులు సిండికేట్ వ్యాపారుల కారణంగా మోసపోతున్నారని తెలపడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

# బిసి రిజర్వేషన్లు, ఎస్సీవర్గీకరణ బిల్లుల ఆమోదంపై హర్షం

### కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర అసెంబ్లీలో రెండు బిల్లులు అమోదం పొందడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతించింది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి కేంద్రంమీద ఒత్తిడి తీసుకొచ్చి చట్టరూపం దాల్చడం కోసం గట్టిగా ప్రయత్నం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 56 శాతం బీసీలున్నారు.

విద్యా, ఉద్యోగాల్లో, అలాగే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, శాసనసభల్లో ఉన్న పార్టీలన్నీ కూడా ఆమోదం తెలియజేశాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కుల గణనకు వ్యతిరేకంగా ఉన్నందున ఈ రకమైన బిల్లులపై వ్యతిరేకత వ్యక్తం చేసే అవకాశముందని.. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా రిజర్వేషన్లు అమలు జరపడం, ఈ రిజర్వేషన్లు వర్గీకరిస్తూ క్రింది తరగతులకు కూడా సామాజిక న్యాయం జరిగేటట్టుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్లమెంట్‌లో చట్టరూపం దాల్చడం కోసం కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలని.. దానికోసం అన్ని పార్టీలు ప్రయత్నం చేయడంతో పాటు, తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, రాష్ట్రంలో శాసనసభ్యులు అందరూ చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి అమలు చేసేందుకు ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కులగణనకు అనుకూలమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చాలా సార్లు చెప్పారని.. కేంద్రంలో ఆపార్టీ కులగణనకు వ్యతిరేకంగా వ్యహరిస్తుందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ నిజంగానే కులగణనకు అనుకూలమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మంగళవారం శాసనసభ ఆమోదించిందని.. దళితులంతా సంఘటితంగా, ఐక్యంగా ఉమ్మడి హక్కుల సాధన కోసం, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు కోసం, కేంద్రం నుండి రావాల్సిన రిజర్వేషన్లల్లో వాటాలను అమలు చేసుకోవడం కోసం కేంద్రంతో కూడా పోరాడాల్సి ఉందన్నారు.

**ఒయులో విధించిన ఆంక్షలు ఎత్తివేయాలి..**

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలను నిషేధిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలియజేస్తున్నట్టు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ దేశంలోనే ప్రతిష్టాత్మకమైందిగా పేరుతెచ్చుకుందని.. అనేక ఉద్యమాలకు నిలయంగా ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం, వామపక్ష పోరాటాలు, విద్యార్థుల సమస్యలపై జరిగిన పోరాటాల పురిటిగడ్డగా వెలుగొందిందని గుర్తు చేశారు. సామాజిక న్యాయంకోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక భావాలపై చర్చలు జరుగుతున్న కేంద్రంగా ఉంటుందన్నారు.

అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల్లో అన్యాయం జరిగిందన్న అంశాలపై నిరసనలు తెలిపి ప్రజలను చైతన్యం చేసే కేంద్రంగా వున్న చరిత్ర కల్గిన యూనివర్సిటీగా ఉందని.. అలాగే నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కని.. విద్యార్థుల వాక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను హరించే విధంగా వున్న ఈ అప్రజాస్వామిక సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించాలని, యూనివర్సిటీలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించే విధంగా చూడాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

ఆట

### ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీలో..

# విజేతగా రష్యా టీనేజ్ స్టార్ మీరా

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ రష్యా టీనేజ్ టెన్నిస్ స్టార్ మిరా ఆండ్రెయెవా రెండో టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సర్క్యూట్‌లో గ్రాండ్‌స్లామ్ టోర్నీ తర్వాత ఉన్నత శ్రేణి టోర్నీ అయిన 1000 సిరీస్‌లో ఆమె వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది. గత నెలలో దుబాయ్ ఓపెన్-1000 టోర్నీలో టైటిల్ సాధించిన ఆండ్రెయెవా తాజాగా ఇండియన్ వెల్స్ ఓపెన్-1000 టోర్నీలో చాంపియన్‌గా అవతరించింది. కాలిఫోర్నియాలో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 17 ఏళ్ల ఆండ్రెయెవా 2-6, 6-4, 6-3తో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్)ను బోల్తా కొట్టించింది. ఈ ఏడాది బ్రిస్బేన్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలలో సబలెంకా చేతిలో ఎదురైన రెండు పరాజయాలకు ఈ గెలుపుతో ఆండ్రెయెవా బదులు తీర్చుకుంది.

2 గంటల 4 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో సబలెంకా తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. అయితే తన లోపాలను సరిదిద్దుకొని రెండో సెట్ నుంచి ఆండ్రెయెవా విజృంభించింది. మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఆండ్రెయెవా నాలుగో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆండ్రెయె వా తన సర్వీస్‌ను కాపాడుకొని సెట్‌ను 6-4తో దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో ఆండ్రెయెవా మూడో గేమ్‌లో, తొమ్మిదో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి 6-3తో సెట్‌తో పాటు, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన ఆండ్రెయె వాకు 11,27,500 డాలర్ల (రూ.9 కోట్ల 77 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు, ఇక రన్నరప్ సబలెంకాకు 5,99,625 డాలర్ల (రూ.5 కోట్ల 19 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఇండియన్ వెల్స్ టైటిల్‌తో ఆండ్రెయెవా తన కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకుంది. ఐదు స్థానాలు ఎగబాకిన ఆండ్రెయెవా ఆరో ర్యాంకును అందుకుంది.



వరల్డ్ నంబర్ వన్ సబలెంకాపై సంచలనం

# బ్యాడ్మింటన్ చాంపియన్‌గా యంగ్

## హోరా హోరీ పోరులో వాంగ్ జి ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, దక్షిణ కొరియాకు చెందిన ఆన్ సె యంగ్ చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ రెండో ర్యాంకర్, చైనాకు చెందిన వాంగ్ జి యి తో బర్మింగ్హామ్‌లో జరిగిన ఫైనల్లో ఆన్ సెయంగ్ 13-21, 21-18, 21-18తో విజయం సాధించింది. 95 నిమిషాల పాటు ఆద్యంతం హోరా హోరీగా జరిగిన ఈ తుది సమరంలో ఆన్ సెయింగ్ కీలక దశలో పాయింట్లు గెలిచి కెరీర్‌లో రెండోసారి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2023లో తొలిసారి ఆన్ సెయింగ్ ఈ టైటిల్‌ను సాధించింది. కాగా పురుషుల సింగిల్స్ విభాగంలో చైనా ప్లేయర్, ప్రపంచ నంబర్ వన్ షియుకీ రెండోసారి ఈ టైటిల్‌ను దక్కించుకున్నాడు. తొలిసారి 2018లో విజేతగా నిలిచిన షియుకీ ఫైనల్లో 21-17, 21-19తో చైనీస్ తైపీకి చెందిన లీ చియా హోవ్‌పై నెగ్గాడు. విజేతగా నిలిచిన ఆన్‌సెయింగ్, షియుకీలకు 1,01,500డాలర్ల (రూ.88లక్షలు) చొప్పున ప్రైజ్ మనీ లభించింది.




# ఐపిఎల్‌లో పాక్ క్రికెటర్లు

## బ్యాన్ ఉన్నా షరతులు వర్తిస్తాయి

### వివిధ ఫ్రాంచైజీల తరఫున ముగ్గురు ఆటగాళ్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రెండో లీగ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 టోర్నమెంట్ మరో 74 గంటల్లో ప్రారంభం కాబోతుంది. ఈ నెల 22వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ కొనసాగుతుంది. దాదాపు 75 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్ కోసం అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ టోర్నమెంట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే 10 ఫ్రాంచైజీలకు చెందిన జట్లు ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాయి. తమ హోమ్ గ్రౌండ్ లో గంటల తరబడి ప్లేయర్లందరూ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ కు సంబంధించిన మెగా వేలంలో చాలామంది ప్లేయర్లు భారీ ధర పలికారు. ఈ నేపథ్యంలో ఈసారి ఐపీఎల్ పైన అందరూ చాలా అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఈ ఐపీఎల్ టోర్నమెంటులో పాకిస్తాన్ ప్లేయర్లు ఎవరు ఆడడం లేదన్న సంగతి తెలిసిందే. వాళ్లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి బ్యాన్ విధించింది. 2008 సంవత్సరంలో జరిగిన ముంబై ఉగ్రవాదుల అరాచకాల నేపథ్యంలో పాకిస్తాన్ ప్లేయర్లను ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి తొలగించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ బ్యాన్ కొనసాగుతోంది. అయితే పాకిస్తాన్ ప్లేయర్ల పైన బ్యాన్ ఉన్నప్పటికీ కొంతమంది ప్లేయర్లు మాత్రం ఐపీఎల్ ఆడుతున్నారు. పాకిస్తాన్‌లో పుట్టినా ఆ తర్వాత విదేశాల్లో స్థిరపడ్డ వాళ్లు మాత్రం ఐపీఎల్ ఆడుతున్నారు. వాళ్లకు పాకిస్తాన్ పౌరసత్వం కాకుండా వేరే దేశాల పౌరసత్వం ఉంది కాబట్టి భారత క్రికెట్ నియంత్రణ మండలి పర్మిషన్స్ ఇచ్చింది. అటువంటి వారిలో పాక్‌లో పుట్టి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డ ప్లేయర్లలో ఇమ్రాన్ తాహిర్ ఉన్నాడు. లాహోర్ లో పుట్టిన ఇమ్రాన్ తాహిర్ 2011 ప్రపంచ కప్ తర్వాత సౌతాఫ్రికా పౌరసత్వం తీసుకున్నాడు. ఈ తరుణంలోనే 2014 సంవత్సరంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అవకాశం దక్కించుకున్నాడు ఇమ్రాన్ తాహీర్. ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు కూడా ఆడాడు. అలాగే సికిందర్ రాజా కూడా పాకిస్తాన్ లోనే పుట్టాడు. కానీ జింబాబ్వే వారసత్వాన్ని దక్కించుకున్నాడు. పాకిస్తాన్ లోని సియాల్ కోటలో రాజా జన్మించినట్లు చెబుతున్నారు. కానీ బతుకుదెరువు కోసం పాకిస్తాన్ వదిలి జింబాబ్వే వెళ్లారట. ఈ నేపథ్యంలోనే 2023 సంవత్సరంలో పంజాబ్ కింగ్స్ తరఫున ఐపిఎల్ లో బరిలోకి దిగాడు. మరో క్రికెటర్ ఉస్మాన్ కవాజా కూడా పాకిస్తాన్ వాడే. ఇస్లామాబాదులో జన్మించిన ఉస్మాన్ 2016 సంవత్సరంలో ఐపిఎల్ లోకి వచ్చాడు. రైజింగ్ పూణే సూపర్ జెంట్స్ జట్టు తరఫున ఆడిన ఉస్మాన్ కవాజా ఆ తర్వాత ఐపీఎల్‌కు దూరమయ్యాడు. అటు పాక్ మాజీ ఆటగాడు మహ్మద్ అమీర్ కూడా ఐపీఎల్ 2026 లో ఎంట్రీ ఇస్తాడట. బ్రిటీష్ పౌరసత్వం తీసుకున్న మహ్మద్ అమీర్ ఐపీఎల్‌లో ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు.












# ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు ఓకే

**న్యూఢిల్లీ:** సుదీర్ఘ వివాదాలు, పరిపాలన గందరగోళాల అనంతరం బాక్సింగ్‌ను 2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో అధికారికంగా చేర్చేందుకు మార్గం సుగమం అయింది. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రెసిడెంట్ థామస్ బాచ్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు 2028 ఒలింపిక్ ప్రోగ్రామ్‌లో బాక్సింగ్‌ను చేర్చేందుకు అనుమతిని ఇచ్చింది. ఈ వారంలో సుమారు 100 మంది ఐఓసీ సభ్యుల నుంచి తుది ఆమోదం వచ్చే అవకాశం ఉన్నాయి. కాగా 2019లో పరిపాలన, ఆర్థిక వివాదాల కారణంగా రష్యా ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ)తో ఐఓసీ సంబంధాలు తెంచుకుంది. 2023లో ఐబీఏను ఒలింపిక్ గేమ్స్ జాబితా నుంచి పూర్తిగా తొలగించింది. టోక్యో, పారిస్ ఒలింపిక్స్లో ఐఓసీ స్వతంత్రంగా బాక్సింగ్ ఈవెంట్లను నిర్వహించింది. ఈ క్రమంలో కొన్ని దేశాలు కలిసి వరల్డ్ బాక్సింగ్ అనే కొత్త పరిపాలనా సంస్థను ఏర్పాటు చేశాయి. ఇటీవలే వరల్డ్ బాక్సింగ్‌కు ఐఓసీ అధికారిక గుర్తింపు ఇచ్చింది. దీనికి అమెరికా, బ్రిటన్, ఇండియా, చైనా తదితర ప్రధాన ఒలింపిక్ దేశాలు దీనికి మద్దతు పలికాయి. రష్యా, స్పెయిన్‌తో పాటు, కొన్నిఆఫ్రికన్ దేశాలు ఈ ఫెడరేషన్లో చేరలేదు. ఈ ప్రతిపాదనకు ఐఓసీ సెషన్ ఆమోదం తెలుపుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రపంచంలోని బాక్సర్లంతా తమ నేషనల్ ఫెడరేషన్ వరల్డ్ బాక్సింగ్‌నుంచి గుర్తింపుపొందేలా చేస్తే 2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో పోటీపడే అవకాశం లభిస్తుందని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రెసిడెంట్ థామస్ బాచ్ తెలిపారు.

# చిత్తుగా ఓడిన పాకిస్థాన్

## రెండో వన్డే: న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఐదు టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న పాక్ క్రికెట్ జట్టుకు మరో పరాభవం ఎదురైంది. టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు పాకిస్తాన్ 5వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. వర్షం కారణంగా 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 9 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. 46 పరుగులు చేసిన కెప్టెన్ సల్మాన్ అఘా టాప్ స్కోరర్గా నిలువగా, షాదా బ్ ఖాన్ (26), షాహీన్ అఫ్రిది (22 నాటౌట్), మహ్మద్ హారీస్ (11), ఇర్ఫాన్ ఖాన్ (11), అబ్దుల్ సమద్ (11) రెండంకెల స్కోర్లు చేశారు. పాక్ ఇన్నింగ్స్‌లో హసన్ నవాజ్ (0), ఖుష్దిల్ షా (2), జహన్దాద్ ఖాన్(0), హారీస్‌రౌఫ్(1) దారుణంగా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేకబ్ డఫీ, బెన్ సియర్స్, జిమ్మీ నీషమ్, ఐష్ సోధి తలో 2 వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు టిమ్ స్టీఫర్ట్ (22 బంతుల్లో 45), ఫిన్ అలెన్ (16 బంతుల్లో 32) చెలరేగిపోయారు. వీరద్దరి ధాటికి న్యూజిలాండ్ 4 ఓవర్లలోనే 50 పరుగుల మార్కును తాకింది. పాక్ స్టార్‌పేసర్ షాహీన్ అఫ్రిదివేసిన ఇన్నింగ్స్ 3వఓవర్లో టిమ్ సీఫర్ట్ శివాలెత్తిపోయాడు. ఈ ఓవర్లో సీఫర్ట్ ఏకంగా 4 సిక్సర్లు బాదాడు. అంతకు ముందు మొహమ్మద్ అలీ వేసిన రెండో ఓవర్లో ఫిన్ అలెన్ కూడా చెలరేగాడు. ఈ ఓవర్లో అలెన్ 3 సిక్సర్లు కొట్టాడు. వీరిద్దరూ క్రీజ్‌లో ఉండగా మ్యాచ్ 10 ఓవర్లలోనే ముగిస్తుందని అంతా అనుకున్నారు. అయితే పాక్ బౌలర్లు ఒక్కసారిగా ఫామ్‌లోకి రావడంతో న్యూజిలాండ్ 31 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. మార్క్ చాప్‌మన్ (1), డారిల్ మిచెల్ (15), జిమ్మీ నీషమ్ (5) తక్కువ స్కోర్లకే ఔట్ కాగా, మిచెల్ హే (21 నాటౌట్), కెప్టెన్ బ్రేస్‌వెల్ (5 నాటౌట్) న్యూజిలాండ్‌ను విజయతీరాలకు చేర్చారు. దీంతోన్యూజిలాండ్ 13.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. పాక్ బౌలర్లలో హారీస్ రౌఫ్2, మొహమ్మద్ అలీ, ఖుష్దిల్‌షా, జహన్దాద్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. ఈగెలుపుతో న్యూజిలాండ్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది.




# గోల్డ్ ఇటిఎఫ్‌లకు పెరుగుతున్న డిమాండ్

**ముంబై, మార్చి 18:** సెంట్రల్ బ్యాంకులు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఇటిఎఫ్) పెట్టుబడిదారులు 2025లో బంగారం డిమాండ్‌కు కీలక చోదకులుగా మారతారని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు ఆర్థిక అనిశ్చితులు బంగారం ధరలను పెంచుతాయని భావిస్తున్నారు. అయితే కేంద్ర బ్యాంకుల చర్యలు బంగారం ధరలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ప్రైవేట్ వెల్త్ నివేదిక ప్రకారం, 2024లో భారతదేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచే పెట్టుబడి ఎంపికల్లో బంగారం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుంది. 2024లో బంగారం ఏకంగా పెట్టుబడిదారులకు 21 శాతం రాబడిని అందించింది. భారత మార్కెట్ బంగారంపై బలమైన పెట్టుబడి ఆసక్తిని కనబరిచింది. ముఖ్యంగా గోల్డ్ ఈటీఎఫ్‌లలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు రావడం వల్ల ఈ స్థాయి వృద్ధి నమోదైంది 2024లో భారతీయ గోల్డ్ ఈటీఎఫ్‌లు 112 బిలియన్ల నికర పెట్టుబడులను నమోదు చేశాయి. 2024 సంవత్సరం చివరి నాటికి 57.8 టన్నులకు చేరుకుంది. ఈ వృద్ధి సంస్థాగత, రిటైల్ పెట్టుబడిదారుల నుంచి బలమైన డిమాండ్‌ను సూచిస్తుందని నివేదికలు పేర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా బంగారం నిల్వల ధోరణిని కొనసాగించింది. 2024లో దాని నిల్వలకు 72.6 టన్నుల బంగారాన్ని జోడించింది. దీనితో దాని మొత్తం నిల్వలు 876 టన్నులకు చేరుకున్నాయి. ఏడో ఏడాది ఆర్‌బీఐ నికర బంగారం కొనుగోలుదారుగా నిలిచింది. బంగారం ఇప్పుడు ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వలలో 10.6 శాతంగా ఉంది. అధిక ధరలు ఆభరణాల డిమాండ్‌ను ప్రభావితం చేసినప్పటికీ భౌతిక బంగారం, ముఖ్యంగా కడ్డీలు, నాణేలకు పెట్టుబడి డిమాండ్ బలంగా ఉంది. అధిక ధరల కారణంగా 2024లో డిమాండ్ తగ్గినప్పటికీ వివాహాల సీజన్ కొనుగోళ్ల కారణంగా జనవరి మధ్యలో క్రమంగా కోలుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ కోలుకోవడంలో ధరల స్థిరత్వం కీలక అంశంగా ఉంటుంది. వెండి విషయానికి వస్తే గత నాలుగు సంవత్సరాలుగా సరఫరాలో నిరంతర లోటు ఉందని, డిమాండ్ సరఫరాను మించి పోయిందని, దీనివల్ల వెండి ధరలు కూడా పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. 2020 నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఇది ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా చైనాలో తయారీ, పారిశ్రామికకార్యకలాపాలు మరియు గ్రీన్ టెక్నాలజీలలో సంభావ్య వృద్ధి కారణంగా ఈ స్థాయి వృద్ధి నమోదవుతుంది. అయితే వెండి బంగారం కంటే ఎక్కువ అస్థిరంగా ఉంటుంది. భారతీయ ఈక్విటీల మాదిరిగానే ధరల హెచ్చు తగ్గులను చూపుతుంది. అందువల్ల పోర్ట్ ఫోలియోలలో బంగారం దీర్ఘకాలిక వ్యూహాత్మక ఆస్తిగా ఉపయోగపడుతుంది.



# ఐపిఓకు అమెజాన్!

**వాషింగ్టన్, మార్చి 18:** అమెరికాకు చెందిన ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ దేశీయంగా తొలి పబ్లిక్ ఇష్యూకు (ఐపిఒ) రావాలని యోచిస్తోంది. తన భారత్ యూనిట్‌ను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. దీనికోసం చర్చలు ప్రారంభించిందని కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. జేపీ మోర్గాన్‌తో పాటు, భారతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులతో అమెజాన్ చర్చలు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనికోసం గత వారంలో 810 బ్యాంకులను ఆహ్వానించిందని సమాచారం. దేశీయ ఇ కామర్స్ సంస్థలు మాత్రమే ఇన్వెంటరీ మోడల్‌ను కలిగి ఉండడానికి భారత్ నిబంధనలు అనుమతిస్తాయి. అప్పుడు వేగంగా డెలివరీలను పూర్తి చేసేందుకు, షిప్పింగ్ ఖర్చుల్ని ఆదా చేసేందుకు వీలు పడుతుంది. విదేశీ సంస్థలు కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్‌ప్లేస్ మోడల్‌గా మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుంది. ఐపీఓకు రావడం ద్వారా డేటా లోకలైజ్ చేయడంతో పాటు, ఇన్వెంటరీ మోడల్‌ను కూడా కలిగిఉండొచ్చన్నది అమెజాన్ ఆలోచనగా ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారీ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 900 పాయింట్లు జంప్ మరోవైపు ఇ-కామర్స్ మార్కెట్ వాటాలో ఫ్లిప్‌కార్ట్ కంటే అమెజాన్ కాస్త వెనకపడి ఉంది. ముఖ్యంగా మెట్రోయేతర నగరాలపై దృష్టిసారించడం ద్వారా ఫ్లిప్‌కార్ట్ కస్టమర్ల బేస్‌ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. అలాగే, 2025 చివరిలో లేదా 2026 ప్రారంభంలో ఐపీఓకు రానుంది. అందులో భాగంగా తొలుత తన హోల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. ఈనేపథ్యంలో అమెజాన్ పబ్లిక్ ఇష్యూ కోసం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు క్విక్‌కామర్స్ స్టార్టప్‌లైన ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్, జెప్టో నుంచి అమెజాన్ పోటీని ఎదుర్కొంటోంది. దీంతో కన్జూమర్ ఎలక్ట్రానిక్స్‌ను వేగంగా డెలివరీ చేసేందుకు తాజాగా బెంగళూరులోఅమెజాన్ నౌ పేరిట క్విక్ కామర్స్ సర్వీస్‌లను ప్రారంభించింది.




# రూ.750 కోట్లతో రియాల్టీ కంపెనీ కొనుగోలు

**ముంబై, మార్చి 18:** దేశీయ రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్‌ను కొనుగోలుచేస్తున్న గ్లోబల్ పెట్టుబడుల దిగ్గజం బ్లాక్‌స్టోన్ తాజాగా సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఇందుకు షేరుకు రూ.329 ధరలో దాదాపు రూ.759 కోట్లు వెచ్చించనుంది. తొలుత ప్రమోటర్ల నుంచి 25.7 శాతం వాటా సొంతం చేసుకోనున్నట్లు గత వారం ప్రకటించిన విషయంవిదితమే. ఇందుకు రూ.750 కోట్లు కేటాయించనుంది. మరోవైపు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో దాదాపు 1.27 కోట్ల ఈక్విటీ షేర్ల కోసం రూ.417 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో మరో 14.3శాతం వాటా చేజిక్కించుకోనుంది. వెరసి 40శాతం వాటాకు రూ.1,157 కోట్లు వెచ్చించనుంది. ఈ బాటలో సాధారణ వాటాదారుల నుంచి మరో 26శాతం వాటా కొనుగోలుకి తాజాగా ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. బ్లాక్‌స్టోన్ గ్రూప్ సంస్థలు పబ్లిక్ వాటాదారుల నుంచి 2.3 కోట్ల షేర్లు కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ప్రకటించినట్లు కోల్టే పాటిల్ తాజాగా స్టాక్ ఎక్ఛేంజీలకు సమాచారమిచ్చింది. షేరుకి రూ.329 ధరలో ఆఫర్ ఇచ్చినట్లు తెలియచేసింది. దీంతో కంపెనీలో బ్లాక్ స్టోన్ మొత్తం 66శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు పేర్కొంది. ఇందుకు రూ.1,800 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించింది. గత రెండు దశాబ్దాలలో దేశీయంగా 50 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసిన బ్లాక్‌స్టోన్, పెట్టుబడులను 100 బిలియన్‌డాలర్లకు పెంచనున్నట్లు ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో తాజా కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా కోల్టే పాటిల్‌లో ప్రస్తుతం ప్రమోటర్లకు 69.45శాతం వాటా ఉంది. దేశీయ పెయింట్ల బిజినెస్‌ను విక్రయించే ప్రణాళికల్లో ఉన్న డచ్ దిగ్గజం ఆక్జో నోబెల్‌కు తాజాగా బ్లాక్‌స్టోన్ నాన్‌బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.




## వాణిజ్యం

# లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు

**ముంబై, మార్చి 18:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు దేశీయంగా ఫైనాన్షియల్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో వరుసగా రెండోరోజూ సూచీలు లాభపడ్డాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర లాభపడగా, నిఫ్టీ 22,800 ఎగువన ముగిసింది. అన్ని రంగాల షేర్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,608.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,169.95) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,385.76 గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1131.31 పాయింట్లు లాభపడి 75,301.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 325.55 పాయింట్ల లాభంతో 22,834.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 బలపడి 86.54గా ఉంది. జొమాటో, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ నష్టాలు చవిచూశాయి. అమెరికా మార్కెట్లతో పాటు, ఆసియా మార్కెట్లలో ర్యాలీ కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ అది ప్రతిబింబించింది. చైనా ఉద్దీపన చర్యల కారణంగా హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2 శాతం మేర లాభంతో మూడేళ్ల గరిష్ఠానికి చేరింది. అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో చైనా తీసుకున్న ఉద్దీపన చర్యలకు దిగింది. వినియోగాన్ని పెంచేందుకు అక్కడి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి మెటల్‌కు డిమాండ్ పెరుగుతుందనే అంచనాలతో ఆ రంగ స్టాక్స్ లాభపడ్డాయి. వాణిజ్య యుద్ధభయాలతో చాలాకాలంగా మార్కెట్లు నష్టాల్లోనే ట్రేడయ్యాయి. వరుస నష్టాల నేపథ్యంలో చాలా కంపెనీల స్టాక్స్ ఆకర్షణీయంగా ఉన్నాయని విశ్లేషకులు తమ అభిప్రాయాలు వ్యక్తంచేయడం మార్కెట్‌కు కలిసొచ్చింది.




# స్టార్‌లింక్‌కు భారత్‌లో స్పెక్ట్రమ్ పన్ను!

**న్యూఢిల్లీ, మార్చి 18:** శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం అపరకుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో దేశీయఅగ్రగామి టెలికాంసంస్థలు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మరికొద్ది రోజుల్లో భారత్‌లో స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే, దీనికి అనుమతులి చ్చేందుకు కేంద్రం కఠిన షరతులు విధించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. తాజాగా 'పన్ను' సవాళ్లు కూడా ఎదురవుతున్నట్లుతెలుస్తోంది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు స్పెక్ట్రమ్ పన్ను విధించే అవకాశాలు న్నట్లు సమాచారం. ఈ పన్ను విధిస్తే దేశంలో శాట్‌కామ్ వెంచర్‌కు సర్వీస్ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. దేశీయ నెట్‌వర్క్ ప్రొవైడర్లయిన రిలయన్స్‌జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాకు కొన్నేళ్లక్రితమే ఈస్పెక్ట్రమ్ పన్నును రద్దు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో స్టార్‌లింక్ సేవల ద్వారా కంపెనీకి వచ్చే సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్)పై దాదాపు 3శాతం స్పెక్ట్రమ్ వినియోగ రుసుము విధించే అంశంపై కేంద్రం యోచిస్తున్నట్లు కథనాలుపేర్కొన్నాయి. "వేలానికి బదులుగా శాటిలైట్ ఆపరేటర్లకు నేరుగా స్పెక్ట్రమ్‌ను కేటాయిస్తున్నందున.. ఈ వినియోగ ఛార్జీలు వర్తిస్తాయి. అంటే.. టెల్కోలు చెల్లించే 8శాతంలైసెన్సు ఫీజు మాత్రమే కాకుండా.. శాట్ కామ్ ఆపరేటర్లు స్పెక్ట్రమ్ కోసం అదనపు ఛార్జీలు కట్టాల్సి ఉంటుంది. అది ఏజీఆర్‌పై 3శాతం కంటే ఎక్కువ కూడా ఉండొచ్చు. ఇందుకు సంబంధించిన తుది రేట్లపై చర్చలు జరుగుతున్నాయి" అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ ఛార్జీలు, శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపు కాలవ్యవధి వంటి అంశాలు ట్రాయ్‌వద్ద చర్చల దశలో ఉన్నాయి.



# పెరగనున్న టాటా మోటార్స్ ధరలు

**ముంబై, మార్చి 18:** 2025, ఏప్రిల్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాలతో సహా తన ప్రయాణీకుల వాహన ధరలను పెంచాలని యోచిస్తున్నట్లు టాటా మోటార్స్ మంగళవారం తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల ప్రభావాన్ని పాక్షికంగా భర్తీచేయడానికి ఈధరల సర్దుబాటు చేపట్టబోతున్నట్లు సంస్థ పేర్కొంది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు పరిధి మారుతుందని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జనవరి లోనే, కంపెనీతన ప్రయాణీకుల వాహన పోర్ట్‌ఫోలియో ధరలను 3 శాతం వరకు పెంచింది. టాటామోటార్స్ వివిధ రకాల ప్యాసింజర్ వాహనాలను విక్రయిస్తోంది. వాటిలో రూ.5 లక్షల నుంచి రూ.25.09 లక్షల ధరల (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ) వరకు ఎలక్ట్రిక్ వాహనాలు కూడా ఉన్నాయి. టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాల శ్రేణి ధరలను సైతం వచ్చే నెల నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు సోమవారం తెలిపింది. మారుతి సుజుకీ ఇండియా కూడా తన మొత్తం మోడల్ శ్రేణి ధరలను వచ్చే నెల నుంచి 4 శాతం వరకు పెంచాలని యోచిస్తున్నట్లు ఇప్పటికే తెలిపింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.